SAPTHAGIRI (TELUGU)
ILLUSTRATED MONTHLY
Volume: 52, Issue: 10
March-2022, Price Rs.5/-

తిరుమల తిరుపతి దేవస్థానములు

# సప్తగిరి

సచిత్రమాసపత్రిక

మార్చి 2022 వెల రూ.5/-

పుటలు-56



నాగులాపురం శ్రీవేదనారాయణస్వామివారి సూర్యపూజ, తెప్పోత్సవం
(24-03-2022 నుండి 28-03-2022 వరకు)



తిరుమల తిరుపతి దేవస్థానములు

# ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామివారి బ్రహ్మోత్సవాలు

## 2022 ఏప్రిల్ 10 నుండి 18 వరకు

10-04-2022
ఆదివారం
పగలు: ధ్వజారోహణం
రాత్రి: శేషవాహనం

11-04-2022
సోమవారం
పగలు: వేణుగానాలంకారం
రాత్రి: హంసవాహనం

12-04-2022
మంగళవారం
పగలు:
వటపత్రశాయి అలంకారం
రాత్రి: సింహవాహనం

13-04-2022
బుధవారం
పగలు:
నవనీత కృష్ణాలంకారం
రాత్రి: హనుమత్సేవ


14-04-2022
గురువారం
పగలు: మోహినీసేవ
రాత్రి: గరుడసేవ

15-04-2022
శుక్రవారం
పగలు: శివధనుర్బాణాలంకారం
రాత్రి: ఎదుర్కోలు,
కల్యాణోత్సవం, గజవాహనం

16-04-2022
శనివారం
పగలు: రథోత్సవం

17-04-2022
ఆదివారం
పగలు:
కాళీయమర్దనాలంకారం
రాత్రి: అశ్వవాహనం

18-04-2022
సోమవారం
పగలు: చక్రతీర్థం
రాత్రి: ధ్వజావరోహణం



# గీతాశ్లోకార్థసారం

**శ్లో :** యేషామర్థే కాంక్షితం నో రాజ్యం భోగాః సుఖాని చ ।
త ఇమేఽ వస్థితా యుద్ధే ప్రాణాంస్త్యక్త్వా ధనాని చ ॥

(శ్రీమద్భగవద్గీత 01వ అధ్యాయం- 33వ శ్లోకం)

**ప్రతిపదార్థం:** యేషామ్, అర్థే= ఎవరికొఱకైతే; రాజ్యమ్= రాజ్యమును; భోగాః= భోగములును; సుఖాని, చ= సుఖములును, నః= మాకు; కాంక్షితమ్= అభీష్టమో, (అభీష్టములో); తే= వారును; ఇమే= వీరును– అందఱును; ధనాని= సంపదలపైనను; చ= మరియు; ప్రాణాన్= ప్రాణములపైనను; త్యక్త్వా= (ఆశలను) వదలుకొని; యుద్ధే= యుద్ధమునందు; అవస్థితాః= నిలిచి(సన్నద్ధులై)యున్నారు.

**భావం:** మనము ఎవరికై ఈ రాజ్యమును, భోగములను, సుఖములను కోరుకొనుచున్నామో, వారే ధనప్రాణములయెడ ఆశలు వదులుకొని యుద్ధమునకు వచ్చియున్నారు.

## వైకుంఠనగరము వాకిలే నీ యాకారము

దేవునికి దేవికిని తెప్పల కోనేటమ్మ
వేవేలు మొక్కులు లోకపావని నీ కమ్మా ॥

ధర్మార్థకామ మోక్షతతులు నీ సోపానాలు
అర్మిలి నాలుగువేదా లదె నీ దరులు
నిర్మలపు నీ జలము నిండు సప్తసాగరాలు
కూర్మము నీ లోఁతు వో కోనేరమ్మా ॥

తగిన గంగాదితీర్థములు నీకడళ్లు
జగతి దేవతలు నీ జలజంతులు
గగనపుఁబుణ్యలోకాలు నీ దరిమేడలు
మొగి నీచుట్టు మాఁకులు మునుఁలోయమ్మా॥

వైకుంఠనగరము వాకిలే నీ యాకారము
చేకొను పుణ్యములే నీ జీవభావము
యేకడను శ్రీ వేంకటేశుఁడే నీ వునికి
దీకొని నీ తీర్థమాడితిమి కావవమ్మా ॥

(ఆధ్యాత్మ సంకీర్తన 2-426)



*శ్రీదేవికి శ్రీవేంకటేశ్వరునికి తెప్పోత్సవం జరుగుతోంది. అన్నమయ్య ఆ కోనేటి మాహాత్మ్యాన్ని వర్ణిస్తున్నాడు.*

*ఓ కోనేటితల్లీ! నీవు లోకములను పావనము చేయు దానవమ్మా. దేవదేవుడు నీలో తెప్పోత్సవం జరుపుకుంటున్నాడు. నీ మహిమని ఎంతయని వర్ణించను నీకిదే వందనములు.*



*చతుర్విధ పురుషార్థములు నీకు సోపానపంక్తులు. నాల్గువేదములు తీరములు, నిర్మలమైన నీ నీరు సప్తసాగరాలు. గంభీరమైన నీ లోతు మందరపర్వతమును తేల్చిన ఆదికూర్మమువంటిది.*

*నీ అలలు గంగాది పవిత్రమైన నదులవంటివి. నీలోని జలజంతువులు యక్ష కిన్నెర కింపురుషాది దేవతలు. నీ ఒడ్డున ఉన్న మేడలన్నీ ఊర్ధ్వలోకాది పుణ్యలోకములే. నీ చుట్టూ ఉన్న చెట్లన్నీ తపస్సమాధిలో ఉన్న మునీశ్వరులే.*

*ఓ కోనేటమ్మా! నీ ఆకారము నాకు వైకుంఠాన్ని తలపిస్తోంది. నీయందు తీర్థస్నానముతో పొందే పుణ్యములు నీ జీవభావం. శ్రీవేంకటేశ్వరుడే ఉనికి. నిర్భయంగా నీలో తీర్థస్నానమాచరించే మమ్ము రక్షింపవమ్మా!*

# కట్టెదుర వైకుంఠము

- డా॥ శ్రీమతి మైలవరపు లలితకుమారి,
99595 10422

"మోక్షసాధన సామాగ్ర్యాం భక్తి రేవ గరీయసీ" అంటారు. ముక్తిని పొందటానికి భక్తి, జ్ఞాన, కర్మమార్గాల్లో భక్తిమార్గమే గొప్పది.

శ్రవణం కీర్తనం విష్ణోః
స్మరణం పాదసేవనం
అర్చనం వందనం
దాస్యం సఖ్యమాత్మనివేదనం

అని తొమ్మిదివిధాలుగా భాగవతం నందు పేర్కొనబడింది. ఈ తొమ్మిది భక్తి మార్గాల్లో ఏ మార్గాన్ని అనుసరించి అయినా భగవంతుని చేరవచ్చు. వాటిలో సంకీర్తనంద్వారా ముక్తినందిన భక్తవరేణ్యుడు అన్నమయ్య.

అన్నమాచార్యులు కడపజిల్లా తాళ్లపాక గ్రామంలో శ్రీహరి వరప్రసాదంగా భగవదంశతో జన్మించాడు. గర్భస్థదశనుండి కలియుగదైవమైన శ్రీవేంకటేశ్వరుని నామోచ్చారణం తప్ప అన్యం తెలియనివాడు. ఉగ్గుపాలతో తల్లి రంగరించిపోసిన భక్తి వయసుతోపాటుగా నిత్యవర్ధనమయింది. వెంకన్నకు మేలుకొలుపులతో నిదురలేచే అన్నమయ్య ఆ స్వామి పవళింపుతోనే నిదురించేవాడు. గురువులు చెప్పిన శాస్త్రాలను ఒక్కసారి శ్రవణం చేసినంతనే నేర్చేవాడు. ఆతని ప్రతిభావ్యుత్పత్తి, అభ్యాసాదులను గ్రహించిన గురువులు ఆశ్చర్యచకితులయ్యారు. తల్లిలాలనలో, తండ్రిపాలనలో, గురుశుశ్రూషలో నేర్చినదానికన్నా మిన్నగా అన్నమయ్య ప్రకృతిఒడిలో నేర్చింది అనంతం.


పిన్ననాటినుండి పల్లెపడుచులు, శ్రామికులు పాడే జానపదగీతాలకు తల ఊపి ఆనందించేవాడు. అతడి వైఖరిని చూచిన తండ్రి, అన్నమయ్యను చేరదీసి ఆ పిచ్చి పాటలను మాని ఇంటిపనులను చూడాల్సిందిగా ఆజ్ఞాపించాడు. ఒకనాడు అన్నమయ్య తల్లి ఇచ్చిన కాసు కొంగున కట్టుకుని, కొడవలి చేతబట్టుకొని పశువుల మేతకై పచ్చిక కోస్తున్నాడు. మనోవాక్కాయములచే స్వామిస్మరణం చేస్తూ అన్నమయ్య కొడవలితో గడ్డికాక మనస్సున నాటుకొన్న భవబంధాలను గడ్డిని, భక్తియను కొడవలితో నరుకవలయునని బోధించినట్లున్నది. అప్పటికి ఆయన వయస్సు ఎనిమిదిసంవత్సరాలు.

అంత పిన్నవయస్సులోనే అంతర్యామి తత్త్వం గ్రహించిన అన్నమయ్య పరమేశ్వరాంతరంగుడయి కొడవలితో వేలిని కోసుకొన్నాడు. ఇసుమంతైనా బాధపడక, హరినామస్మరణం గావిస్తున్నాడు. అప్పుడా దారివెంట వేంకటేశ్వరనామ సంకీర్తనమొనరిస్తూ తిరుమలకు వెళ్తున్న సత్పురుషులను చూచి, ఇహలోకజ్ఞానం విడిచి వారివెంట తానూ స్వామిచెంతకు పయనమయ్యాడు. నారాయణనామ స్మరణం చేస్తూ, వారితోకూడి నడుస్తూ మోకాళ్లపర్వతంవరకు సునాయాసంగా చేరుకున్నాడు. కాని, ఆ పర్వతమున అడుగు మోపినంతనే నేత్రాలు అంధీభూతములయ్యాయి. అడుగులు తడబడి ఆడవిలో పడిపోయాడు. ఎన్నిమార్లు ప్రయత్నించినా అతని ప్రయత్నాలన్నీ వ్యర్థములై పోయాయి. అతనిదీక్షకు అచ్చెరువంది కరుణాంతరంగయైన అమ్మ ఆ అలమేలు



మంగమ్మ అతను పాదరక్షలు ధరించి నందువల్లనే కొండలరాయని నివాసం దృగ్గోచరం కాలేదని చెప్పింది. అలా పాదరక్షలు వదలిన వెంటనే సకలతీర్థాలకు, సమస్తదేవతలకు కాణాచి ఐన కలియుగ వైకుంఠం కన్నులఎదుట సాక్షాత్కరించింది. అనన్యానుభూతిని మదినిండా నింపుకొని ఆవిధంగా తిరుమల చేరుకున్నాడు అన్నమయ్య.

హరిసంకీర్తనాధ్యానం తప్ప అన్యమెరుగడు. తన సంకీర్తనలచే స్వామిని కీర్తించి, సేవించి తాను తరించటమేకాక, సకలజనావళిని తరియింపచేసిన సంకీర్తనాచార్యుడు. హరిభక్తితో పరవశించి తాదాత్మ్యమును అనుభవించి ఆ స్వామిలో లీనమైన అపరప్రహ్లాదుడు అన్నమయ్య. ఆ కీర్తనల్లో తరియించువారినందరిని ధన్యులను చేసిన పదకవితాపితామహుడు అన్నమయ్య.






1970-2020

50 వసంతాల

తిరుమల తిరుపతి దేవస్థానముల సచిత్ర మాసపత్రిక

# సప్తగిరి

సంపుటి : 52 మార్చి, 2022 సంచిక : 10


వేంకటాద్రి సమం స్థానం
బ్రహ్మాండే నాస్తి కించన।
వేంకటేశ సమో దేవో
న భూతో న భవిష్యతి॥


**గౌరవ సంపాదకులు**
డా॥ కే.ఎస్.జవహర్ రెడ్డి, ఐ.ఏ.ఎస్.,
కార్యనిర్వహణాధికారి, తి.తి.దేవస్థానములు.

**ప్రచురణకర్త-ప్రధాన సంపాదకులు**
డా॥ కె.రాధారమణ
ఎం.ఏ., ఎం.ఫిల్., పిహెచ్.డి.,

**సంపాదకులు**
డా॥ వి.జి.చొక్కలింగం, ఎం.ఏ., పిహెచ్.డి.,

**ఉపసంపాదకురాలు**
శ్రీమతి మొలకా ఉత్తరఫల్గుణి,
ఎం.ఏ., ఎం.ఇడి., ఎం.సి.జె., ఎల్.పి.టి.,

**ముద్రాపకులు**
శ్రీ పి.రామరాజు, ఎం.ఏ.,
ప్రత్యేకాధికారి (పుస్తకవిక్రయకేంద్రం & ముద్రణాలయం),
తి.తి.దే., తిరుపతి.

**ఫోటోలు**
శ్రీ పి.ఎన్.శేఖర్, ఫోటోగ్రాఫర్, తి.తి.దే.
శ్రీ బి.వెంకట్రమణ, సహాయఫోటోగ్రాఫర్, తి.తి.దే.,



ఇతర వివరాలకు
ఫోన్ నెంబర్లు

సప్తగిరి మాస పత్రిక

0877-2264543
0877-2264359
0877-2264360

విడి ప్రతి : రూ. 5/-
సం॥ చందా : రూ. 60/-
జీవిత చందా : రూ. 500/-
విదేశాలకు సం॥చందా : రూ. 850/-


## ఈ నెలలో....


| | | |
|---|---|---|
| కట్టెదుర వైకుంఠము | డా॥ శ్రీమతి మైలవరపు లలితకుమారి | 04 |
| బ్రహ్మ మురారి సురార్చిత లింగం...!! | శ్రీమతి కె. నాగవేణి | 07 |
| అష్టలక్ష్ములు- అష్టలక్ష్యాలు | శ్రీ డి.సాయికృష్ణ మహీధర్ | 09 |
| శ్రీమద్భగవద్గీత | విద్వాన్, డా॥ ఈ.జి.హేమంతకుమార్ | 11 |
| శ్రీకల్యాణవేంకటేశ్వరస్వామి,శ్రీనివాసమంగాపురం | డా॥ పల్లం పద్మావతి | 13 |
| తిరుమల సమయాచారములు | కీ.శే. డా॥ ఎన్.సి.వి.నరసింహాచార్యులు<br>కీ.శే. శ్రీమాన్ టి.ఏ.కృష్ణమాచార్యులు | 16 |
| ప్రమాణాలకుండ తరిగొండ!! | శ్రీ గోపికృష్ణ | 18 |
| వేదమాత గాయత్రి | శ్రీ పింగళి పాండురంగారావు | 19 |
| ఈ సుగుణాలుంటే చాలు!! | డా॥ పి.వి.ఉమాశశి | 20 |
| జమదగ్నిమహర్షి బృహత్కార్యాలు | శ్రీ డి.భాస్కరరామశర్మ | 22 |
| ప్రాచీన శైవక్షేత్రం పొత్తంగి పొట్టీశ్వరాలయం | శ్రీ బద్రి కూర్మారావు | 25 |
| నిఘంటువుల్లో పంచగవ్యాలు | శ్రీ ఎన్.గోపాలకృష్ణ | 31 |
| శ్రీమద్భగవద్గీత | ఆచార్య కుప్పా విశ్వనాథశర్మ | 33 |
| నిచులాపురి | ఆచార్య చక్రవర్తిరంగనాథన్ | 34 |
| నేనేమివ్వగలను స్వామీ!! | శ్రీ సి.హెచ్.ఎల్.వి.సత్యనారాయణరావు | 37 |
| హరిదాసవాఙ్మయంలో... శ్రీవేంకటాచలాధీశుడు | శ్రీ సుస్వరం నాగరాజాచార్యులు | 38 |
| తరిగొండ వెంగమాంబ నృసింహస్తుతి | డా॥ సంగీతం కేశవులు | 39 |
| ఓర్పు! నేర్పు!! తీర్పు!!! - త్రిరత్నాలు | శ్రీ చాకిచెర్ల నాగసుదర్శన్‌రావు | 40 |
| ఇద్దరూ.. ఇద్దరే!! | డా॥ దేవులపల్లి పద్మజ | 44 |
| బెండ ఆహారద్రవ్యమే కాదు ఔషధం కూడా... | డా॥ చిట్టిభొట్ల మధుసూదనశర్మ | 47 |
| శ్రీకృష్ణామృతం | "అనంత" (కృష్ణసుందరి సత్తిరాజు) | 48 |
| సంస్కృతం నేర్చుకుందాం..!! | రచన- కీ.శే. మహామహోపాధ్యాయ కె.కృష్ణాచార్య<br>నిర్వహణ- మహామహోపాధ్యాయ ఎస్.లక్ష్మణయ్య | 49 |
| మూగజీవులకి ముక్తి (చిత్రకథ) | కథ : శ్రీ డి.శ్రీనివాసదీక్షితులు<br>చిత్రాలు : శ్రీ పి.తులసీప్రసాద్ | 50 |
| వైకుంఠపాళి | శ్రీ కోగంటి వేంకటఅప్పలాచార్యులు | 52 |
| వంశోద్ధారకులు | శ్రీ పాండ్రంకి సుబ్రమణి | 53 |
| బాలవినోదం | నిర్వహణ: పి.ఉషాలక్ష్మి | 54 |


ముఖచిత్రం : శ్రీవేదనారాయణస్వామి, నాగులాపురం

వెనుక చిత్రం : శ్రీలక్ష్మీనరసింహస్వామి, తరిగొండ


ఇందులోని వ్యాసాలు, అభిప్రాయాలు రచయితల వ్యక్తిగతమైనవి. వాటికి తిరుమల తిరుపతి దేవస్థాన యాజమాన్యం బాధ్యత వహించదు.



24 గంటలూ పనిచేసే
తి.తి.దే. కాల్‌సెంటర్ ఫోన్ నెం.
0877 2277777 / 2233333





వెబ్‌సైట్- www.tirumala.org;
'సప్తగిరి' మాసపత్రికకు సంబంధించిన సలహాలు / సూచనలు / ఫిర్యాదులు-
sapthagiri.helpdesk@tirumala.org; ద్వారా తెలియజేయవచ్చు.

సంపాదకీయం

# శౌరి పదాల్లో నారి

*శ్లో॥ మృత్యుస్సర్వహరశ్చాహ ముద్భవశ్చ భవిష్యతామ్।*
*కీర్తి(శ్రీర్వాక్చ నారీణాం స్మృతిర్మేధా ధృతిః క్షమా॥ (భగవద్గీత అధ్యాయం-10, 34)*

సమస్తమును సంహరించునట్టి మృత్యువును, ఇకముందు ఉత్పత్తికాగల సమస్తము యొక్క పుట్టుకయు నేనే అయి ఉన్నాను. మఱియు స్త్రీలలోగల కీర్తి, సంపద, వాక్కు, స్మృతి జ్ఞానము, ధారణాశక్తిగల బుద్ధి, ధైర్యము, ఓర్పు ఈ ఏడుగుణాలున్ను నేను అయి ఉన్నాను.

స్త్రీలలోగల పై ఏడు సద్గుణములు తానే అని భగవానుడు సెలవిచ్చి ఉన్నాడు. ఈ ఏడుగుణాలు పురుషులందు కానవచ్చినా, పురుషులతో పాటు స్త్రీలను గూడ సముద్ధరించ దలచినవాడై భగవానుడు ఈ ప్రకారంగా తెలియజేశాడు. స్త్రీలోకంపై భగవానునికి ఎంతటి కరుణయో ఈ వాక్యముచే వెల్లడౌతోంది. దీనినిబట్టి స్త్రీలు అబలలు, శక్తిహీనులుకారనియు, వారున్ను పురుషులవలె మేధాశక్తి, ధైర్యము, విద్య (వాక్కు) మొదలైనవి సంపాదించవచ్చు ననియూ స్పష్టపరచినట్లైనది. ప్రయత్నముచేతను, అభ్యాసముచేతను, శ్రద్ధవల్లను ఎవరైనను అట్టి సుగుణాలను సంపాదించుకోవచ్చు. ధైర్యము, మేధాశక్తి, సహనము మొదలైన సద్గుణాలు తానేయని భగవానుడు తెలిపినందువల్ల దానిని సర్వులు అభ్యాసముచే పొంది తమ హృదయాలను భగవన్నిలయాలుగా ఒనర్చుకొనవలెను. ఎక్కడ అట్టి సుగుణాలుంటాయో అక్కడ సాక్షాత్ భగవానుడు కాపురముంటాడు.

ఈ శ్లోకంయొక్క రెండవపాదానికి మరియొక అర్థముంది. స్వాయంభువమనువు యొక్క కుమార్తె ప్రసూతి, దక్షప్రజాపతులకు ఇరవైనాలుగుమంది కుమార్తెలు కలిగారు. వారిలో కీర్తిదేవి, మేధాదేవి, ధృతిదేవి, స్మృతిదేవి, క్షమాదేవి అనేవారున్నారు. శ్రీదేవి భృగువు యొక్క కుమార్తె. వాగ్దేవి బ్రహ్మదేవునివల్ల కలిగింది. ఈ ఏడుగురును ఆయా సద్గుణములకు అధిష్ఠానదేవతలు. కావున, "స్త్రీలలో ముఖ్యులైనట్టి కీర్తిదేవిని, ఐశ్వర్యదేవిని, వాగ్దేవిని, స్మృతిదేవిని, మేధాదేవిని, ధైర్యదేవిని, క్షమాదేవిని నేనే అయి ఉన్నాను." ఏ విధంగా చెప్పినా ఆ సద్గుణాలు భగవత్స్వరూపములనియు, వానిని జీవులు తప్పక అవలంబించా లనియు తెలిపే విషయం మాత్రం సుస్పష్టం.

ఈ శ్లోకంద్వారా ముఖ్యంగా స్త్రీలకు ధర్మమార్గావలంబమునందు, పరమార్థ పదగమనంనందు విశేషప్రోత్సాహం లభిస్తోంది. ఇక వారు తమ విద్యావిషయమునగాని, ధీశక్తివిషయమునగాని నిరుత్సాహపడాల్సిన పనిలేదు. వెనుకంజ వేయాల్సిన పనిలేదు. పురుషులతోపాటు వారున్ను ఆ సుగుణరాశినంతా తమ ప్రయత్నాతిశయంచే సాధించుకో వచ్చును. ఏలయనగా అవి కలచోటే భగవన్నిలయంగా చెప్పబడింది.

*సమస్త నారీలోకాః సుఖినోభవన్తు!!*



# బ్రహ్మ మురారి సురార్చిత లింగం..!!

– శ్రీమతి కె.నాగవేణి, 84978 11178

భక్తజనరక్షకుడు, త్రినేత్రుడు, కరుణాసాగరుడు, జగద్రక్షణకోసం హాలాహలాన్ని అలంకారప్రాయంగా కంఠంలో ధరించినవాడు, మారేడుదళాలతో అర్చిస్తేనే సంతోషించి భక్తులకు ముక్తిని ప్రసాదించేవాడు అయిన పరమశివుడు వ్యక్తరూపంలో లింగోద్భవమూర్తిగా ఆవిర్భవించిన పుణ్యదినం మహాశివరాత్రి.

సర్వపాపాలను హరింపజేసి మోక్షాన్ని ప్రసాదించేది ఈరోజే. ఈరోజు పగలంతా ఉపవాసం ఉండి రాత్రంతా జాగరణ చేసి శివనామస్మరణతో గడపడం అనంతమైన పుణ్యఫలాలను ప్రసాదిస్తుంది. మార్గశిరమాసంలో ఆరుద్రానక్షత్ర మందు అర్ధరాత్రియందు జ్యోతిర్లింగోద్భవం అయిందని శివ పురాణం పేర్కొన్నది. మాఘశుద్ధ ఏకాదశిదినమున పార్వతీ పరమేశ్వరులకల్యాణం జరిగినరోజు.

శివరాత్రిరోజు శివుణ్ణి ప్రార్థించటం ముక్తికి సోపానం. "జన్మమునకు ఒక శివరాత్రి' అని నానుడి ఉంది. శివలింగానికి నమస్కారం చేస్తూ, విశ్వేశ్వరాయ, మహాదేవాయ, త్రయంబ కాయ, త్రిపురాంతకాయ, సర్వేశ్వరాయ, సదాశివాయ, శ్రీమాన్ మహాదేవాయనమః అని ప్రార్థిస్తే బోళాశంకరుడు అతిసంతుష్టుడు అవుతాడు. దయవంటి ధర్మం, బిల్వంవంటి వృక్షం, శివునివంటి ప్రభువు, శివరాత్రివ్రతమునకు సమానమైనవి ఏవీ లేవు.

## శివలింగస్వరూపం- లింగావిర్భావం

ఇచ్ఛా, జ్ఞాన, క్రియాశక్తులుగా పరిణమించిన ఆదిశక్తి (మూలప్రకృతి) శివునకు ఆధారం, అధిష్ఠానం, ఆశ్రయం అనగా లింగంగా ప్రత్యక్షిస్తాయి. అట్టి లింగమును అధిష్ఠించిన వాడు మహేశ్వరుడు. బ్రహ్మ విష్ణువులరక్షణకు మహేశ్వరుడు ప్రళయసముద్రంలో జ్యోతిర్లింగంగా ఆవిర్భవించాడు.

లింగంయొక్క దక్షిణభాగమున 'అ'కారము, ఉత్తర భాగమున 'ఉ'కారము, మధ్యన 'మ'కారము కలిసిన ధ్వని 'ఓం'కారనాదం ప్రణవమై శివగోచరమవుతుంది. ఓంకారంలోని 'అ'కారము బ్రహ్మ, 'ఉ'కారము విష్ణువు, 'మ'కారము రుద్రుడు. ఇవి త్రివేదముల ప్రతిపాదితములు. కాబట్టి 'ఓం'కారము ప్రణవశబ్దస్వరూపం.

లింగాకారం జ్యోతిఆకృతిని కలిగి ఉంటుంది. చీకటి నుండి దారికొరకు జ్యోతి సహాయపడుతుంది. అంటే అంధకారం (అవిద్య)నుండి జ్ఞానమార్గానికి జ్యోతి సహకారముంటుంది. అందువల్లనే జగత్తుకు వెలుగునిచ్చు జ్యోతి ఆకారమును లింగం పొంది ఉన్నది. ఇదేవిధంగా జ్యోతిర్లింగములందు శివుడు తన కటాక్షాన్ని జ్యోతిరూపంలో పొందుపరిచాడు. లింగమునకు మూలమును బ్రహ్మ, మధ్యస్థమును విష్ణువు, అగ్రస్థానమును శివునిగా గుర్తించి భక్తులు పూజిస్తారు.

శివుడు ఎనిమిదిరూపాల్లో లోకరక్షణ చేస్తాడు. ఈ ఎనిమిదిరూపాల్లో ఉన్న శివుణ్ణి అష్టనామాలతో అర్చిస్తే ప్రకృతి మనకు అనుకూలతను, మంగళమును ప్రసాదిస్తుంది. ఈ ఎనిమిదిమూర్తులే వరుసగా భూమిని, జలమును, అగ్నిని, వాయువును, ఆకాశమును, క్షేత్రజ్ఞుని, సూర్యుని, చంద్రుని అధిష్ఠించి ఉన్నాయి. ఈ ఎనిమిదిరూపాల్లో ఉన్న శివభగవానుణ్ణి ఎనిమిదిదిక్కుల సర్వతోభావంతో పూజించాలి.

ఓమ్ శర్వాయ-క్షితిమూర్తియేనమః
(పృథివి, తూర్పు)

ఓమ్ భవాయ- జలమూర్తియేనమః
(జలము, ఈశాన్యం)

ఓమ్ రుద్రాయ- అగ్నిమూర్తియేనమః
(అగ్ని, ఉత్తరం)

ఓమ్ ఉగ్రాయ–వాయుమూర్తియేనమః
(ఆకాశం, పశ్చిమం)

ఓమ్ పశుపతయే–యజమానచైతన్యమూర్తయేనమః
(జీవాత్మ, నైఋతి)

ఓమ్ మహాదేవాయ– సోమమూర్తియేనమః
(చంద్రుడు, దక్షిణం)

ఓమ్ ఈశానాయ– సూర్యమూర్తియే నమః
(సూర్యుడు, ఆగ్నేయం)

## అంతా శివమయం

ఆదిలో సృష్టినిమిత్తమై బ్రహ్మ తపస్సు మేరకు మార్గదర్శననిమిత్తం శివుడు అర్ధనారీ శ్వరరూపంలో దర్శనమిచ్చి స్త్రీపురుష రూపాలుగా విభక్తి చెంది, పార్వతీపర మేశ్వరరూపాలొంది, ఆదిదంపతులై సృష్టి కారకులైనారు. ఆవిధంగా పార్వతీపరమే శ్వరులు ఈ మండలమందు 'జగతః పితరౌ వందే' అని పూజలందుకొంటున్నారు.

"శివమూలమిదంజగత్"–శివుడు పంచాననుడై, పంచాకృతుడై, పంచభూతాత్మ కుడై, త్రిగుణాత్మకుడై, త్రిలోచనుడై, అష్టదిక్కులే ఆలంబనంగా సర్వము తనయందే నిలిపి, సర్వమునందు తానే వ్యాపించి, తన చైతన్యశక్తిచే సర్వప్రాణికోటికి పశుపతియై, జగత్తే శివం, శివమే జగత్తుగా అంతా శివమయమై ఒప్పుచున్నాడు. 'ఐశ్వర్యం ఈశ్వరాధిచ్చేత్' అను నానుడి జగత్ ప్రసిద్ధమైనదే!

## పంచస్ఫటిక లింగములు

మనదేశంలోని పంచస్ఫటికలింగములను శ్రీఆదిశంకరాచార్యులవారు కైలాసంనుంచి తెచ్చి వివిధప్రదేశాల్లో స్థాపించారు.

1) కేదారంలో 'ముక్తి' లింగం.
2) నేపాలులో నీలకంఠక్షేత్రంలో 'వర' లింగం.
3) చిదంబరమున 'మోక్ష' లింగం.
4) శృంగేరీలో 'భోగ' లింగం.
5) కంచిలో 'యోగ' లింగం.

మనదేశంలో పంచభూతశివలింగాలు వివిధప్రాంతాల్లో స్థాపించబడ్డాయి.

01) తిరువన్నామలై (అరుణాచలం)లో అరుణాచలేశ్వరుడు తేజోలింగం (అగ్ని)రూపంలో వెలసి ఉన్నాడు.

02) శ్రీకాళహస్తిలో శ్రీకాళహస్తీశ్వరుడు వాయు లింగరూపంలో (వాయువు) వెలసి ఉన్నాడు.

03) చిదంబరంలో నటరాజస్వామి ఆకాశలింగ రూపంలో (ఆకాశం) వెలసి ఉన్నాడు.

04) కంచిలో ఏకాంబరేశ్వరుడు పృథ్వీలింగ రూపంలో (భూమి) వెలసి ఉన్నాడు.

05) జంబుకేశ్వరంలో జంబుకేశ్వరుడు జలలింగ రూపంలో (నీరు) వెలసి ఉన్నాడు.

## పంచభూతశివకృతులు

ఈ సృష్టి సమస్తం శివమయం. ఇదంతా ఆయనచే సృష్టింప బడింది. సృష్టికి పూర్వం ఇదంతా నీటితోనే నిండి ఉండేది. అందులోనుండే మహాతేజస్సు ఉత్పన్నమైంది. ఆ తేజోమయరూపమే లింగ రూపాన్ని ధరించిన పరమశివుడు. ఆ శివుడే దక్షిణభారతదేశంలో పంచ భూతాల్లో ఒక్కొక్క ప్రకృతిని, శక్తిని తానుగా సమీకరించుకుని లింగరూపంగా అవతరించి భక్తో ద్ధరణ కావిస్తున్నాడు.

## పంచారామాలు

**అఖండగోదావరి, మహా కృష్ణానదీతీరంలో శ్రీశైలం (రాయలసీమ), ద్రాక్షారామం (కోస్తా), కాళేశ్వరం (తెలంగాణ)ల యందు పరమేశ్వరుడు లింగరూపంలో అవతరించి ఉన్నందువల్ల ఈ ప్రదేశాన్ని త్రిలింగదేశమంటారు.**

**01) భీమవరంలో సోమారామంలో సోమేశ్వరుడు చంద్ర ప్రతిష్ఠచే సద్యోజాతరూపంలో ఉంటాడు.**

**02) పాలకొల్లులో క్షీరారామంలో క్షీరారామలింగేశ్వరుడు మహావిష్ణుప్రతిష్ఠచే ఈశానరూపంలో ఉంటాడు.**

**03) సామర్లకోటలో కుమారారామంలో కుమారభీమేశ్వరుడు కుమార స్వామి ప్రతిష్ఠచే వామదేవ రూపంలో ఉంటాడు.**

**04) ద్రాక్షారామంలో భీమేశ్వరుడు సూర్య మరియు దక్షప్రజాపతి ప్రతిష్ఠచే తత్పురుషరూపంలో ఉంటాడు.**

**05) అమరావతిలో అమరారామంలో అమరేశ్వరుడు ఇంద్రుడి ప్రతిష్ఠచే అఘోరరూపంలో ఉంటాడు.**

# అష్టలక్ష్ములు- అష్టలక్ష్యాలు

- శ్రీ డి.సాయికృష్ణ మహీధర్, 94925 34402

లక్ష్మీం క్షీరసముద్రరాజతనయాం శ్రీరంగాధామేశ్వరీం
దాసీభూత సమస్తదేవవనితాం లోకైకదీపాంకురామ్
శ్రీమన్మందకటాక్షలబ్ధవిభవ బ్రహ్మేంద్రగంగాధరం
త్వాం త్రైలోక కుటుంబినీం సరసిజాం వందే ముకుందప్రియామ్

బ్రహ్మ, విష్ణు, శివులు సృష్టి, స్థితి మరియు లయ కారకులు. వారికి తోడుగా కాలచక్రపరిభ్రమణానికి సహాయ సహకారాలు అందించేవారు త్రిశక్తులైన సరస్వతి, లక్ష్మి మరియు పార్వతి. వారు కేవలం భార్యలుగా బాధ్యతలు నిర్వర్తించటమే కాకుండా దుష్టశిక్షణ, శిష్టరక్షణకార్యాలుకూడా నిర్వర్తిస్తూంటారు. బ్రహ్మకు మరియు పరమేశ్వరునికి ఎటువంటి అవతారాలు లేవు. వారు ఆదినుంచి అంతంవరకు తమ తమ కర్తవ్యనిర్వహణ చేస్తూంటారు. కాని శ్రీమహావిష్ణువు వివిధ అవతారాలు ధరిస్తూ సృష్టినిర్వహణ చేస్తూంటాడు. ఆయనకు సహాయకారిగా మహాలక్ష్మికూడా కొన్ని అవతారాల్లో తానుకూడా తగిన అవతారాన్ని ధరించి ఆయనవెంట నిలచి ఉంటుంది. దశావతారాల్లో భాగమైన మత్స్య, కూర్మ, వరాహ, నారసింహ, వామన అవతారాల్లో ఆయన ఒక్కడే రూపుదాల్చి సృష్టిరక్షణ చేశాడు. ఒక ప్రత్యేక కార్యక్రమంకోసంవచ్చి, అది పూర్తికాగానే అవతారసమాప్తి చేసుకుంటాడు. అలాగే రాబోయే కల్క్యావతారంలో కూడా ఒక్కడే వస్తాడని పురాణాలు తెలియచేస్తున్నాయి. ఇక మిగిలిన పరశురామ, రామ, బలరామ, శ్రీకృష్ణఅవతారాల్లో మాత్రం ఆయన సతీమణి అయిన లక్ష్మీదేవి కూడా తగిన అవతారం దాల్చింది. పరశురామునిభార్య ధరణి, రామునిభార్య సీతాదేవి, శ్రీకృష్ణునిభార్య రుక్మిణి లక్ష్మీదేవి ప్రతిరూపాలుగా పురాణాలు పేర్కొంటున్నాయి. వారు విష్ణువుతో కలసి భూలోకంలో నివసించినట్లు మనకు పురాణాలద్వారా తెలుస్తోంది.

ఈ సృష్టి సంపూర్ణచక్రంలో పద్నాలుగు మన్వంతరాలు ఉంటాయి. అందులో ప్రస్తుతం వైవస్వతమన్వంతరం నడుస్తోంది. ఒక్కొక్క మన్వంతరంలో శ్రీమహలక్ష్మి ఒక్కోవిధంగా అగ్నినుండి, జలంనుండి, బిల్వవృక్షంనుండి, భూమినుండి అవతారం దాల్చుతూంటుంది. ఆవిడ అవతారక్రమంలో మాతృగర్భంనుండి జన్మించినవి తక్కువ. ఎక్కువభాగం స్వయంభువుగా అవతరించినవే. ప్రస్తుత మన్వంతరంలో ఆమె పాలసముద్రంనుండి ఆవిర్భవించింది. దానవులబారినుండి రక్షణపొందటానికి దేవతలు












దానవులతో కలసి పాలసముద్రాన్ని చిలికేసమయంలో ఆవిర్భవించిన అనేక వస్తుసంపదలతోబాటు మహాలక్ష్మికూడా ఆవిర్భవించగా శ్రీమహావిష్ణువు ఆమెను భార్యగా స్వీకరించాడు. మహాలక్ష్మి ధనసంపదలకు కారకురాలు. లక్ష్య అనే సంస్కృతపదం నుంచి లక్ష్మి అనేపదం వచ్చింది. ఈవిడ ఉత్తరఫల్గునీనక్షత్రంలో, ఫాల్గుణశుద్ధపూర్ణిమనాడు అవతరించింది. లక్ష్మీదేవి పాలసముద్రంనుండి ఆవిర్భవించగానే తనకు తగిన వరునిగా శ్రీమహావిష్ణువును వరించి ఆయన హృదయఫలకంపై అలరారింది. అందువల్ల ఆవిడ శుభవివాహసమయంకూడా ఇదే.

మానవజీవితసాఫల్యానికి అష్టవిధలక్ష్యాలు అవసరమౌతాయి. వాటి పరిపూర్ణతకు, సాఫల్యానికి తగిన చేయూతనిచ్చే తల్లి మహాలక్ష్మి. అందుకే ఈ లక్ష్యసాధనకు ఆవిడ అష్టలక్ష్ముల అవతారాలు దాల్చి, మానవుల మనుగడకు, ఉన్నతికి సహాయం చేస్తోంది. *ఆదిలక్ష్మిగా ప్రాణశక్తిని, ధాన్యలక్ష్మిగా శారీరికదారుఢ్యాన్ని, ధైర్యలక్ష్మిగా ధైర్యసాహసాలను, గజలక్ష్మిగా సంపదలకు తగిన ప్రతిష్ఠను, సంతానలక్ష్మిగా సంతానాన్ని, విజయలక్ష్మిగా సకలకార్యసిద్ధిని, విద్యాలక్ష్మిగా జ్ఞానసంపదను, ధనలక్ష్మిగా సకలఐశ్వర్యాలను* ప్రసాదిస్తూ మానవులకు ఆలంబనగా నిలుస్తోంది. లక్ష్మీదేవి వాహనం గుడ్లగూబ.

*నమస్తేస్తు మహామాయే శ్రీపీఠే సురపూజితే*
*శంఖచక్ర గదా హస్తే మహాలక్ష్మి నమోస్తుతే*

మహారాష్ట్రలోని కొల్హాపూర్‌లోని మహాలక్ష్మీఆలయం అత్యంత ప్రసిద్ధిచెందినది. అష్టాదశశక్తిపీఠాల్లో ఇది ఒకటి. చాళుక్యులచే నిర్మితమైన కర్ణాటకలోని కొల్లాపూర్ విశేషఖ్యాతి గాంచింది. చెన్నైలోని అష్టలక్ష్మీఆలయంలో అమ్మవారి అన్నిరూపాలకు సంబంధించిన ప్రతిమలు చాలా సుందరంగా తీర్చిదిద్దబడి ఉన్నాయి. కర్ణాటకలోని హోయసాలులకాలంనాటి దొడ్డగడ్డపల్లిలోని హోయసలశైలిలో నిర్మింపబడిన ఆలయం ప్రముఖక్షేత్రాల్లో ఒకటి. తిరుచానూరులోని పద్మావతిఆలయం విశేషభక్తజనులతో పూజలందుకుంటోంది. తమిళనాడులోని శ్రీపురంలో అమ్మవారి బంగారుదేవాలయం చూడటానికి రెండు కళ్లు చాలవు. ఏదైనా ఆలయానికి వెళ్లి దర్శనం చేసుకున్నతర్వాత భక్తులకు ప్రసాదాలుగా లడ్డూ, పులిహోర, చక్కెరపొంగలి లాంటివి పెడతారు. కాని మధ్యప్రదేశ్‌లోని రత్లాంజిల్లాలోని మహాలక్ష్మీఆలయంలో మాత్రం బంగారం, వెండిని ప్రసాదంగా ఇస్తారు. ఈ ఆలయం బంగారం, చీరలకు, మధ్యప్రదేశ్‌చరిత్ర, సాంస్కృతిక వారసత్వసంపదలకు నిలయం.

గోవును సంరక్షించే లోగిళ్లలో మహాలక్ష్మి నివాసం ఉంటుంది. ధర్మం, సత్యం అనుసరించేవారికి రక్షగా నిలచి ఉంటుంది. అతిథులను ఆదరించటం, శుభ్రత కలిగి ఉండటం, పరోపకారసంకల్పం కలిగి ఉండటంవంటి లక్షణాలను కలిగి ఉన్నవారిని మహాలక్ష్మి సదా అనుగ్రహిస్తుంది. నవగ్రహాల్లో శుక్రగ్రహశాంతినిమిత్తమై మహాలక్ష్మికి పూజ చేయాలి. ఆ కరుణామయి కటాక్షవీక్షణాలు మనందరిపై ఉండాలని కోరుకుంటూ, యథాశక్తి మహాలక్ష్మి అర్చన చేసి తరిద్దాం.


*శుభం భూయాత్*













ధైర్యమే మొట్టమొదటి లక్షణం. అదుంటే అన్ని లక్షణాలు ఉన్నట్లే!

# శ్రీమద్భగవద్గీత

## 14వ-అధ్యాయం (సారసంగ్రహం)

విద్వాన్, డా॥ ఈ.జి. హేమంతకుమార్



ధారావాహిక

### గుణత్రయవిభాగయోగం అధ్యాయ నామౌచిత్యం

ప్రకృతి మూడుగుణాలతో నిర్మింపబడి ఉంది. అవి 1)సత్త్వం 2)రజస్సు 3)తమోగుణాలు. ఈ అధ్యాయంలో సత్త్వ రజస్తమోగుణాలయొక్క స్వరూపస్వభావాలు, గుణత్రయరహితమైన ఆత్మయొక్క శుద్ధజ్ఞానస్వభావం వివరింపబడి ఉంది. ఈ అధ్యాయంలో భగవత్ప్రాప్తికి ఉపాయం చక్కగా తెల్పబడింది. ఈ క్రిందిశ్లోకం అందుకు నిదర్శనం.

**గుణానే తానతీత్య త్రీన్ దేహీ దేహ సముద్భవాన్ ।**
**జన్మమృత్యుజరాదుఃఖైః విముక్తోఽమృత మశ్నుతే ॥ 20**

ఈ గుణాలు జీవుణ్ణి దేహంతో బంధిస్తున్నాయి. ఈ మూడుగుణాలనుండి విముక్తిని పొంది పరమాత్మలో ఐక్యమొందడమే యోగం. ఈ త్రిగుణాల నతిక్రమించినవాళ్ళు గుణాతీతులని పిలువబడతారు. జీవుడు ఈ గుణత్రయంచే ఏ విధంగా బంధింపబడుతున్నాడో ఈ అధ్యాయంలో చెప్పబడింది. కనుకనే ఈ అధ్యాయానికి గుణత్రయవిభాగయోగమని పేరువచ్చింది. గీతలో ఇంత ప్రాముఖ్యం ఉన్న అధ్యాయం మరొకటి లేదు. జ్ఞానయోగాన్ని సంపాదించదలచినవారు ఈ అధ్యాయాన్ని తప్పక చదవాల్సిందే!

ప్రకృతిబంధంనుంచి విముక్తి ఎలా పొందాలి? ఏ గుణాన్ని కలిగి ఉండాలి? ఏ ఏ గుణాలతో ఉన్నప్పుడు ఏ ఏ లోకాల్ని పొందుతాం? ముక్తికి మార్గం ఏమిటి? మొదలగు విషయాలు ఇందులో వివరంగా తెలుపబడ్డాయి. సత్త్వరజస్తమోగుణాలయొక్క విభాగాన్ని తెలిపే అధ్యాయం కనుక దీనికి గుణత్రయవిభాగయోగమనే పేరు సమర్థవంతంగా ఉంది. ఈ అధ్యాయపారాయణవల్ల స్త్రీహత్యాపాతకం, వ్యభిచార దోషం నశిస్తుందని పెద్దల వచనం.

\- - - - - - -

### భగవంతుడంటున్నాడు

కురుశ్రేష్ఠా ! ఏ జ్ఞానాన్ని పొంది మునీంద్రులు మోక్షం పొందారో అటువంటి పరమోత్తమజ్ఞానాన్ని నీకు మరింతగా వివరిస్తున్నాను. విను. ఈ జ్ఞానాన్నిగూర్చి తెలుసుకున్నవారు జననమరణశోకాలలో తగులుకోరు. అట్టివారు నాలో ఐక్యం అవుతారు. జగత్తుకు కారణమైన ప్రకృతియందు సత్త్వం, రజస్సు, తమస్సు అనే మూడుగుణాలున్నాయి. పూర్వకర్మననుసరించే జీవుడు శరీరాన్ని పొందుతాడు. అంతేకాకుండా ఈ గుణాల ననుసరించే పురుషుడు ప్రవర్తిస్తుంటాడు.

**01)** సత్త్వగుణం నిర్మలమైంది. ప్రకాశింపచేయడం దీని లక్షణం. ఇది ఆరోగ్యాన్ని, జ్ఞానాన్ని, సుఖాన్ని కలిగిస్తుంది. ఆత్మను బంధింపచేస్తుంది. కనుకనే సత్త్వగుణసంపన్నులు జ్ఞానవంతులై సుఖాలను పొందుతూంటారు.

**02)** రజోగుణం ఆశను పుట్టిస్తుంది. కర్మప్రవృత్తి దీని లక్షణం. దీనినుండి కోరికలు, మమకారం, అనురాగం పుట్టి కర్మయందు ఆసక్తిని పెంచి దేహిని కట్టిపడవేస్తుంది.

**03)** తమోగుణంవల్ల అవివేకం కలుగుతుంది. అజ్ఞానం దీని లక్షణం. సోమరితనం, నిద్ర, మతిమరపును పెంచుతుంది. ప్రాణికోట్లను మోహమనే విపరీతపుఅజ్ఞానంలో ఇది ఉంచుతుంది.

ఈ సత్త్వరజస్తమోగుణాలు ఒకానొకసమయంలో ఒకటి ప్రబలి మిగతా రెండింటిని అణగదొక్కి ప్రవర్తిస్తుంటాయి. ఒకడు చేసే కార్యాన్నిబట్టి అతడికి ఏ గుణం ప్రబలంగా ఉందో తెల్సుకోవచ్చు. ఏ గుణం అత్యధికంగా ఉంటుందో తదనుగుణంగానే అతడికి జన్మ లభిస్తుంది.

యదా సత్త్వ ప్రవృద్ధే తు ప్రలయం యాతి దేహభృత్ ।
తదోత్తమవిదాం లోకాన్ అమలాన్ ప్రతిపద్యతే ॥ 14

అర్జునా! సత్త్వగుణం ఎక్కువగా ఉన్నపుడు మరణించిన వారు ఉత్తమగతుల్ని పొందుతారు. రజోగుణం వృద్ధిలో ఉండగా మరణిస్తే వారు మళ్ళీ జన్మించి కర్మఫలాసక్తితో జీవిస్తారు. తమోగుణం ప్రబలినపుడు మణించేవారు జంతువుగనో, పక్షిగనో జన్మలు పొందుతారు.

సత్త్వరజస్తమోగుణాలే జన్మలకు కారణాలవుతున్నాయి. సత్త్వగుణం కలవారు దేవలోకానికి వెళతారు. రజోగుణం కలవారు మనుష్యలోకంలో జన్మిస్తారు. తమోగుణం కలవారు అధోలోకాన్ని పొందుతారు.

నాన్యం గుణేభ్యః కర్తారం యదా ద్రష్టాఽనుపశ్యతి ।
గుణేభ్యశ్చ పరం వేత్తి మద్భావం సోఽధిగచ్ఛతి ॥ 19

ఓ అర్జునా! జీవుడు చేసే సమస్తకర్మలకు ఈ త్రిగుణాలే కర్తలు. జీవాత్మ శుద్ధుడు. తాను సాక్షిమాత్రమే. ఈ మూడు




గుణాలకు అతీతంగా పరబ్రహ్మ ఉన్నాడని తెలుసుకొన్నవాడు మోక్షం పొందుతాడు – అనగానే అర్జునునకు సందేహం కలిగి ఇలా ప్రశ్నిస్తున్నాడు.

## అర్జునుడడుగుతున్నాడు

ప్రభూ! కృష్ణా! ఈ మూడుగుణాల ప్రభావాలకు లొంగని వాడెవడైనా ఉంటాడా? ఉంటే ఏ లక్షణాలు కలిగి ఉంటాడు? ఏ ఆచారాలు అనుసరిస్తాడు? అతని ప్రవృత్తి ఎలా ఉంటుంది? ఎట్టి గుర్తులచే అతడు త్రిగుణాతీతుడని గ్రహించ వచ్చు? దయచేసి తెల్పండి అని అడిగాడు.

## భగవంతుడంటున్నాడు

అర్జునా! త్రిగుణాతీతుడు సత్త్వరజస్తమోగుణాలలో ఏవి ఎలా కలిగినా లెక్కచేయకుండా, రాగద్వేషాలను వదలి, ఉన్న దాన్ని అక్కర్లేదనికానీ, లేనిది కావాలనికానీ కోరకుండా తటస్థుడుగా ఉంటాడు అంటే సత్త్వరజస్తమోగుణాలప్రభావాలు వారిపై పనిచేయవు. కనుకనే వారు గుణాతీతులు అని పిలువ బడుతున్నారు.

సమదుఃఖ సుఖస్స్వస్థః సమలోష్టాశ్మ కాంచనః ।
తుల్య ప్రియా ప్రియోధీరః తుల్యనిందాత్మ సంస్తుతిః ॥ 24

మానావమానయోస్తుల్యః తుల్యో మిత్రారిపక్షయోః ।
సర్వారంభ పరిత్యాగీ గుణాతీతస్సఉచ్యతే ॥ 25

సుఖాలకు పొంగకుండా, దుఃఖాలకు క్రుంగకుండా, మట్టిని, రాయిని, బంగారాన్ని సమానంగా భావిస్తూ ధీర చిత్తంతో మానావమానాల్ని, నిందాస్తుతుల్ని, శత్రుమిత్రులను సమభావంతో చూచేవాడు త్రిగుణాతీతుడు.

మాం చ యోఽవ్యభిచారేణ భక్తియోగేన సేవతే ।
స గుణాన్సమతీత్యైతాన్ బ్రహ్మభూయాయ కల్పతే ॥ 26

అర్జునా! ఎవడు అనన్యమైన భక్తితో నన్నే సేవిస్తాడో అటువంటివాడు త్రిగుణాలను అతిక్రమించినవాడై బ్రహ్మభావం పొందటానికి సమర్థుడవుతాడు. అట్టివారే శుద్ధాత్మస్వరూపులు. వారు గుణాలకు గుణకార్యాలకు లోబడరని తెలుసుకో!!

శ్రీకృష్ణార్పణమస్తు.



ఓటమిలో కూడా గుండెనిబ్బరమే అసలు ధైర్యం

# శ్రీకల్యాణవేంకటేశ్వరస్వామి, శ్రీనివాసమంగాపురం

- డా॥ పల్లం పద్మావతి, 96762 69300


చిత్తూరుజిల్లాలో ఉన్న ప్రముఖవైష్ణవక్షేత్రాల్లో ఒకటి శ్రీనివాస మంగాపురం. సాక్షాత్తూ శ్రీవేంకటేశ్వరుడే స్వయంభువుగా అర్చావతారమూర్తిగా వెలసిన క్షేత్రం శ్రీశ్రీనివాసమంగాపురం. ఇక్కడ వెలసి ఉన్న దైవం శ్రీకల్యాణ వేంకటేశ్వరుడు. ఆంధ్రప్రదేశ్‌లోని చిత్తూరుజిల్లాలో మహాపుణ్యక్షేత్రంగా ప్రపంచ ప్రసిద్ధిగాంచిన తిరుపతినగరానికి పశ్చిమంగా పదికిలోమీటర్లదూరంలో తిరుపతినుండి మదనపల్లికి వెళ్ళే రోడ్డుమార్గంలో ఉంది శ్రీనివాసమంగాపుర క్షేత్రం. వేంకటాచలం (లేదా) వరాహక్షేత్రానికి దక్షిణంగా ఉన్న ఈక్షేత్రం స్వర్ణ ముఖి, కల్యాణి, భీమనదుల త్రివేణిసంగమంగా ప్రసిద్ధి చెందింది. పూర్వం ఈ ప్రాంతంలో అగస్త్యమహర్షి ఆశ్రమం ఉండేది. ప్రతిఒక్కరూ తప్పక దర్శించవలసిన క్షేత్రం శ్రీనివాసమంగాపురం.

## ఆవిర్భావం

శ్రీమహావిష్ణువు శ్రీనివాసుడుగా వేంకటాచలంలో వెలసి నారాయణ వనం ప్రభువైన ఆకాశరాజు పుత్రిక పద్మావతిని పరిణయమాడి పద్మావతీ సమేతుడయి వేంకటాచలానికి వెళ్ళేందుకై బయలుదేరాడు. మార్గమధ్యంలో సువర్ణముఖీసమీపాన ఉన్న అగస్త్యాశ్రమానికి విచ్చేసి మహర్షికి నమస్కరించి ఆశీర్వాదం పొందాడు.

అగస్త్యుడు నూతనదంపతులు ఆరుమాసములవరకు తీర్థయాత్ర, క్షేత్రదర్శనం, గిరులధిరోహించడంవంటివి చేయకూడదని చెప్పాడు. మహర్షి మాటప్రకారం శ్రీనివాసుడు తన ప్రయాణం ఆపుకొని సతీసమేతంగా ఆరు మాసములూ అగస్త్యముని ఆశ్రమంలోనే గడిపాడు. అటుతర్వాత ఆ ఆశ్రమ సమీపంలో ఉన్న నడకదారిగుండా వేంకటాచలానికి చేరాడు. ఈ మార్గమే శ్రీవారిమెట్టుపేరుతో ప్రసిద్ధి చెందింది. అన్నమాచార్యుల వారు కూడా ఈమార్గం గుండానే తిరుమలకు చేరినాడని చెబుతారు. నేడు కూడా చాలామంది ఈ దారిగుండానే తిరుమలయాత్ర సాగిస్తున్నారు.

అలమేలుమంగ అయిన పద్మావతితో కలసి విహరించిన ఈప్రాంతంలో భక్తులకోరిక మేరకు శ్రీనివాసుడు స్వయంభువుగా అర్చారూపుడై వెలసాడు. కల్యాణమైన తర్వాత సతీసమేతంగా విహరించినందున ఇక్కడ స్వామి శ్రీకల్యాణ వేంక టేశ్వరుడుగా కీర్తించబడుతున్నాడు. శ్రీనివాసుడు అలమేలుమంగతో కలసి విహరించిన ప్రాంతం గనుక ఈప్రాంతం శ్రీనివాసమంగాపురంగా ప్రసిద్ధి చెందింది.





## చారిత్రకనేపథ్యం

అగస్త్యాశ్రమప్రాంతంలో అలా స్వయంభువుగా వెలసిన ఈ స్వామికి మహంతులు, భక్తులు ఆలయం నిర్మించారు. ఇది అతి ప్రాచీనమైన ఆలయం. 1324లో సుల్తానులదాడులకు గురియై ఇది శిథిలమయిపోయింది. అలా శిథిలమైన ఈ ఆలయాన్ని 16వశతాబ్దంలో తాళ్లపాక అన్నమాచార్యులవారి మనుమడు తాళ్లపాక చినతిరుమలాచార్యులు జీర్ణోద్ధరణ గావించి నిత్యపూజాకైంకర్యాలను, నైవేద్యాలను ఏర్పాటు చేసినట్లు 22-3-1540 నాటి శాసనంద్వారా తెలుస్తోంది. అప్పటినుంచి దాదాపు 250 సంవత్సరాలపాటు ఈ ఆలయం ప్రభ దేదీప్య మానంగా వెలిగింది.

ఆతర్వాత చాలాకాలంపాటు పూజాపునస్కారాలు లేకుండా కళాహీనంగా ఉండింది. ఆతర్వాత 1940లో మహంతులు, అర్చకులచే పునరుద్ధరించబడింది. ఆతర్వాత 1967వసంవత్సరంలో తిరుమలతిరుపతిదేవస్థానంవారు ఈ ఆలయనిర్వహణ బాధ్యతలను స్వీకరించి వైఖానసాగమశాస్త్ర ప్రకారం నిత్యపూజలూ, ఉత్సవాలు నిర్వహిస్తున్నారు.



## ఆలయవిశేషాలు

ఈ ఆలయం తూర్పుద్వారంతో ఉంది. ఆలయ ప్రాంగణ ప్రవేశద్వారం ఉత్తరంవైపుగా ఉంది. ఆలయ ప్రాంగణంలోకి అడుగుపెట్టగానే దారికి ఎడమవైపున ఆలయ ద్వారానికి అభిముఖంగా నమస్కారభంగిమలో హనుమంతుడు దర్శనమిస్తాడు. హనుమంతునికి నమస్కరించి కుడివైపుకు తిరిగితే కోనేరుంది. కోనేరు ప్రక్కగా నడిచి ఆలయంలోకి ప్రవేశిస్తే కల్యాణ వేంకటేశ్వరుడు దేదీప్యమానంగా దర్శనమిస్తాడు.

ఈ ఆలయంలో స్వామి సర్వాలంకారభూషితుడై కటి, వరదహస్తాలతో తిరుమల వేంకటేశ్వరునివలె నిలువెత్తు మూర్తిగా నిలబడి దర్శనమిస్తాడు. గర్భగుడిముందు స్వామికి ఎదురుగా ఒక చిన్నమందిరంలో గరుత్మంతుడు కొలువై ఉన్నాడు. ఈ గరుత్మంతుని మందిరంపైన ఒక పెద్ద దర్పణం (అద్దం) అమర్చబడి ఉంది. ఆ దర్పణంలోకి చూస్తే గర్భగుడి లోని స్వామి స్పష్టంగా కనిపిస్తాడు. ఈ ఆలయంలో ఈ దర్పణ దర్శనం ఒక అద్భుతమైన ఏర్పాటు అని చెప్పవచ్చు.

ఆలయంచుట్టూ విశాలమైనప్రాంగణం, ఎత్తైన ప్రహరీ ఉన్నాయి. ఈ ప్రాంగణంలో ఆలయానికి దక్షిణం వైపున పెద్దమండపం ఉంది. ఇక్కడ ప్రతినిత్యం స్వామికి కల్యాణోత్సవం జరుగుతూంటుంది. ఈ ఆలయంలో స్వామికి నిత్యసేవలు, పూజలు, ఉత్సవాలన్నీ తిరుమల లోవలె జరుగుతాయి. ప్రతిరోజూ సుప్రభాతసేవనుండి పవళింపుసేవ వరకు అన్నీ ఆగమోక్తంగా జరుగుతాయి.

ఇక్కడ స్వామికి ప్రతినిత్యం లడ్డూలు, బెల్లంపొంగలి, మిరియాలపొంగలి, పులి హోరా, దధ్యోదనంవంటి పదార్థాలు నైవేద్యాలుగా నివేదిస్తారు.

ఈ ఆలయంలో స్వామికి నిత్యోత్సవాలు, వారోత్సవాలు, పక్షోత్సవాలు, మాసోత్సవాలు,

వార్షికోత్సవాలు అన్నీ శాస్త్రోక్తంగా జరుగుతాయి. ఈ స్వామికి మాఘ మాసంలో (ఫిబ్రవరిలో) బ్రహ్మోత్సవాలు అతివైభవంగా జరుగుతాయి. గరుడ, హనుమంతాది వాహనసేవలతో ఉత్సవాలు అంగరంగవైభవంగా జరుగుతాయి.

## ప్రాశస్త్యం

ఇక్కడ వెలసిన స్వామి తాను వివాహమాడి నూతన వధువుతో వచ్చి ఇక్కడ విహరించి ఇక్కడే స్వయంభువుగా వెలసి శ్రీకల్యాణవేంకటేశ్వరుడుగా కీర్తించబడుతూ భక్తుల కోర్కెలు తీరుస్తున్నాడు.

వివాహం జరగని యువతీయువకులు ఈ స్వామిని దర్శించి, ఇక్కడ జరిగే కల్యాణోత్సవాన్ని తిలకించి అక్కడ ఇచ్చే కల్యాణకంకణాలను కట్టుకుంటే వారికి పెళ్ళిళ్ళు జరుగుతాయని భక్తుల నమ్మకం. ఆ నమ్మకంతోనే కొందరు భక్తులు ఇక్కడనుంచి కల్యాణకంకణాలను ఎంతోభక్తితో తీసుకెళ్ళి తమ బంధుమిత్రుల్లో పెండ్లి కానివారికి ఇస్తూ ఉంటారు. వారూ ఎంతో భక్తితో ఈ కంకణాలను అపురూపంగా అందుకొని ధరించి సత్ఫలితాలు పొందుతూ ఉంటారు. ఈవిధంగా కల్యాణాలు జరిపించే దైవంగా ప్రశస్తి పొందాడు కల్యాణ వేంకటేశ్వరుడు.

వివాహం కానివారికి వివాహాలు జరిపించే కల్యాణదైవంగా, భక్తుల కోర్కెలు తీర్చే భక్తవత్సలుడుగా కొనియాడబడుతూ, భక్తుల ఆరాధనలు అందుకొంటూ అలరారుతున్నాడు శ్రీకల్యాణవేంకటేశ్వరస్వామి. ప్రతిఒక్కరూ దర్శించవలసిన క్షేత్రం శ్రీనివాసమంగాపురం. శ్రీనివాసమంగాపుర పరిసర ప్రాంతాలవారేకాక దూరప్రాంతాలనుంచి తిరుమలయాత్రకు వచ్చే భక్తులు కూడా చాలామంది ఈ క్షేత్రంలోని శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామిని దర్శిస్తూ ఉంటారు.


"శ్రీనివాసమంగాపురంలోని ఈ వెంకన్నను దర్శిద్దాం.
ఆయురారోగ్యైశ్వర్యానందాలను పొందుదాం"







ధారావాహిక



# తిరుమల సమయాచారములు

(తిరుమల-తిరుపతి ఐతిహ్యామాల)

తెనుగు అనువాదకులు:
కీ.శే. డా॥ ఎన్.సి.వి.నరసింహాచార్యులు,
కీ.శే. శ్రీమాన్ టి.ఏ.కృష్ణమాచార్యులు

*(గతసంచిక తరువాయిభాగం....)*

కలియుగారంభమున తొండమాన్‌చక్రవర్తి శ్రీవేంకట రమణుని పాదపద్మములం దత్యంత భక్తిగలవాడై సకలవిధ కైంకర్యములను నెరవేర్చుచుండు సమయమున తిరుమలకు ఈశాన్యదిగ్భాగమున ఒక ఆమడదూరమున 'కురువై' అను గ్రామమున నిత్యనివాసియై శ్రీవేంకటేశ్వర పాదపద్మములపై నిరవధిక భక్తియుక్తుడైన ఒక విష్ణుభక్తశ్రేష్ఠుడు కొండ 'అడి వారము'నందు (దిగువ) తన జీవికకై తగినట్లు కుండలు చేసి, పిమ్మట చేతికంటిన మట్టిని గోకి తీసి ఆ మట్టితో నాలుగు పూలుచేసి ఆ పూలను శ్రీవేంకటేశ్వరుల చరణకమలముల నుద్దేశించి భక్తితోడుత ప్రతిదినము సమర్పించుచుండెను. అతడు చరమశరీరి (మోక్షగామి కావున ఈ శరీరము కడపటిది) కాన అతడు సమర్పించిన పుష్పములు చక్రవర్తి సమర్పించిన స్వర్ణకమలములపై నుండగ, ఈ సంగతి చక్రవర్తి యొకనాడు అర్చకముఖమున వినియు, తాను స్వయముగ జూచియు, అట్టి పరమభక్తుని నాకు తెలియజెప్పుడని స్వామివారిని ప్రార్థింప శ్రీస్వామి 'అట్లు చేయజనదు' అనిరి. చక్రవర్తియు తప్పక చెప్ప వలెననినాడు. ఆ భక్తుడు 'తన నెవ్వరికిని తెలియజేయవలదు. అట్లు చేసిన నేను మరణింతును' అని మునుపే ఆ నంబి (కురువైనంబి యను ఆ భక్తుడు) చెప్పియుండినాడు. కావున శ్రీస్వామి అతనిని ప్రకాశపరుపరా దనిరి. చక్రవర్తి చెప్పవలెనని భగవంతుని నిర్బంధించెను. అంతట శ్రీనివాసుడు తన భక్తునకు అవసానదశ ఆసన్నమైనదని తెలిసి తన భక్తుడు 'పలానావాడు' అని, 'పలానా' ఊరిలో నున్నాడనియు తెలిపెను. ఆ భక్తుని దర్శనము చేసికొనవలెనని చక్రవర్తి బయలుదేరెను. అప్పుడు 'నీవు ఒంటరిగానే ఆతనిని చూడపోవలెను' అని స్వామివారు శాసించిరి.

అట్లే చక్రవర్తి బయలువెడలి అతనియూరు చేరి, అతని మ్రోల నిలువగ, అప్పుడా భక్తుడు దివ్యజ్ఞాని యగుటచేత ఎదుటనున్నవారు చక్రవర్తియని యరసి 'శ్రీవేంకటేశ్వరుడు తనను ప్రకాశపరచినాడు. ఇక ఈ శరీరము నాకు వలదు' అని తలచి, తన చేతనున్న కుండలు నిర్మించు సాధనమైన 'తట్టుపలక'తో తలపై మోదికొనినాడు. నాడు శుక్రవారమైనందున, అప్పుడు శ్రీనివాసునకు అభిషేకసమయము కావున కిరీటము మున్నగు ఆభరణములు తీసివేసిన సమయమగుటచేత అట్టి రూపము తోడనే ఆ భాగవతునకు దర్శనము ప్రసాదించి యాతనిని స్వీకరించెను కావున వేంకటాచలపతి ఆశ్రితపరతంత్రుడనియు, ఆపత్సఖుడనియు ఇతర చేతనులెల్లరును తెలిసి ధన్యులు కావలెనని శ్రీభగవద్రామానుజులు తమ దివ్యహృదయమున తలచి అ 'కరువై' గ్రామము ఆభరణములేని శిరముతోడను, స్వామిసన్నిధిని తట్టబుట్టలతోడ ఆ భక్తుని కూడ విగ్రహ రూపమున నిర్మింపించి గుడికట్టించి అందు ప్రతిష్ఠచేయించి నిత్యారాధన జరుగులాగున ఏర్పరచిరి.

పెద్దతిరుమలనంబి తిరుమలలో శ్రీవేంకటేశ్వరునకు అనుదినము పాపవినాశతీర్థము నుండి 'పెరియతిరుమొళి' ప్రబంధమును అనుసంధించుచూ అభిషేకతీర్థము తెచ్చెడి కైంకర్యము నెరవేర్చుచుండిరి. అట్లు వారొనర్చెడి తీర్థము కొని


జీవితంలో ధైర్యంకంటే ఆనందించదగింది లేదు

వచ్చెడి కైంకర్యము తనకు మిగుల ప్రీతిహేతువని యెల్లరును తెలియవలెనని యుల్లముననెంచి శ్రీవేంకటేశ్వరుడొకనాడు తిరుమలనంబి అభిషేకోదకము తెచ్చెడు త్రోవలో ఒకవ్యాధాకృతి దాలిచి విల్లంబులతోడ శ్రీశైలపూర్ణుల ఎదుట నిలచినాడు. 'తాతామనుష్యార్థము కాదు' అని బదులు పలికి, ఆ తీర్థము తలపై నిడుకొని 'తిరుమొళి' యనుసంధానము చేసికొనుచు పోవుచుండిరి. వ్యాధుడు తిరుమలనంబికి తెలియకుండ తీరుగ వారి వెనుకపోవుచు చేతనున్న మ్ముతోడ తీర్థకలశమునకు రంధ్రముచేసి, ఆ రంధ్రమునుండి ధారగా స్రవించుచున్న తీర్థమును దోసిటపట్టి త్రాగిరి. శ్రీశైలపూర్ణులు కలశమందలి జలము పోవుచుండుటచేత ఆ కలశము తేలికయగుట తెలిసి విచారించి వెనుదిరిగి చూచిరి. వ్యాధుని చేష్టితమును చూచి, 'ఓయీ వ్యాధుడా! శ్రీవేంకటేశ్వరునకు కొనిపోవుచున్న తీర్థము విషయము అపరాధము చేసితివి' అని పలికిరి. అతడు తిరుమల నంబిని జూచి 'మీరు విచారపడవలదు. సమీపముననే తీర్థమును చూపింతును, రండు' అనుచు ఆకాశగంగాతీర్థము కడకు పిలుచుకొనిపోయెను. ఆ మడుగులో తీర్థము లేకపోవుటచేత వింట బాణముతొడిగి ఒకగుండ్రాతికి క్రిందుగ పోవునట్లు వేసి దానిని మరల లాగివైచెను. పిమ్మట బాణము తగిలిన గుండ్రాతి క్రిందుగ జలధార బయలు వెడలెను. తర్వాత వ్యాధరూపమున నున్న శ్రీవేంకటాచలపతి 'తాతా! ఈ తీర్థమునుండి మాకు అనుదినము తీర్థము తెచ్చియిండు' అని నుడివి తనదు ఈశ్వరత్వ మును (పరమాత్మతత్త్వమును) స్మరణకు తెచ్చి మరగిపోయెను.

పిమ్మట తిరుమలనంబియు ఆ యద్భుతము గాంచి 'శ్రీవేంకటాచలపతి మాపై జూపిన క్రీడారసము పరమాద్భుతము' అని మిగుల మనసున సంతసించి ఆ తీర్థశిలాఖండమునుండి అభిషేకతీర్థము కొనివచ్చి స్వామి సన్నిధియందు మునుపటివలెనే సమర్పించెను. శ్రీనివాసభగవానుడు అర్చకముఖమున శ్లాఘించి 'తిరుమలనంబీ! మీరు కొనివచ్చుచుండిన తీర్థమువలన మార్గమధ్యముననే దప్పిక తీరినది' అని దయతో పలుకగ, శ్రీశైలపూర్ణులు 'ఇది యెట్టి అనుగ్రహవిధానము! ఆశ్చర్యకరము!' అని మిగుల సంతుష్టులై నాడు మొదలు ప్రతిదినమునను ఆకాశగంగాతీర్థధారనుండి తిరుమంజనకైంకర్యము నెరవేర్చు చుండిరి. కొన్నాళ్లు కడచనగ తిరుమలనంబి అవతారసమాప్తి (మృతి) నొందగ, శ్రీభగవద్రామానుజులు ఈ సంగతి విని

**భర్తృహరి సుభాషితం**

**మంచి నడవడికతో తండ్రిని సంతసింపచేసేవాడే నిజమైన కొడుకు.**

**భర్త హితము కోరేదే నిజమైన భార్య.**

**ఆపత్కాలంలోనూ, సుఖసమయంలోనూ సమానంగా ప్రేమ చూపేవాడే నిజమైన మిత్రుడు.**

**ఈ ముగ్గురూ లోకంలో పుణ్యం చేసినవాళ్ళకే లభిస్తారు.**

వారి చరణార విందములమీది ప్రేమాతిశయముచేత, ఆనాడు తిరుమల నంబిని మార్గమధ్యమున అనుగ్రహించిన దినము అధ్యయనోత్సవమునకు మరుసటి దినమగుటచేత ఆ తిరు మంజనకైంకర్య– ఐతిహ్యోత్సవమును శ్రీనివాసుడు, ప్రతి సంవత్సరమున అధ్యయనోత్సవము తిరునాళ్ల ముగియు సమయమున, స్వీకరించునట్లు కట్టడ చేసినారు.

బ్రాహ్మపురాణమున శ్రీవేంకటాచలమాహాత్మ్య ఘట్టమున తొండమాన్‌చక్రవర్తి వృత్తాంతమును వర్ణించు సందర్భమందు చక్రవర్తికి శ్రీవేంకటాచలపతి ప్రత్యక్షమయి హితోపదేశరూపముగ విషయమును తెలియజెప్పుచు అతనికి ఇష్టదైవముగా నుండిన దినములలో చక్రవర్తి శత్రుజయార్థమై, దేశాంతరములందు తాను వెడలిన స్థలములందంతటను జయము కలిగెను. కాని ఒకచోట అపజయము ప్రసక్తమై శత్రువులు తరుముకొని రాగా, చక్రవర్తి పరుగిడి వచ్చి తిరుమల యడివారమునందు గుహా మార్గమున పోయి స్వామి మ్రోలనిలచి తనకు కలిగిన పరా భవమును విన్నవించుకొనెను. శ్రీవేంకటేశ్వరుడు అతని మాటలను విని హితోక్తులతోడి అతని దుఃఖమును పోద్రోలి 'ఓయీ చక్రవర్తీ! జన్మాంతర పాపవిశేషము కొలదిగ నుండుట చేత ఈ యవమానము సంఘటిల్లెను. ఇక భవిష్యత్కాలమున నీకు అభ్యుదయము కలుగును. శత్రుజయార్థమై బయలు వెడలుము' అని పలుకగ 'అత దది వీలు" కాదని తెలుపగ, అంతట శ్రీనివాసుడు 'మాకు అసాధారణాయుధములైన శ్రీశంఖ చక్రములను నీకు యుద్ధమున సహాయపడుటకై యిచ్చెదము. వీనిని వెంట గొనిపొమ్ము' అని నుడివెను. *(ఇంకా ఉంది)*

# ప్రమాణాలకుండ తరిగొండ!!

– శ్రీ గోపీకృష్ణ

వాయల్పాడు (వాల్మీకిపురం) నుంచి గుర్రంకొండకు వెళ్లే రహదారిలో ఐదారుకి.మీ.లలో తరిగొండ అనే గ్రామముంది. ఇక్కడ శ్రీలక్ష్మీనరసింహస్వామివారు కొలువై పూజలందుకుంటున్నారు. ఇలా ఇక్కడ కొలువై ఉండటానికి రెండుకథలు బాగా ప్రాచుర్యంలో ఉన్నాయి. అవి... ఒకప్పుడు రాయదుర్గంలో బాగా కరువొచ్చిందట. అక్కడే నివాసమున్న రామానాయనిం అనే వ్యక్తి పశువుల మేతకోసం వాటిని తోలుకొని తరిగొండగ్రామానికి వలస వచ్చి ఇక్కడే నివాసం ఏర్పరచుకొన్నాడట.



అలా ఉండగా ఓ రోజు వారిభార్య లక్ష్మీనరసమ్మ మజ్జిగ చిలుకుతుండగా ఆ కుండలో ఏదో తగుల్తున్నట్లు అనిపించిందట. ఏంటా అని చూడగా అందులో లక్ష్మీనరసింహస్వామి సాలగ్రామం కనిపించిందట. అలాగే ఆ యజమానికి కూడా ప్రత్తిమిట్ట పాలనూయి మడుగువద్ద నిద్రలో ఉండగా స్వామి కలలో కనబడి తన విగ్రహం ఉన్నచోటు చెప్పి దానిని తీసి, తనకు ఓ గుడి కట్టించమని చెప్పాడట. అలా ఆ విగ్రహాన్ని కనుగొని బయటకు తీసి, గుడి కట్టించాడట. దాంతోపాటు ఆయన ప్రక్కనే సాలగ్రామంని కూడా ప్రతిష్ఠింపచేశారట. అలా తరిగొండగ్రామంలో ప్రతిష్ఠింపబడడంవల్ల దీనికి తరిగొండ లక్ష్మీనరసింహస్వామి అనే పేరు సార్థకమైందని పెద్దలమాట.

ఇంకొక కథావిశేషంలో లక్కమాంబ అనే గొల్లయువతి కదిరి లక్ష్మీనరసింహస్వామికి గొప్ప భక్తురాలట. ఈమె ఓసారి స్వామి తిరునాళ్లకు వెళ్లి వస్తానని తన అత్తగారిని అడిగిందట. అందుకు ఆమె అది కుదరదు. ఎప్పటిలాగే తరిగొండకు వెళ్లి పాలు పెరుగు అమ్ముకుని రాపో అని చెప్పిందట.



సరేనంటూ గంపనెత్తుకుని తరిగొండకు బయలుదేరిందట. అలా పోగా పోగా గంప బరువెక్కిపోయిందట. ఏంటా అని గంపదింపి చూడగా పాలముంతలో నల్లటి లక్ష్మీనరసింహస్వామి రాతిప్రతిమ కనిపించిందట. ఆ విధంగా కనిపించిన ప్రతిమను, అంతకుముందే గ్రామస్థులకు కలలో కనిపించినవిధంగా దొరికినశిలతోపాటు గుడికట్టి ప్రతిష్ఠించారట. అలా తరిగొండలో వెలసినాడట స్వామి.

తరువాతికాలంలో ఈ క్షేత్రమే సత్యప్రమాణాలకు పేరొందింది. ఈ ఆలయంలో బలిపీఠం ముందు నిలబడి ఎవరైనా సత్యప్రమాణం చేస్తే అదే స్వామి ఆదేశమంటూ అంగీకరించి తీరాల్సిందేనట. అంతటి విశ్వాసం ప్రజల్లో కల్గించిన ఈ స్వామి కుండలో ప్రత్యక్షమై తరిగొండలో వెలసి సత్యప్రమాణాలకుండ తరిగొండక్షేత్రంగా విలసిల్లింది. *(తిరుపతి పరిసరక్షేత్రాలు గ్రంథంనుండి...)*

వైదికవిజ్ఞానం

# వేదమాత గాయత్రి


- శ్రీ పింగళి పాండురంగారావు,
94405 54115

"వేద"మనగా జ్ఞానం. పరిమితులున్న మానవబుద్ధికి ఇది గోచరించదు. సమాధినిష్ఠయందు అనుభూతమైన ఆధ్యాత్మిక తత్త్వం పరమాత్మజ్ఞానాన్ని ప్రతిపాదిస్తుంది. వేదాలను ఆధారంగ చేసుకొన్నదే వైదికధర్మం లేక సనాతనధర్మం, వైదికధర్మానికి మూలాధారాలు. పరమప్రమాణాలైన వేదాలు, ఉపనిషత్తులు. వేదభాష అతిప్రాచీనమైంది. వేదమంత్రోచ్చారణకూడ కష్ట సాధ్యమే. వేదవిద్యను సామాన్యప్రజలకు అందచేయటానికి మహర్షులు శాస్త్రాలు రచించారు. కాలక్రమేణా వేదశాస్త్రాలను మరింత సులభశైలిలో కథారూపంలో 18పురాణాలుగా రచించారు. రామాయణం, మహాభారతం, భాగవతం, ఇతిహాసాలు రచించారు. వేదవేదాంగ శాస్త్ర, పురాణ, ఇతిహాసాదులు తరతరాలుగా సనాతనధర్మాన్ని ప్రబోధిస్తూ భారతీయసంస్కృతిని పరిరక్షిస్తున్నాయి.

వేదమాతయైన గాయత్రిని గురుముఖంగా ఉపదేశం పొంది ఎంత ఎక్కువగా జపిస్తే అంతగా రక్షిస్తుంది. మన భారతీయసంప్రదాయప్రకారం ప్రతిమంత్రానికి ఒక ఋషి, దేవత, ఛందస్సు కలిగి ఈశ్వరోపాసనవిషయంగా ఉంటుంది. శ్రీగాయత్రీమంత్రానికి విశ్వామిత్రుడు ఋషి. ఈశ్వర ఉపాసనా విషయం.

## మంత్రం

"ఓం భూర్భువ స్వః తత్సవితుర్వరేణ్యమ్
భర్గోదేవస్య ధీమహి ధియోయోనః ప్రచోదయాత్"



## భావార్థం

"హే రక్షకా! సచ్చిదానందస్వరూపా! సృష్టి, స్థితి, లయాత్మక పరంజ్యోతీ! ప్రసిద్ధము, సర్వోత్కృష్టమునగు నీ జ్ఞాన స్వరూపమును మేము నిత్యము ఉపాసింతుము. మాకు సద్బుద్ధి నిచ్చి, సత్కర్మము లాచరించునట్లు అనుగ్రహించుము".

ప్రాపంచికబాధలతో సతమతమవుతున్న మానవాళికి శాంతిని ప్రసాదించే దివ్యౌషధం ఆధ్యాత్మికచింతన ఒక్కటే. అందుకు అనువైనకాలం ఉదయం బ్రాహ్మీముహూర్త (ఉ.3-30 నుండి 4-00 గం॥ సూర్యోదయంవరకు), సమయంలో ప్రాణాయామం, యోగాభ్యాసంద్వారా శారీరకపుష్టిని, ఆధ్యాత్మిక చింతనద్వారా మానసికశాంతిని పొందవచ్చు.


నీతినియమాలు, సత్యధర్మాచరణలు సమాజ వైశిష్ట్యానికి గీటురాళ్ళు. క్రమశిక్షణ, నిరంతరసాధనలవల్ల మనిషి జీవితం నిర్మలం, ఆనందమయమౌతుంది. పాంచభౌతికశరీరం ఉన్నన్ని రోజులు ప్రకృతిప్రభావాలకు, ప్రలోభాలకు లోనవుతూనే ఉంటుంది. సుఖదుఃఖాదిద్వంద్వాలకు మామూలుమనుషులు బద్ధులైతే, యోగులు వాటికతీతంగా జీవిస్తారు.

కుల, మత, వర్గ, వర్ణ వివక్షలేకుండా, స్త్రీ పురుషుల భేదంలేకుండా ప్రతిఒక్కరు వైదికవిజ్ఞానంపై విశ్వాసం ఉంచి, సనాతనధర్మంపట్ల శ్రద్ధాసక్తులై జీవించడంవల్ల, మానవత్వం విలువల్ని పరిరక్షించగలిగినప్పుడు మాత్రమే సమాజశ్రేయస్సు జరుగుతుంది. జరిగి తీరుతుంది.

*ఓం శ్రీ గాయత్రీదేవ్యై నమః*

# ఈ సుగుణాలుంటే.. చాలు!!

-డా॥ పి.వి.ఉమాశశి,
94407 35155



**క్షమ కవచంబు, క్రోధమది శత్రువు, జాతి హుతాశనుండు, మి
త్రము దగుమందు, దుర్జనులు దారుణ పన్నగముల్, సువిద్య వి
త్త, ముచిత లజ్జ భూషణ, ముదాత్త కవిత్వము రాజ్య, మీ క్షమా
ప్రముఖ పదార్థముల్ గలుగు పట్టునఁ దత్కవచాదులేటికిన్**

మంచినీతిని తెలియజెప్పే ఈ పద్యం భర్తృహరి మహాకవి సంస్కృతంలో రచించిన శ్లోకానికి ఏనుగు లక్ష్మణకవి తెలుగు భాషలో అనువాదంగా వ్రాసిన పద్యరాజం.

మనిషికి ఓర్పు అనేదే కవచంలాగా రక్షిస్తుంది. ఇక క్రోధమనేది శత్రువుగా బాధిస్తుంది. దాయాది అగ్నివలె దహిస్తాడు. మిత్రుడు రోగాన్ని హరించే ఔషధంలాగా మేలు చేకూరుస్తాడు. మరి దుష్టులు మహాభయంకరమైన సర్పాలవంటివారు. ఉత్తమమైన విద్య(మంచి చదువు) ధనంకన్నా గొప్పది. తగినంతవరకే సిగ్గును కలిగి ఉండటం అందాన్నిచ్చే ఆభరణంవంటిది. ఉదాత్తమైన కవిత్వం రాజ్యంతో సమానం. క్షమ మొదలైన ప్రముఖమైన సుగుణాలు కలిగి, దుర్గుణాలను, దుష్టులను విడిచిపెట్టి సజ్జనుడైతే, అటువంటి మనిషికి ఎటువంటి రక్షకకవచాలు అవసరం లేదు.

ఎటువంటి ప్రవర్తన మంచిది? ఎటువంటి నడత చెడుగా మారుతుంది? అనే విషయాలను మానవుడికి బాల్యంనుంచి అలవడజేసే విషయబోధన ఈ పద్యంలో అడుగడుగునా గోచరిస్తుంది.

పరిస్థితులప్రాబల్యంవల్ల మనంతట మనకు కోపం రావచ్చు. లేదా ఎదుటివారివల్ల, పక్కవారివల్ల పట్టరానంతటి క్రోధానికి గురికావచ్చు. వారి మాటలు, చేతలు, స్వార్థం, ఈర్ష్య, కోపం రావటానికి కారణాలుగా రూపొందవచ్చు.

ఏది ఏమైనా, వచ్చిన కోపాన్ని మాపుకోవడానికి ఓర్పు వహించటం ఒక్కటే నిజమైన సాధనం. అందుకే ఆ ఓర్పు మాత్రమే మనిషిని కోపంనుంచి కవచంలాగా కాపాడుతుందన్నది కవివాక్కు. శత్రువుగా పీడించే క్రోధాన్ని ఉపశమించుకోవడానికి సహనం ఉపకరించినట్లు మరే గుణమూ సహాయపడలేదన్నది ప్రతిఒక్కరూ గ్రహించాలన్నది కవిహృదయం.

జ్ఞాతి అయినవాడు అగ్నిహోత్రుడిలాగా మంటలు పెడుతూనే ఉంటాడు. ఒకే ఇంటిపేరున్న



ధైర్యశాలి ఒక్కడే మెజారిటీ సంపాదిస్తాడు

పెదతండ్రి, పినతండ్రి కొడుకులు జ్ఞాతులు కావడంతో ఆ మనిషి ఆస్తిని, ధన కనక వస్తు వాహనాలను తమవిగా చేసుకోవడానికి ఆ వ్యక్తిని వధించడానికైనా వెనుదీయరు.

అందుకే జాతివైరమనే పేరు వ్యాప్తిలోకి వచ్చింది. దాయాదులైన ఆ బంధువులు, రక్తసంబంధమనైనా ఆలోచించకుండా అతని ఆస్తిని తగులబెడతారే తప్ప అతని ఆస్తిని అతనికి దక్కనివ్వరు. అందుకే జ్ఞాతిని (దాయాదిని) అగ్నితో పోలుస్తారు.

మిత్రుడు ప్రాణాన్ని ఇవ్వడానికి పూనుకుంటాడేగాని, ప్రాణాన్ని తియ్యాలని ఎప్పుడూ అనుకోడు. ఔషధం ఏవిధంగా ఆరోగ్యంతోపాటు ప్రాణాన్ని నిలుపుతుందో ఆవిధంగానే మిత్రుడుకూడా సహాయంతోపాటు, తన ప్రాణాన్ని అతనికోసం ఇవ్వడానికి సిద్ధపడతాడు. స్నేహితుడు మంచి ఔషధం వంటివాడని తెలుసుకోవటం ఎంతైనా ముఖ్యం.

దుష్టబుద్ధితో, అపకారనైజంతో హానిచేయుటవే ప్రవృత్తిగా సంచరించే చెడ్డవారు అనుక్షణం విషం కక్కే, ప్రాణాలు హరించే, మహాక్రూరసర్పాలవంటివారు. వాళ్ళు ఎప్పుడు ఏ చెడు తలపెడతారో ఎవరికీ తెలీదు. దుష్టులు పాములవంటివారు. కనుక వారికెప్పుడూ దూరంగా ఉండటమే మంచివాళ్ళు చేయవలసిన పని. ఆ దుర్జనులను గ్రహించి, వారిని సన్మార్గంలోకి ప్రవర్తిల్లేటట్లు చేస్తే అటువంటి వాళ్ళను ఉత్తములంటారు. ఆ ఉత్తములలక్షణాలను అనుసరించి ప్రవర్తిస్తే ఎటువంటి నష్టమూ కలుగదు.

ఉన్నతమైన, చక్కనివిద్యను మించిన ధనం జగత్తులోనే లేదు. చదువు లేకపోతే అజ్ఞానం ఆవరిస్తుంది. చదువుకుంటే ఏది మంచి, ఏది చెడు అనే జ్ఞానం కలుగుతుంది. మంచి విద్యను బోధించే గురువువద్ద విద్యను నేర్చుకుంటే ఆ శిష్యుడు గురువును మించిన శిష్యుడిగా పేరు పొందుతాడు.

విద్యాధనాన్ని ఎవరూ కన్నం వేసి దొంగిలించలేరు కదా! చదువు ఇచ్చే కీర్తి, ఆ పాండిత్యంవల్ల లభించే జ్ఞానం ఇంతా అంతా అని చెప్పగలిగేది కాదు. అది అపారం. ఎక్కడకు వెళ్ళినా విద్యావంతుడు ఆదరింపబడతాడు. అందుకే చక్కనివిద్యే ధనమని చెప్పబడుతుంది.

ఎక్కడ పడితే అక్కడ ఎక్కువగా సిగ్గును ప్రదర్శించటం కూడా మంచి లక్షణం కాదు. ఎంతవరకు చూపాలో అంతవరకే చూపితే ఆ సిగ్గు ఒక చక్కని నగలాగా శోభిస్తుంది.

శ్రేష్ఠమైన కవిత్వం చెప్పగలిగితే ఆ కవి రాజైనట్లే. ఆ కవికి రాజ్యం ఉన్నట్లే. రాజ్యమే ఉంటే ఇంకేం కావాలి కనుక! కవి సర్వే సర్వత్రా పూజింపబడతాడు. కవి, కవిత్వమే లేకుంటే అసలు లోకమే లేనట్లు! ఉత్తమ సమాజనిర్మాణమే జరగదు. కవి-కవిత్వంవల్లనే మానవుల్లో దుర్గుణాలు నశించి సమాజశ్రేయస్సు లభిస్తుంది.

క్షమ కలిగి ఉండటం, కోపాన్ని పోగొట్టుకోవటం, జాతి వైరాన్ని కాదనటం, స్నేహప్రవృత్తితో మెలగటం, దుర్జన సాంగత్యం వదలటం, మంచివిద్యను అభ్యసించటం, తగిన సిగ్గుతో వ్యవహరించటం, ఉత్తమకవిత్వాన్ని వ్రాయటం మొదలైన సుగుణాలు కలిగి ఉంటే చాలు మనిషిని ఉన్నతుని చేయటానికి వేరే కవచాలేవీ ఉపయోగించనక్కరలేదు. ఇంత గొప్ప నీతిసూత్రాలను ప్రతిఒక్కరూ జీవితసత్యాలుగా స్వీకరించి, పాటించటం లక్ష్యంగా పెట్టుకోవాలి.

## వైకుంఠపాళి
### :: 74 - సమాధానాలు ::

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 1 క | | 2 బ | భ్రు | 3 వా | హ | 4 ను | డు | |
| ళా | | డి | | మ | | డి | | 5 వ |
| 6 వ | న్నె | | 7 ఇ | ను | డు | | 8 ప్రా | పు |
| తి | | 9 పా | | డు | | 10 గు | | వు |
| | 11 అ | శ | న | | 12 క | జ్జ | లు | |
| 13 కు | | ము | | 14 ఆ | | ము | | 15 వా |
| 16 చే | ప | | 17 ఆ | పు | పు | | 18 లే | మ |
| లు | | 19 ర్ధి | | డు | | 20 వా | | ను |
| డు | | 21 అ | శ్మ | | 22 వ | రు | ణు | డు |

మన మహర్షులు

# జమదగ్నిమహర్షి బృహత్కార్యాలు

- శ్రీ డి.భాస్కరరామశర్మ, 92907 30792

మన సంస్కృతికి మహర్షులు మూలాధారం. పరమాత్ముడు నిత్యం మనకు కనిపించకపోవచ్చు. కానీ, త్రిగుణాతీతులుగా వారు చరిస్తూ మనకు మార్గనిర్దేశనం చేశారు. సత్యం ఎక్కడైతే ఉంటుందో అక్కడ ధర్మం ఉంటుంది. సత్యవాక్పరిపాలకులు పలికే పలుకులు నిజం అవుతాయి. వారు భూత, భవిష్యత్, వర్తమానాలను తెలిసినవారు. కాని నిర్వికారులు. మనం వారి జీవితాలను పరిశీలించినట్లయితే ఆయా పరిస్థితుల్లో వ్యక్తులు ఎవరెవరితో ఎలా ప్రవర్తించాలో, జీవితంలో ఎటువంటి విలువలను పాటించాలో, నైతికవిలువల ప్రాధాన్యత ఏంటో తెలుస్తుంది. ఈ క్రమంలో జమదగ్నిమహర్షి జీవిత గాథను సంక్షిప్తంగా తెలుసుకుందాం.

భృగువంశానికి చెందిన ఋచీకమహర్షి మరియు కుశికవంశానికి చెందిన గాధిరాజు కూమార్తె అయిన సత్యవతికి జన్మించిన కుమారుడు జమదగ్ని.

జమదగ్ని మహాతపస్సంపన్నుడు. తన తపోబలంతో కామధేనువును సంపాదించుకున్నాడు. దానిసహాయంతో తన వద్దకు వచ్చిన వారందరికీ సంతృప్తిగా భోజనాలు ఏర్పాటు చేసేవాడు. ఒకసారి కార్తవీర్యార్జునుడు జమదగ్ని ఆశ్రమానికి విచ్చేసినప్పుడు, తన కామధేనువుసహాయంతో మొత్తం రాజ పరివారానికి విందు ఏర్పాటుచేశాడు. కామధేనువుయొక్క శక్తి తెలుసుకున్న కార్తవీర్యార్జునుడు ఆ ధేనువును తనకు ఇవ్వాల్సిందిగా కోరాడు. కాని జమదగ్ని అందుకు అంగీకరించలేదు. కోపగించిన కార్తవీర్యార్జునుడు ధేనువును బలవంతంగా తనతో తీసుకునివెళ్లిపోయాడు. కొద్దిసేపటికి ఇంటికి తిరిగి వచ్చిన పరశురాముడు విషయం తెలుసుకుని కోపంతో కార్తవీర్యార్జునునితో యుద్ధం చేసి ఆయనను సంహరించాడు. విషయం తెలుసుకున్న జమదగ్ని తన కుమారుణ్ణి మందలించాడు. అందుకు పరిహారంగా తీర్థయాత్రలు చేసిరమ్మని సాగనంపాడు. తన తండ్రి మరణానికి ప్రతీకారంతో కార్తవీర్యార్జునుని కుమారులు జమదగ్నిని సంహరించారు. ఆ సమయంలో జమదగ్ని యజ్ఞం నిర్వహిస్తూండటంతో ప్రతిఘటించలేదు. ఇదంతా గమనిస్తున్న ఆయనభార్య రేణుక తన కుమారుణ్ణి వచ్చి కాపాడమని ఇరవైఒక్కమార్లు పిలిచింది. కాని తీర్థయాత్రలో ఉన్నందున పరశురాముడు స్పందించలేదు. తిరిగి వచ్చిన తరువాత కోపంతో రగిలిపోయి పరశురాముడు తన పరశువును తీసుకుని లోకంలోని క్షత్రియులపై ఇరవైఒక్కమార్లు దండెత్తి సంహరించి, తన తండ్రి మరణానికి ప్రతీకారం తీర్చుకున్నాడు.





ఏదీ తనంత తానై నీ దరికి రాదు; శోధించి సాధించాలి. అదియే ధీరగుణం

తపోబలసంపన్నుడైన జమదగ్ని క్షత్రియులచేతిలో హతం కావటానికి పురాణాల్లో ఒక కథనముంది. ఒక అనుచిత సమయంలో వచ్చి తన ఏకాంతాన్ని భంగం చేయటమే కాకుండా, తనకు నీతిధర్మాలు చెప్పిన సూర్యునిపై కోపగించి నీవు రాహుగ్రస్తుడవై, పాపదృశ్యుడవై, హతతేజుడవు అవుతూంటావు అని శపించాడు. ఆ శాపానికి సూర్యుడు కూడా ఆగ్రహించి, నీవు ఒక క్షత్రియునిచేతిలో మరణిస్తావు అని ప్రతిశాపం ఇచ్చాడు. ఆ కారణంగా జమదగ్ని క్షత్రియుని చేతిలో మరణించాడు. ఇక్కడ మనకు కొన్ని నీతిసూత్రాలు కనబడుతాయి. దీక్షాసమయంలో ఉన్న ఋషులు కోపాన్ని పరిత్యజించాలి. తమను తాము రక్షించుకోరాదు. ధర్మమార్గం తప్పరాదు. అందువల్లనే తపోబలసంపన్నత కలిగి ఉన్నప్పటికీ జమదగ్ని తన మరణాన్ని తాను నియంత్రించుకోలేదు.



జమదగ్ని, రేణుకలకు రుమణ్వతుడు, సుసేషణుడు, వసువు, విశ్వావసువు మరియు పరశురాముడు అనే మగపిల్లలు కలిగారు. పిల్లలు తల్లిదండ్రులను పార్వతీపరమేశ్వరులతో సమానంగా గౌరవిస్తూ శుశ్రూషలు చేస్తున్నారు. భార్య రేణుకకూడా భర్తసేవలో ఎటువంటి లోటు రానీయకుండా చూసుకుంటోంది. ఒకనాడు రేణుక మంచినీటికోసం దగ్గరలోని కొలనుకు వెళ్లింది. ఆ సమయంలో ఒక గంధర్వరాజు తన భార్యలతో జలక్రీడలాడుతూన్నాడు. ఈ సంఘటనను మనసులో ఎటువంటి వికారంగాని, చెడుభావనగాని లేకుండా క్షణకాలం తిలకించింది. ఈసందర్భంలో ఆమెచేతిలోని కడవ అప్రయత్నంగా జారి క్రిందపడి పగిలిపోయింది. ఆమెకు గతంలో నదిలోని మట్టితో కడవలు చేసే అలవాటుంది. అందువల్లే ఆమె ప్రయత్నించగా ఈసారి కడవ తయారు చేయలేకపోయింది. అప్పుడు ఆమె తనవల్ల తప్పు జరిగిందని గ్రహించి, దానికి పరిహారం తన భర్త అనుజ్ఞ తీసుకున్నతరువాతే నిర్వర్తించాలని అనుకుని ఇంటికి చేరుకుంది. ఆమె ఇంటికి చేరుకోగానే జమదగ్నికి విషయం అవగతమయ్యింది. ఆమె చేసిన తప్పుకు మరణదండన మాత్రమే సరైందని భావించి, తన కుమారులను పిలిచి రేణుకను వధించమని ఆదేశించాడు. కాని నలుగురుకుమారులు తల్లిని వధించటానికి అంగీకరించలేదు. కాని పరశురాముడు తండ్రి ఆదేశాన్ని శిరసావహించాడు. తన ఆజ్ఞను ఉల్లంఘించిన సోదరులను కూడా వధించమని చెప్పాడు. దానిని కూడా పరశురాముడు పాలించాడు. సంతోషించిన తండ్రి వరం కోరుకోమని అడగ్గా, తన తల్లిని మరియు సోదరులను బ్రతికించమని కోరాడు. దానికి జమదగ్ని అంగీకరించి వారిని బ్రతికించాడు.

జమదగ్ని జీవితంలో మరొక అత్యద్భుతమైన గాథ ఉంది. జమదగ్ని పితృకార్యనిర్వహణకోసం తెచ్చిన పాలు కొన్ని కారణాంతరాలవల్ల మలినం అయిపోయిన కారణంగా పితృకార్యం నిర్వహించలేకపోయాడు. మలినం చేసిన వ్యక్తిని క్షమించాడు. దానికి పితృదేవతలు ఆగ్రహించి అన్నివేళల్లోనూ శాంతం పనికిరాదు. సమయానుకూలంగా ఆగ్రహం ప్రదర్శించకపోతే అనర్థాలు కలుగుతాయి. తప్పులు చేసే వ్యక్తులకు భయం కలుగదు. అందువల్ల పితృదేవతలు జమదగ్నిని "నకులమై పుట్టు" అని శపించారు. నకులము అంటే ముంగిస. జమదగ్ని శాపావకాశాన్ని ఇవ్వమని కోరగా అందుకు పితృదేవతలు లోకమంతా మెచ్చుకునే ఒక కార్యక్రమాన్ని తప్పు అని నిరూపిస్తే నీకు శాపం తొలగిపోతుంది అని పలికారు. మరుసటి జన్మలో జమదగ్ని ముంగిసగా జన్మించాడు.

ఒకనాడు ఒక పేదబ్రాహ్మణుడు కొద్దిగా తినుబండారాలు సంపాదించుకుని తన కుటుంబంతో ఆరగించటానికి

కూర్చునేసమయంలో ధర్మదేవత అతణ్ణి పరీక్షించాలని వచ్చి ఆహారాన్ని యాచించాడు. వెంటనే ఆ పేదబ్రాహ్మణుడు తనకు గల మొత్తం ఆహారాన్ని దానంగా ఇచ్చాడు. మరునాడు కొద్దిగా గంజినీళ్ళు సంపాదించుకోగా దానినికూడా ధర్మదేవత యాచించి స్వీకరించాడు. మరుసటిరోజు వారు మంచినీరు త్రాగుతుండగా, దానినికూడా ధర్మదేవత స్వీకరించాడు. వారి దయాగుణానికి సంతసించి ధర్మదేవత వారికి ముక్తిని ప్రసాదించాడు. తాను ఆహారాన్ని స్వీకరించిన తరువాత కొద్దిపాటినీళ్ళతో ధర్మదేవత తనచేతులు శుభ్రం చేసుకున్నది.

అదేసమయంలో ముంగిసరూపంలో ఉన్న జమదగ్ని ఆ నీటిలో నడవటంవల్ల అతనిశరీరం సగభాగం బంగారువర్ణం లోనికి మారిపోయింది. మిగిలినసగభాగంకూడా బంగారువర్ణం లోనికి మార్చుకోవటానికి నీళ్ళు లేకపోవటంవల్ల నిరాశతో వెనుతిరిగాడు. అప్పటినుండి తన మిగిలినశరీరాన్ని బంగారు వర్ణంలోనికి మార్చుకోవటానికి దానధర్మాలు జరిగే అనేక ప్రదేశాలను సంచరిస్తున్నాడు. కాని ఫలితం కనబడలేదు.

ఆ తర్వాత కొద్దికాలానికి ధర్మరాజు రాజసూయ యాగం చేసి లక్షలకొలది బ్రాహ్మణులకు బంగారుపళ్ళెరాల్లో అన్నదానం చేస్తున్నాడు. ఆ విప్రులు చేతులు కడుక్కునే నీరు వరదలా పారుతోంది. భోజనం చేసిన విప్రులు ధర్మరాజు దానాన్ని ఎంతగానో శ్లాఘిస్తున్నారు.



ఇది తెలుసుకున్న ముంగిస తన మిగిలిన శరీరభాగం కూడా బంగారువర్ణంలోనికి మార్చుకోవాలని అక్కడికి వచ్చి ఆ నీటిలో స్నానం చేసింది. కానీ, ఆ నీటిప్రభావం ఏమీ కనబడలేదు. ధర్మరాజు చేసే అన్నదానంలో ఎటువంటి ప్రభావం లేదని, పూర్తిగా వ్యర్థమని నిందించింది.

ధర్మరాజు కారణం కోరగా పేదబ్రాహ్మణుని దానం గురించి తెలిపి, అదే నిజమైన దానమని తెలిపింది. వ్యక్తి తన శక్తి అనుసరించి దానం ఇవ్వాలి. శక్తి కలిగిఉండికూడా కొద్దిగా దానం చేసి యథాశక్తి అనరాదు. అది దోషం అవుతుంది. ధర్మరాజు చేసిన ఈ చిన్నదోషాన్ని నిరూపించి, ధర్మసూక్ష్మాన్ని వివరించింది. దానగుణంయొక్క అంతరార్థం వివరణ తెలిపింది.

లోకమంతా ఒప్పుకున్న ఒక ధర్మకార్యాన్ని సహేతుకంగా జమదగ్ని తప్పుని నిరూపించిన కారణంగా అతనికి ముక్తి కలిగింది. తరువాత జన్మరాహిత్యం కలిగింది. ధర్మానికి ప్రతీకగా పిలువబడే ధర్మరాజుకు కలిగిన స్వల్ప అహంకారాన్ని తొలగించి ఆయనను మరింత స్వచ్ఛంగా నిలపటానికి ఈ సంఘటన దోహదం చేసింది.

అందుకే వారు నిత్యం పూజనీయులు, అనుసరణీయులు. వారిని సదా స్మరించుకుంటూ, నైతికవిలువలను పెంపొందించుకుంటూ ధర్మబద్ధమైన జీవనాన్ని గడపటానికి మనవంతు కృషి చేద్దాం.

**శుభం భూయాత్**



# ప్రాచీన శైవక్షేత్రం పొత్తంగి పొట్టీశ్వరాలయం

- శ్రీ బద్రి కూర్మారావు, *97047 98643*

ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళంజిల్లా, మందసమండలం పొత్తంగి అనే కుగ్రామంలో పొట్టీశ్వర (పొత్తీశ్వరుడు) ఆలయం అనే ప్రాచీన శైవక్షేత్రం మహేంద్రగిరులకు, మహేంద్రతనయ నదికి ఆనుకొని ఉంది. (ఒరిస్సారాష్ట్రంలో కూడా పొట్టంగి అనే పేరుగల వేరే చిన్న పట్టణం ఉంది) ఇది సోంపేట పట్టణానికి 16కిలోమీటర్లు, 5వనెంబరు జాతీయరహదారిప్రక్కగల కొర్లాం అనే గ్రామానికి 5కిలోమీటర్లదూరంలోనూ మందసపట్టణానికి సుమారు 7కిలోమీటర్లుదూరంలో ఉంది.

క్రీ.శ.11వశతాబ్దంలో నిర్మించినట్లు చెబుతున్న ఈ దేవాలయం, దీని ప్రాశస్త్యంగూర్చి ఇంతవరకు వెలుగులోకి రాలేదు. మహేంద్రతనయనది ఒడ్డునగల ఈ దేవాలయానికి పురాణ, చారిత్రక నేపథ్యాలున్నాయి. పొత్తంగి పొత్తీశ్వరలయా నికి, ప్రస్తుతం ఒడిశా గజపతిజిల్లా పర్లాకిమిడికి 75కిలో మీటర్లు దూరంలో తూర్పుకనుమల్లో ఎత్తైన పర్వతశిఖరమైన మహేంద్రగిరులపై పాండవులచే నిర్మించినట్లు చెబుతున్న ప్రాచీన గుడులకు, శ్రీకాకుళంజిల్లా బారువాలోని కోటిలింగాల గుడులకు గల సంబంధాలను గూర్చి పౌరాణిక గాథలున్నాయి.

పొత్తంగి దేవాలయానికి ఆనుకొని ప్రవహిస్తున్న మహేంద్రతనయనది మహేంద్రగిరిలో పుట్టి, మూడు పాయలుగా చీలి బారువాదగ్గరలోగల బంగాళాఖాతంలో కలు స్తుంది. పొత్తంగి ఆలయానికి 5కిలోమీటర్లదూరంలో మహేంద్రగిరి పుట్టినచోట "పరశురాంకుండ్" ఉంది. ఈ పొత్తీశ్వరాలయం క్రీ.శ.11, 12 శతాబ్దాలమధ్య అనగా క్రీ.శ.1144లో పూరీమహారాజు నిర్మించినట్లు చెబుతున్న ఈ శైవక్షేత్రం ఓఢ్రశిల్పనిర్మాణంలో నిర్మించినట్లు తెలుస్తోంది. ఈ దేవాలయపు గర్భగుడి ద్వారంగోడలపై గల శాసనం దేవనా గరిలిపిలో ఉన్నట్లు చెబుతున్నారు. (ఈ లిపి ఒడియాగాని, తెలుగుగాని కాదు) ఒకప్పుడు ఈ ప్రాంతం కళింగ గజపతులపాలనలో ఉండటంచే వారే ఈ దేవాలయాన్ని నిర్మించినట్లు తెలుస్తోంది. అలాగే మహేంద్రగిరులపై ఉన్న పాండవులగుడులుకూడా ఈ కాలంలోనే నిర్మించినట్లు తెలుస్తోంది.

ఈ దేవాలయంలో ఉన్న శివలింగం పుట్టీశ్వరుడు. (పొత్తీశ్వరుడు) ఈ శివలింగం దేవాలయం గర్భగుడిలో చాలా లోతులో ఉంటుంది. మెట్లు దిగుతూ క్రిందికి వెళ్లాలి. ఈ శివలింగాన్ని చేతితో తాకితే పొట్టభాగం (ఉదరం)లా తగులుతుంది. మహేంద్రతనయనది స్పర్శచే తేమగా ఉంటుంది. తడిగా ఉంటుంది. దగ్గరలో గోవు గుండెకాయలాంటి చిన్నపాటి రాతివిగ్రహం కూడా ఉంది.





ఈ దేవాలయంచుట్టూ జైన, బౌద్ధవిగ్రహాలుకూడా ఉన్నాయి. ఒక జైన రాతివిగ్రహంపై ఉన్న చక్రంబట్టి ఇది జైన తీర్థాంకులలో 5వ తీర్థాంకుడైన "సుమతినాథ" కాలంనాటిదిగా చెప్పబడుతుంది. ఇటువంటి చిహ్నాలు కలిగిన విగ్రహాలు దేశంలో అస్సాంరాష్ట్రంలోని సూర్యపహడలోను, రెండవది పొత్తంగిలోనూ కనిపిస్తుందని పరిశోధకుల అభిప్రాయం.

ఈ దేవాలయప్రాంగణంలో విఘ్నేశ్వరవిగ్రహంతో పాటు, దుర్గాదేవి, ఒడిశ్శాసంప్రదాయంలోని జగన్నాథ, బలభద్ర, మరియు సుభద్రమూర్తులున్నాయి. దీనికి ఆనుకొని ఉన్న సిరిపురం, మహాదేవపురం అనే గ్రామంలో రాధాకృష్ణ మందిరం, గోపినాథఆలయం, రఘునాథమఠం, రామలక్ష్మణ సీతాసమేతమందిరాలు, మఠాలకు పరంపరగా మఠాధిపత్యం



వహించిన మహంతులసమాధులు (12తరాలకు చెందినవి), హనుమాన్‌మందిరం, ఉత్తరేశ్వరస్వామి, గోకర్ణేశ్వరస్వామివంటి గుడులున్నాయి.

ఈ ఆలయానికి సంబంధించి ఇతిహాసగాథకొస్తే ద్వాపరయుగంలో పాండవులు అరణ్యవాసంలో ఉన్నప్పుడు అర్జునుడు పితృశ్రాద్ధంకొరకు ఖడ్గమృగం వేటకు వెళ్లి కపిలేంద్ర అనే ఆవును, గండా (ఖడ్గమృగం)గా భావించి బాణంతో కొట్టగా ఆ ఆవు శరీరభాగాలు చెల్లాచెదురై నలువైపులా పడ్డాయట. ఆవుయొక్క శిరస్సుభాగం మహేంద్రగిరిపైన, పొట్ట(ఉదరభాగం) పొత్తంగి అనేచోట, పాదుగుభాగం బారువలో పడ్డాయట. ఇది చూసిన అర్జునుడు గోహత్య నివారణకు తపస్సుచేసి కపిల ఆవు పడి ఉన్నభాగంలో శివలింగాల్ని స్థాపించాడట. అవియే ప్రసిద్ధమైన శైవాలయాలుగా మారాయట. ఆవుయొక్క తల భాగం పడినచోట మహేంద్రగిరిపై వెలసిన పాండవుల గుడులుగా చెప్పబడుతున్న గోకర్ణేశ్వరుడు, శరీరం పడినచోట ఉత్తరేశ్వరుడు, పొట్టభాగం పడినచోట పొట్టేశ్వరుడు; రక్తం, పాదుగు పడినచోట కోటిలింగేశ్వరుడు (బారువాలో ) వెలశారు. పొట్టేశ్వరస్వామిదర్శనం చేసుకోకుండా మహేంద్రదర్శనం వృథా అని విభిన్నపురాణాల్లో వర్ణించారు.

ఈ శివాలయంలో ప్రతిసోమవారం భక్తుల కొద్దిపాటి తాకిడి ఉంటుంది. కార్తికమాసంలోను, శివరాత్రిపర్వదినాల్లోను భక్తులు వేలసంఖ్యలో దర్శిస్తారు. శివరాత్రిరోజున మహేంద్ర గిరులపై ఉన్న పాండవులగుడులు దర్శించుకున్న భక్తులు పొత్తంగి చేరుకొని మహేంద్రతనయనదిలో స్నానమాచరించి పొత్తేశ్వరుని దర్శించుకొని అచ్చటనుండి బారువా చేరుకొని కోటిలింగేశ్వరఆలయాన్ని దర్శించడంతో భక్తుల శివరాత్రియాత్ర పూర్తవుతుంది. ఈ ప్రాంతంలోని వ్యక్తులకు పొట్టెయ్య, పొట్టెమ్మ అని పేర్లు పెట్టుకుంటారు. ఇంత ప్రాశస్త్యమున్న ఈ దేవాలయం ఎటువంటి అభివృద్ధికి నోచుకోలేదు. మారుమూలప్రాంతంలో ఉండిపోవడంచేత, ఒడిశా సరిహద్దుప్రాంతం కావడంకూడా ఒక కారణం. ప్రస్తుతం దేవాదాయ, ధర్మాదాయశాఖ అధీనంలో నడుస్తున్న ఈ దేవాలయానికి ఆదాయంకూడా అంతంత మాత్రమే. సుమారు 10ఎకరాలభూమి దేవునిపేరుమీద ఉన్నప్పటికీ దానిమీదకూడా పెద్ద ఆదాయం లేదు. ఈ దేవాలయాన్ని బాగా అభివృద్ధిచేసి వెలుగులోకి తీసుకువస్తే మరింత పురోభివృద్ధి సాధించడంతోపాటు చారిత్రకనిర్మాణాన్ని కూడా కాపాడిన వారలం అవుతాం.

## తిరుమల తిరుపతి దేవస్థానములు

# తిరుమల శ్రీవారి తెప్పోత్సవం

## (13-03-2022 నుండి 17-03-2022 వరకు)





13-01-2022న వైకుంఠఏకాదశి సందర్భంగా
పుష్పాలతో అలంకరింపబడ్డ శ్రీవారి ఆలయం

13-01-2022న వైకుంఠఏకాదశి సందర్భంగా
తిరుమల మాడవీధులలో స్వర్ణరథంపై ఊరేగుతున్న శ్రీదేవిభూదేవిసమేత శ్రీమలయప్పస్వామివారు





27-01-2022న తి.తి.దే. ఆధ్వర్యంలో జరిగిన నమామిగోవింద కార్యక్రమంలో ప్రదర్శింపబడిన పంచగవ్య ఉత్పత్తులు. అందులో పాల్గొన్న తి.తి.దే. పాలకమండలి అధ్యక్షులు శ్రీ వై.వి.సుబ్బారెడ్డి, తి.తి.దే. కార్యనిర్వహణాధికారి డా॥ కే.ఎస్.జవహర్‌రెడ్డి, ఐ.ఏ.ఎస్., ప్రముఖులు మరియు ఇతర ఉన్నతాధికారులు.















# తిరుమల తిరుపతి దేవస్థానములు



05-01-2022న తి.తి.దే. సంగీత నృత్యకళాశాలలోని శ్రీనటరాజస్వామిని సందర్శించిన కంచికామకోటి పీఠాధిపతి శ్రీ.శ్రీ.శ్రీ.విజయేంద్రసరస్వతిస్వామివారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న తి.తి.దే. సంయుక్త కార్యనిర్వహణాధికారి శ్రీమతి సదా భార్గవి, ఐ.ఏ.ఎస్.,



తిరుచానూరు శ్రీపద్మావతిఅమ్మవారి ఆలయంలో 21-01-2022నుండి 27-01-2022వరకు జరిగిన నవకుండాత్మక శ్రీయాగమహోత్సవ పూర్ణాహుతి దృశ్యం



26-01-2022న 73వ గణతంత్రదినోత్సవం సందర్భంగా తిరుపతి పరిపాలనాభవనప్రాంగణంనందు త్రివర్ణపతాకం ఎగురవేస్తున్న తి.తి.దే. కార్యనిర్వహణాధికారి డా॥ కే.ఎస్.జవహర్‌రెడ్డి, ఐ.ఏ.ఎస్., మరియు ఇతర ఉన్నతాధికారులు



26-01-2022న 73వ గణతంత్రదినోత్సవం సందర్భంగా ప్రసంగిస్తున్న తి.తి.దే. కార్యనిర్వహణాధికారి డా॥ కే.ఎస్.జవహర్‌రెడ్డి, ఐ.ఏ.ఎస్.,



26-01-2022న 73వ గణతంత్రదినోత్సవం సందర్భంగా గౌరవ కవాతువందనం స్వీకరిస్తున్న తి.తి.దే. కార్యనిర్వహణాధికారి డా॥ కే.ఎస్.జవహర్‌రెడ్డి, ఐ.ఏ.ఎస్.,

# నిఘంటువుల్లో పంచగవ్యాలు



- శ్రీ ఎన్.గోపాలకృష్ణ, 94930 53206



### రసతరంగిణి

గవ్యం క్షీరం దధి ఘృతం గోమూత్రం గోమయం తథా।
ఏకత్రయోజితం తృత్యం పంచగవ్య మిహోత్యతే॥

ఆవుపాలు, పెరుగు, నెయ్యి, మూత్రం, గోమయరసం అన్నింటిని సమభాగాలుగా కలిపిన దానిని పంచగవ్యం అంటారు.

### భావప్రకాశమధ్యఖండం

గవ్యం దధ్యుత్తమం బల్య పాకే స్వాదు రుచిప్రదమ్
పవిత్రం దీపనం స్నిగ్ధం పుష్టి కృత్పప వాపహమ్॥
ఉక్తం దధ్నామ శేషానాం మధ్యే గవ్యం గుణాధికం

ఆవుపాలనుండి తయారైన పెరుగు ఉత్తమమైనది. రుచి గలది. పవిత్రమైనది. జఠరాగ్నిని వృద్ధిచేస్తుంది. వాతాన్ని పోగొడుతుంది. అన్ని పెరుగుల్లోనూ ఆవుపెరుగు ఉత్తమం.

### యోగరత్నాకరం

దారుగుగ్గులు శుణ్ఠీనాం కల్కే మూత్రేణ శోషజిత్

దేవదారుగుగ్గలు, శొంఠి గోమూత్రంతో నూరి వాపు గలచోట పూసినా, గోమూత్రం పానం చేసినా శోధరోగం నశిస్తుంది.

### యోగరత్నాకరం-గోఘృతాదిపానం

గవ్యం సర్పిస్త్రహం పీత్వా నిర్గుణీ స్వరసం త్ర్యహమ్।
పీత్వా స్నాయుక మత్యుగ్రం హస్త్య వశ్య న సంశయః॥ 18

ఆవునెయ్యిగాని, వావిలాకురసంగాని మూడుదినాలు పానం చేసినయెడల తీవ్రమైన స్నాయుకవ్రణం నిస్సంశయంగా నశిస్తుంది.

### ధన్వంతరినిఘంటువు

గోమూత్రం, గోమయం, క్షీరం, దధి సర్పిస్త ధైవచ
సమం యోజిత మేకత్ర పంచగవ్యమితి స్మృతమ్॥ 42
తద్గణ స్సర్వ పాపఘ్నో గుల్మ విద్రధి నాశనమ్। 43

గోమూత్రం, గోమయం, గోక్షీరం, పెరుగు, నెయ్యి సమంగా చేర్చిన పంచగవ్యాలు అనబడుతాయి. ఇవి సమస్త పాపాలను నశింపజేస్తాయి.

### ధన్వంతరినిఘంటువు- ఆంబోతుగుణం

ప్రాతర్దర్శేచ వృషభం కల్యాణం చ ఫలపరమ్
ఐశ్వర్యం లభతే నిత్యం శంకరస్యాను వాహనమ్ 100

ఆంబోతును ప్రాతఃకాలమున దర్శించిన ఉత్తమ ఫలమునిస్తుంది. సుఖం, ఐశ్వర్యం సిద్ధిస్తాయి.

### ధన్వంతరినిఘంటువు- (పాలుగుణం)

దుగ్ధమత్యంత మధురం బలమేధాగ్ని వర్ధనమ్
కార్శ్యఘ్నం బృంహణం హస్త పాదాంగ దాహజిత్ 19

ఆవుపాలు మిక్కిలి మధురముగను, గురువుగను, వీర్య వృద్ధికరముగను ఉంటాయి. ఇది కృతత్వము, అరచేతులు, అరికాళ్లమంటలను నివర్తింపజేయటమే గాకుండా బలం, సూక్ష్మబుద్ధి, అగ్నిదీపనంవంటివి కలుగజేస్తాయి.

### తక్రగుణం - ధన్వంతరినిఘంటువు

తక్రం గ్రాహి కషాయామ్లం మధురం దీపనం లఘు
వీర్యోష్ణం బలదం ప్రీణనం వాత నాశనమ్॥ 15

మజ్జిగ మలబద్ధకారిగను, వగరుగను, పుల్లగను, తీయగను, చులకగను, రూక్షముగను, దీపనకారిగను,

ఉష్ణవీర్యంగలదిగను, బలకరముగను, తృప్తికరముగను ఉంటుంది. వాతం, వాపు, విషం, వాంతిని పోగొడతాయి.

### యోగరత్నాకరం

గవ్యంతు దీపనం తక్రం మేధ్య మర్శ స్త్రి దోషనుత్
హితం గుధ్మితి సారేషు ప్లీహార్మే గ్రహణీ గదే

ఆవుమజ్జిగ జఠరాగ్నిని పెంచుతుంది. త్రిదోషాలను హరిస్తుంది. బలవర్ధకం. మూలవ్యాధి హరిస్తుంది. అతిసారం, ప్లీహం మొదలైన రోగాలను పోగొడుతుంది.

### ఘృతగణాః-2 యోగరత్నాకరం

సర్పిగనాం చామృతకం విషఘ్నం చక్షుస్యమారోగ్యకరం వృణ్యమ్
రసాయనం మన్దమతీమేధ్య స్నేహోత్తమం చేతి బుధాఃస్తు వన్తి

ఆవునెయ్యి అమృతం. విషనాశకరం. కళ్లకు మంచిది. ఆరోగ్యకరం. వీర్యవర్ధకం, రసాయనం, గంధయుక్తం, మేధస్సును వృద్ధిచేస్తుంది.

### శారంగధరసంహిత (కర్ణకీటకములకు చికిత్స)

పురాణం హరితాలేణ గవాం మూత్ర యుతేన చ
అథవా సార్ష పంతైలం కర్ణకీటహరం పరమ్ 151

తాళకం, గోమూత్రంతో కలిపిగాని, తెల్లఆవనూనెగాని చెవిలో పోస్తే చెవిలోని పురుగులు నశిస్తాయి.

### శలాకనిర్మాణక్రమం


త్రిఫలాభృంగ శుంఠీనాం రసైస్తద్వచ్చ సర్పిషా। 115
గోమూత్ర మాధ్వజాక్షీరైస్సిక్తో నాగః ప్రతాపి పితః
తచ్ఛలకా హరత్యేవ సర్వాన్నేత్ర భవాన్గధార్। 116

నల్లసీసము ఏడుసార్లు కరిగించి త్రిఫలాకషాయం, గుంటగలగరసం, శొంఠికషాయం, నెయ్యి, గోమూత్రం, తేనె, మేకపాలు వీటిలో పోసి, దానిచే శలాకచేసి నేత్రములు తుడిచిన కంటిరోగాలన్ని హరిస్తాయి.

### దుర్గ్ధగుణాః/4 యోగరత్నాకరము

గోక్షీరం మధురం శీతం గురుస్నిగ్ధం రసాయనం।
బృహణం స్తన్య కృ ద్ధహ్యం జీవనం వాతపిత్తనుత॥

జీర్ణజ్వరాలు, మూత్రకృచ్ఛం, రక్తపిత్తం, మదాలత్సం, కాసశ్వాస మొదలైనరోగాల్లో ఆవుపాలు తాగుతూ ఉండాలని వైద్యశ్రేష్ఠులు చెబుతారు.



*గతసంచిక తరువాయిభాగం...*

అవి కాశిరాజులయొక్క వంశం ఒకటి. అలాగే విదేహ రాజులయొక్క వంశం. ఈ ఇద్దరు రాజులవంశాల్లోను ఎప్పుడు చూసినా వీరులే పుదుతుండేవారట. ఇది ఎప్పటినుండి మొదలయిందంటే ఉపనిషత్తులకాలంనుంచి మొదలయింది. ఉపనిషత్తుల కాలంలోకూడ మహావీరులెవరు అంటే కాశిరాజు, విదేహరాజు అని చెప్తుతుంటారు. బృహదారణ్యకోపనిషత్తులో ఒకచోట "యథా కాశ్యోవా వైదేహోవా ఉగ్రం ధనురధిత్యం కృత్వా" అని ఉన్నది. కాబట్టి అట్లాంటి వీరులవంశంలో పుట్టిన కాశిరాజు వాళ్ళపక్షాన చేరటమేమిటి? నాపక్షాన ఉండాలిగదా అని అసూయ. ఇక్కడ "కాశిరాజః" అని ఉంది గదా. ఆ పదం స్వారస్యం ఇంకోరకంగ కూడ మనం చూస్తున్నాం. బృహదారణ్యకోపనిషత్తులోను, 'ఆవాక్యంలోను కాశిరాజః' అని ఇక్కడ కూడ కాశిరాజః అని ఉంది గదా కాబట్టి ఈ రెండింటికి ఏమన్నా సంబంధం ఉందా! తప్పకుండా ఉంది. ఆ ఉపనిషత్తులయొక్క సారమే శ్రీమద్భగవద్గీత. ఆ విషయాన్నికూడ సూచన చెయ్యటంకోసం 'కాశిరాజశ్రీ' అని అన్నారని కూడ అర్థం చేసుకోవచ్చు. 'కాశిరాజశ్చ వీర్యవాన్' అట్లాగే పురుజిత్, కుంతిభోజః అనే పేరు వాస్తవానికి కుంతీదేవియొక్క తండ్రి. కుంతీదేవిని పెంచుకున్న తండ్రి. ఆ వంశంలో ఉన్న రాజులపేర్లు 'కుంతిభోజః' అనే ఉన్నాయి. కాబట్టి ఆవంశంలో వచ్చినటువంటి పాండవులయొక్క సమానకాలంలో ఉన్నటువంటి ఒక వీరుడు. అట్లాగే 'శైబ్యశ్చ' శిబిదేశపురాజు. ఈయన 'నరపుంగవః' చాలా మంచివీరుడు. వీరులలోకెల్ల లెక్కజేయాలంటే 'శైబ్యశ్చ' శిబిదేశపురాజు వస్తాడు. అటువంటి రాజుకూడ వెళ్ళి ఆ పాండవులపక్షాన చేరాడు అని అసూయను ప్రదర్శిస్తూన్నాడు. ఇంకొంతమంది వీరులపేర్లు చెబుతున్నాడు.

**"యుధామన్యుశ్చ విక్రాంత ఉత్తమౌజాశ్చ వీర్యవాన్**
**వ్యాభద్రో ద్రౌపదేయాశ్చ సర్వ ఏవ మహారథాః 1-6**

అని యుధామన్యువు అని ఒకవీరుడు. ఈయన ధృష్టద్యుమ్నునికి తమ్మునివరుస అవుతాడు. వీరిని విక్రాంతః అంటున్నాడు. మంచి పరాక్రమం గలవాడు అనర్థం. అట్లాగే 'ఉత్తమౌజాః' ఇంకొక వీరుడు ఈయన. యుధామన్యువుకి తమ్మునివరుస. మహావీరుడు 'ఉత్తమౌజాశ్చ వీర్యవాన్' చాలా పరాక్రమం ఉన్నవాడు. అట్లాగే సౌభద్రః సుభద్రాకుమారుడు అభిమన్యువు పదహారేళ్ళవయసు. ఇంకా విద్యాభ్యాసం పూర్తికాలేదు. పూర్తిగా వ్యూహాల లోపలికి వెళ్ళటం తెలుసు. కాని బయటకు రావటం తెలీదు. శస్త్రాస్త్రాలు పూర్తిగా ఉపదేశాలు ఎవరూ సరిగ్గా చేయలేదు కాని మహావీరుడు అని అప్పటికే పేరొచ్చేసింది. పదహారేళ్ళపిల్లవాడికి గుండెల్లో దమ్ముంది. మానాన్నల్ని వాళ్ళు అన్యాయం చేస్తారా దానికి ప్రతీకారం తీర్చేసుకుంటాను నేనొక్కణ్ణే చాలు అని బీరాలు పలుకుతున్నాడు. అట్లాంటి 'సౌభద్రః'

ధారావాహిక

# శ్రీమద్భగవద్గీత


- ఆచార్య కుప్పా విశ్వనాథశర్మ

సుభద్రాకుమారుడు. ఈ సుభద్రాకుమారుడిగురించి ఇప్పటికే మంచి సమాచారం వచ్చింది. మహావీరుడు అతడు తగిలాడంటే మాత్రం ముందునుంచి వెన్నుపోటు పొడవటానికప్పుడే సిద్ధం చేసేసుకున్నారు. ఈ సుభద్రాకుమారుడు అభిమన్యుణ్ణి ఎవరూ ముందునుంచి చంపలేరు. అటువంటి మహావీరులు 'ద్రౌపదేయాశ్చణ' ద్రౌపదియొక్క కుమారులు ఐదుగురుపతులకు అని మనకు తెలిసిందే. ఒక్కొక్క పాండవునిద్వారా ఒక్కొక్క కుమారుడు కలిగాడు. అందులో ధర్మరాజు ద్వారా ప్రతివింధ్యుడు, భీమసేనుడిద్వారా శృతసోముడు, అర్జునుని ద్వారా శృతకీర్తి, నకులునిద్వారా శతానీకుడు, సహదేవునిద్వారా శృతసేనుడు అనే కుమారులు కలిగారు. వీరు ఐదుగురుకుమారులు మహావీరులు అని అప్పటికే ప్రసిద్ధికొచ్చేశారు. వారు యుద్ధానికి నిలుచుని ఉన్నారు. వీరందరిని పేరుపేరున తలుస్తున్నాడు. రెండు విషయాలు గమనిద్దాం. ఎవరినైనా తనకు వరస అయ్యే వరసలో పిలిచాడా? నాతమ్ముడు, నాఅన్న, నాబావ అన్నాడా? లేదు వాళ్ళ నాయనపేరో వాళ్ళమ్మపేరో చెప్తున్నాడా? సౌభద్రః అని సుభద్రపేరు చెప్పాడు. ద్రౌపదేయాశ్చ అని ద్రౌపదిపేరు చెప్పాడు. అంతే తప్ప నాకు తమ్ముడిపిల్లలు అంటున్నాడా? అనటం లేదు ఎందుకు అనటం లేదు? మానవతాదృక్పథమే లేదు. మానవతాసంబంధాలమీద విలువ లేదు. కేవలం ఈ యుద్ధంలో నేను గెలవాలి. రాజు నవ్వాలి ఇంతే ఆశ. ఇట్లాంటి ఆశ ఉన్నవాడికి ఏమిగతి పడుతుంది? అనేదానికి ప్రత్యక్ష ఉదాహరణ దుర్యోధనుడే! మానవతాసంబంధాలకు విలువ ఇవ్వకుండా, మానవులకు విలువ ఇవ్వకుండా కేవలం భౌతికమైన పదార్థాలకు, రాజ్యాలకు, అధికారాలకు విలువ ఇచ్చేవాడికి దుర్యోధనుడియొక్క గతే పడుతుంది అనటానికి ఈ మాటలే ప్రత్యక్షమైన ఉదాహరణ. "సర్వ ఏవ మహరథాః" అంటున్నాడు. అందరూ మహారథులే అంటున్నాడు అంటే అర్థం ఏమిటి? రథి, అర్థరథుడు, మహారథుడు, అతిరథుడు అని నాలుగురకాల తరాలుంటాయి. నాలుగు వరసలుంటాయి. నాలుగువరసల్లో ఉన్నవాళ్ళని నాలుగురకాలుగ విభజించి చూడాలి. కాని 'సర్వఏవమహారథాః' అని సమానంగ మాట్లాడుతున్నాడు. మరైతే రథి అంటే ఎవరు? అర్థరథుడంటే ఎవరు? మహారథి అంటే ఎవరు? లేదా అతిరథుడంటే ఎవరు? అనే సంగతి మనం మళ్ళీ చూద్దాం. తెలుసుకుందాం. ***(ఇంకా ఉంది)***

108 దివ్యదేశాలు

# నిచుళాపురి

- ఆచార్య చక్రవర్తిరంగనాథన్



శ్రియఃపతియైన శ్రీమన్నారాయణుడు అర్చామూర్తిగా ఈ భూలోకంలో కొలువుతీరి భక్తులను అనుగ్రహిస్తున్నాడు. అందులో విశేషించి పన్నిద్దరు ఆళ్వారులచేత కీర్తింపబడిన దివ్యదేశాలు అగ్రస్థానాన్ని అలంకరిస్తున్నాయి. ఆ దివ్యదేశాల వైభవంగురించి మనం ప్రతినెల తెలుసుకుంటున్నాం. 40 చోళదేశదివ్యదేశాల్లో రెండవదివ్యదేశం 'నిచుళాపురి' అనే ఉఱైయూర్.

ఈ దివ్యదేశానికి ఘనమైన చరిత్ర ఉన్నది. చోళరాజులు ఉఱైయూర్‌ని రాజధానిగా చేసుకొని పరిపాలన చేసేవారు. చోళరాజుల్లో నందచోళుడు అనే రాజు ప్రతిరోజు తన ధర్మపత్నితోపాటు శ్రీరంగక్షేత్రాధిపతియైన శ్రీరంగనాథుణ్ణి సేవించిన తరువాతనే తన రాజకార్యకలాపాలను ఆరంభించేవాడు. ఎంత సంపదఉన్నను, ఎన్నిరోజులు గడిచినను, ఎంత వైభవం తనకున్నను సంతానం లేనిలోటు రాజదంపతులను మిక్కిలి బాధిస్తూ ఉండేది.

ఒకానొకరోజు రాజమహిషి ఓ స్వామీ! మనం శ్రీరంగనాథుణ్ణి ప్రతిరోజు సేవిస్తున్నాం. స్వామికి మనబాధ తెలియదా! మీరు భగవంతునితో నివేదించవచ్చు కదా! ఈ అనపత్యతను నేను సహించలేకున్నాను. కనుక, మీరు మీ ఇష్టదైవమైన శ్రీరంగనాథునిసన్నిధిలో నివేదించి ఈ లోటును తీర్చమని ప్రార్థించగలరని వేడుకొన్నది. కాని నందచోళుడు అమ్మా! అన్నీ భగవదిచ్ఛ. దేవదేవుని సేవించడమే మన కర్తవ్యం. భగవదనుగ్రహంచేత మనకు ఆ లోటు తీరిపోవచ్చు. కనుక కొద్దికాలం వేచి చూద్దామని భార్యను సమాధానపరిచాడు రాజు.



ఈ వృత్తాంతాన్ని గమనించిన శ్రీరంగనాథుడు ఈ రాజదంపతులను అనుగ్రహించాలని సంకల్పించుకొన్నాడు. తన పట్టమహిషియైన మహాలక్ష్మిని నందచోళునిపుత్రికగా నీవు భూలోకంలో అవతరించి వారి సంతాన కొఱతను తీర్చి వారిని అనుగ్రహింపుమని అడిగాడు.

శ్రీరంగనాథుని నియమనాన్ని శిరసావహించింది జగజ్జనని. లీలామానుషవిగ్రహుడైన స్వామి చోళరాజుని ఒకానొకనాడు వేటాడ్డానికి అరణ్యానికి రప్పించాడు. ఎంతసేపు వేచిచూచినాకూడ ఒక జంతువుకూడ కన్పించలేదు రాజుకి. తన విల్లంబులకు పనిలేకుండాపోయిందే. ఈసమయాన్ని వృధా చేసుకొన్నానే. ఈసమయంలో శ్రీరంగనాథుని


సన్నిధిలో ఉండిఉంటే జన్మసార్థక్యం అయి ఉండేది కదా అని బాధపడుతున్నసమయంలో అతనికి ఒక చిన్నశిశువుయొక్క ఏడుపు వినిపించింది. ఆ దిక్కునుగూర్చి నడిచి వెళ్లాడు. అక్కడ తామరపుష్పాలతో నిండిఉన్న ఒక శోభాయమానమైన కొలనులో ఒకతామరపుష్పంలో శిశువు చేయికాళ్లను అలా ఆడిస్తూ కన్పించింది. వెంటనే నందచోళుడు తామరకొలనులో దిగి ఆ శిశువును అక్కున చేర్చుకొన్నాడు.

ఎంత ఆనందమో! ఆ శిశుస్పర్శకి పులకితగాత్రుడై నాడు రాజు. ఆహా! భగవదనుగ్రహమేకదా ఇది అని సంతోషించి ఆ శిశువును తీసుకొని తన రాజ్యానికి వచ్చి, మహారాణి దగ్గర చూపెట్టగా ఆవిడ ఆనందడోలికల్లో తేలి పోయింది. తల్లి పాశంతో ఆ బిడ్డను ఆలింగనం చేసుకొన్నది. ఆనందతాండవం చేసింది. తన కొఱతను ఆ దేవదేవుడే తీర్చాడని సంతసించింది. ఈ రాజదంపతులు తమలోటును మర్చిపోయారు. రాజు తన రాజకార్యకలాపాల్లో మునిగి పోయాడు. కమలకొలనులో దొరికింది కనుక ఆ బిడ్డకు "కమలవల్లి" అని నామకరణం చేశారు.

దినదినప్రవర్ధమానమై కమలవల్లి యుక్తవయస్సుకు వచ్చింది. తన అవతారం ఎందుకని మహాలక్ష్మి అందరికీ తెలియచేయాలనే ఉద్దేశ్యంతో తనలోని భావాన్ని ఇలా తల్లిదండ్రులకు తెలియజేసింది.

"నేను శ్రీరంగనాథుణ్ణే పరిణయమాడుతాను. మానవమాత్రులెవ్వరినీ వివాహంచేసుకోనన్నది." అదివిని ఆశ్చర్యపోయారు రాజదంపతులు. విస్మయాన్ని పొందారు. "ఇదేమి విచిత్రం? దేవదేవుడైన శ్రీరంగనాథుణ్ణి పరిణయ మాడడమా? ఇదెలా జరుగుతుంది? ఇది సంభవమా? అని. తన పుత్రికకు ఇటువంటిభావన ఎలా కలిగిందని లోలోపల మథనపడ్డారు. వాస్తవంగా ఒకానొకసందర్భంగా కమలవనంలో తన చెలికత్తెలతో కమలవల్లి విహరిస్తున్నపుడు శ్రీరంగనాథుడు అశ్వారూఢుడై ఆ కమలవల్లి కనులకు కనిపించి ఆకర్షింపచేసిన వృత్తాంతాన్ని మనం ఇక్కడ స్మరించుకోవాలి.

రాజదంపతులు ఇలా మథనపడుచుండగా ఆ రోజు రాత్రి కలలో నందచోళునితో శ్రీరంగనాథుడు మీ దంపతుల సంతోషార్థం మహాలక్ష్మిని మీ పుత్రికగా అవతరింపచేయడం జరిగింది. కనుక ఇవన్నియూ నా సంకల్పములే కనుక నిర్భయంగా, నిస్సంశయంగా, ససంతోషంగా కమలవల్లిని నీవు పంపించగలవని నియమించాడు. నందచోళదంపతులు కమలవల్లిని కన్యాదానం చెయ్యడానికి సిద్ధమైనారు. కమలవల్లిని సర్వాలంకారభూషితురాలుగా చేసి, ఉఱైయూర్ గ్రామప్రజలతో, తన సమస్తపరివారములతో శ్రీరంగానికి వెళ్లారు. శ్రీరంగనాథుని సన్నిధిలో కమలవల్లి కమలహస్తభూషితురాలై గర్భాలయానికి వెళ్లి, ఒక దీపమై శ్రీరంగనాథునిహృదయంలో ఐక్యమైంది.



ఇలా కమలవల్లి శ్రీరంగనాథులవివాహం అత్యంత వైభవోపేతంగా జరిగింది. తదుపరి నందచోళుడు తన రాజధాని యైన ఉఱైయూరుకి వచ్చి తన పుత్రికయైన కమలవల్లికిని, తన అల్లుడైన శ్రీరంగనాథునికిని "అళగియమణవాళన్" అనే పేరుతో ప్రత్యేకమైన ఆలయాన్ని కట్టించి ప్రతినిత్యం ఆరాధనలు జరిగేటట్లు కట్టడి చేశాడు. సంతతి లేక తన సర్వస్వాన్ని శ్రీరంగనాథునికే సమర్పించాడు.

## మరికొన్ని విశేషాలు...

**01)** శ్రీరంగనాథుని పాదపద్మములయందు తన సర్వస్వాన్ని సమర్పించిన "పన్నిద్దరు ఆళ్వారులలో ఒకరైన" తిరుప్పాణాళ్వారుల అవతారస్థలం ఈ ఉఱైయూరు.

**02)** నందచోళపుత్రికగా లక్ష్మీదేవి అవతరించి వాసలక్ష్మి అనే పేరుతో శ్రీరంగనాథుణ్ణి వివాహమాడినసందర్భంగా మీన మాసంలో శ్రీరంగనాథునికి జరుగుబ్రహ్మోత్సవంలో మూడవ నాడు శ్రీరంగనాథుడు ఉఱైయూరుకు వేంచేసి కమలవల్లి నాచ్చియార్‌తో ఏకాసనాసీనుడై భక్తలోకాన్ని అనుగ్రహిస్తాడు.

**03)** ఈ క్షేత్రం తిరుచ్చినుండి దాదాపు 2కిలోమీటర్లదూరంలో ఉంది.

### 2022, ఏప్రిల్ నెల ఉత్సవాలు, పర్వదినాలు

| | |
|---|---|
| 02 | శ్రీ శుభకృత్‌నామ సంవత్సర 'ఉగాది' |
| 03 | మత్స్యజయంతి |
| 06-14 | వాయల్పాడు, శ్రీపట్టాభిరామస్వామి బ్రహ్మోత్సవం |
| 10-18 | ఒంటిమిట్ట, శ్రీకోదండరామస్వామి బ్రహ్మోత్సవం |
| 10 | శ్రీరామనవమి |
| 14 | తమిళసంవత్సరాది, అంబేద్కర్ జయంతి |
| 14-16 | తిరుమల శ్రీవారి వసంతోత్సవం |
| 16-24 | నాగులాపురం శ్రీవేదనారాయణస్వామి బ్రహ్మోత్సవం |

**04)** తిరుమంగైఆళ్వారులు మాత్రమే ఈ దివ్యదేశాన్ని కీర్తించారు. పెరియతిరుమొళి అనే ప్రబంధంలో 9-2-5వ పాశురంలో **"కోళియుం కూడలుం కోయిల్‌కొండ"** అనే పాశురంలో ఈ క్షేత్రాన్ని "కోళి" అనే కీర్తించారు. దీనికి కూడ ఒక ఐతిహ్యముంది.

**"మూలవర్లు"**-అళగియమణవాళన్-ఉత్తరముఖం-నిలుచున్నభంగిమ- చతుర్భుజాలతో విరాజిల్లువాడు- సుదర్శన చక్రం ప్రయోగచక్రంగా భాసిల్లడం చాలా విశేషం. ఉత్సవ విగ్రహం ఇక్కడ లేదు. కారణం సాక్షాత్తు శ్రీరంగనాథుడు నమ్బెరుమాళ్ళే ఇక్కడ ఉత్సవవిగ్రహం.

**అమ్మవారు**-వాసలక్ష్మి, ఉఱైయూర్‌వల్లినాచ్చియార్, కల్యాణపుష్కరిణి, కల్యాణవిమానం, కుడమురుట్టినది.

ముప్పదిమూడుకోట్లదేవతలకు ధర్మవర్మాదులకు ప్రత్యక్షం. ఆశ్లేషనక్షత్రంలో జన్మించిన కన్యలకు అపవాదాన్ని పోగొట్టి వాళ్లకి కల్యాణాన్ని జరిపించడం ఈ గుడి ప్రత్యేకత. వివాహం కానటువంటి కన్యలు ఈ క్షేత్రానికి వచ్చి అమ్మవారికి మొక్కుకుంటే వెంటనే వివాహమవుతుందని అనుభవజ్ఞులమాట.

## ఎలా వెళ్లడం..

తిరుచ్చినుండి, శ్రీరంగంనుండి- ఎన్నో టౌన్‌బస్సులు, షేర్‌ఆటోలు ఉన్నాయి. ఉదయం 6.30 నుండి మధ్యాహ్నం 12.00 వరకు, తదుపరి సాయంకాలం 5.00నుండి 8.00వరకు ఆలయం తెరచి ఉంటుంది.

మహాత్ములు రచించిన ధ్యానశ్లోకాలను మనం పఠిద్దాం.

నిత్యం శ్రీనిచులాపురీశమనిశం కల్యాణతీర్థాంతికే
ప్రోద్యత్ సూర్యవరప్రదాన సుముఖం కల్యాణ వైమానికం।
వందేభక్తజనైక రక్షణభరం తం రమ్యజామాతరం
వందే వాంఛిత దానకల్పలతికాం దేవీం నివాసశ్రియమ్॥

శుభే కల్యాణాఖ్యాప్రథిత వర తీర్థేషు నిచుళా
పురే పారే రమ్యే శుభకుడమురుట్టాఖ్య సరితః।
విమానే కల్యాణే ధనపతి దిశావక్త్ర రుచిరః
స్థితో భాతి శ్రీమాన్ వరవ రసమాఖ్యో మధురిపుః॥

త్రయస్త్రింశద్ కోటి రవి ధర్మాది గోచరః।
కలిధ్వంసి మునిస్తుత్యో వాసలక్ష్మీ సమన్వితః॥

శ్రీవేంకటేశ్వరలీలలు



# నేనేమివ్వగలను స్వామీ!

-శ్రీ సి. హెచ్. ఎల్. వి. సత్యనారాయణరావు, 98660 85351

మా ఊరు మచిలీపట్నం కృష్ణాజిల్లా. స్వామివారి అనుగ్రహంతో మా రెండవ కుమార్తె వివాహం నిశ్చయమైంది. వివాహసమయంలో వివాహవేదికపై స్వామి చిత్రపటాన్ని పెట్టి వివాహం జరిపిస్తామని అనుకున్నాం. వివాహ శుభలేఖను స్వామివారికి తిరుమలకు పోస్టులో పంపినాం. పెళ్ళిఏర్పాట్లు జరుగుతున్నాయి.

ఇంతలో ఒకవ్యక్తి పెద్దపార్శిల్ తీసుకొని హడావిడిగా వివాహవేదికవద్దకు వచ్చాడు. ఆయన ఆ పార్శిల్ అక్కడే విప్పదీసి ఒక పెద్ద (లామినేటెడ్) ఫోటోఫ్రేమును తీసుకొని నా వద్దకు వచ్చి ఈ ఫోటోని వేదికమీద ఉంచాలని చెప్పాడు. ఏమి ఫోటోయో అని చూసేటప్పటికి ఇంకేముంది శ్రీకల్యాణ వేంకటేశ్వరుడు ఉభయదేవేరులతో మందస్మితవదనుడై దేదీప్యమానంగా ప్రకాశిస్తూ దర్శనమిచ్చాడు.


నాకు వెంటనే నేను అనుకున్న విషయం స్ఫురణకు వచ్చింది. వివాహవేదికపై స్వామివారి చిత్రపటం పెట్టి వివాహం జరిపిస్తానని స్వామివారికి చేసిన వాగ్దానం నాకు వెంటనే జ్ఞాపకం వచ్చి నేను పెళ్ళిసందడిలో ఆ విషయం మర్చిపోయినందుకు నన్ను నేనే నిందించుకొన్నాను. స్వామివారిని క్షమాపణ వేడుకొన్నాను. స్వామివారి చిత్రపటాన్ని వేదికపై ఉన్నతాసనముపై ఉంచి పూమాల సమర్పించి, అగరువత్తుల దూపము నొసంగి, ఫలనైవేద్యమొసంగి, వినమ్రుడనై మనస్సులోనే వేయి విధాల స్వామివారిని స్తుతించాను.

ఇంకొక విశేషమేమంటే స్వామివారికి అలంకరించిన పూమాల కొద్దిసేపటిముందే ఎవరో తీసుకువచ్చి మా బంధువులచేతికిచ్చి వెళ్ళారట. ఆ రాత్రిసమయంలో ఆశ్చర్యంగా ఆ పూలమాలను తీసుకువచ్చి ఇచ్చినవారు ఎవరో తెలియదు. ఇది అంతయు స్వామివారిలీలకాక మరి ఏమి?

వివాహానికి ముందు వరుని ఊరేగింపు సమయంలో ఆకాశం మేఘావృతమై వర్షం కురవటం ఆరంభమైంది. ఏ విఘ్నం లేకుండా వరుని ఊరేగింపు, అమ్మాయి వివాహం జరిపించాల్సిందిగా స్వామివారిని ప్రార్థించాను. భక్తిపూర్వకంగా రూ.116/-లు తిరుమల శ్రీవారిహుండీకి పంపుతానని మొక్కుకున్నాను. "ఆశ్చర్యంగా వాన నిలిచిపోయింది. ఏ విధమైన ఆటంకం లేకుండా వివాహం జరిగింది. ఆనందంగా స్వామివారి మ్రొక్కుబడిని మరునాటి ఉదయమే మనియార్డరుద్వారా తిరుమలకు పంపాను.

ఈవిధంగా ఆద్యంతం స్వామివారు భారం వహించి మా అమ్మాయివివాహం జరిపించారు. ఆ సప్తగిరీశుడైన శ్రీనివాసునికి నేను ఏమివ్వగలను? అమ్మాయికి, అల్లుడికి తిరుమలలో స్వామివారిదర్శనం చేయించి స్వామికల్యాణం జరిపించాను. నా జీవితంలో ఒక ముఖ్యమైన బాధ్యతను ఈ విధంగా స్వామివారి అనుగ్రహంతో నెరవేర్చగలిగాను.

ఓం నమో వేంకటేశాయ!!





ధారావాహిక

హరిదాస వాఙ్మయంలో...

# శ్రీవేంకటాచలాధీశుడు

- శ్రీ సుస్వరం నాగరాజాచార్యులు

*గత సంచిక తరువాయి భాగం...*

అంత శ్రీవిజయదాసులవారు స్వామివారి అనుగ్రహాదేశానుసారం వెంటనే తిరుమలక్షేత్రమునకు పయనమై ఆకొండ సౌందర్యమును ఆ కొండలరాయణ్ణి దర్శించిన విధానమును సుదీర్ఘమైన కీర్తనలో సుళాదులలో వర్ణించినారు. తెలుగులో తిరుమలకొండను చూచి అన్నమయ్య 'అదివో అల్లదివో శ్రీహరి వాసము' అని ఉత్సాహముతో పాడినట్లు వీరును 'చూచితిని నేను చూచితిని' అని భక్త్యుత్సాహముతో ఆలయమును, ఆలయములోని శ్రీనివాసుని సౌందర్య వైభవములను క్రమంగా ఇట్లు వర్ణించినారు.

"నోడిదె నానోడిదె
మూడలగిరియవాసన యాత్రెయ మాడిదె నా మాడిదె"

(చూచితిని నేను చూచితిని పూర్వాభిముఖముగా నిలబడిన శ్రీనివాసుని దివ్య సన్నిధానమును చేరితిని).

"బెట్టవ కండెను సోపానంగళు । నిట్టు సురిక్కదె ఏరిదె ।
కట్ట కడియణగోపుర శిఖర । దిట్టిసి కణ్ణిలి నోడిదె ॥

(మొదటకొండను చూచితిని. ఆ తర్వాత సోపానములను (మెట్లను) చూచి తదేకధ్యానముతో ఎక్కితిని. అంత గాలి గోపురమును చూచితిని. అక్కడికి చేరితిని).

ఈ సమస్తర గురువాద భారతీశన పాదక్కెరగిదె ।
క్లేశవకళెదు ఎదురాగి పొళెవ । శ్రీశనగుడి మహద్వారవనోడిదె ॥

(అంత తిరుమల చేరుకొని బేడిఆంజనేయుని పాదములకు నమస్కరించి వెనుతిరిగి చూడగా చూపుమాత్రముచేతనే అంతరంగతాపములు చల్లార్చే శ్రీశుని గుడి మహాద్వారమును చూచితిని).

బలవాగి బందు స్వామి పుష్కరిణి । ఒళగె వరహననోడిదె।
జలదలి మిందు వేగదలి । తిరువేంగళ దేవన నోడసాగిదె॥

(అంత శ్రీవారి దేవాలయమును సమీపించి ప్రక్కనే యున్న స్వామిపుష్కరిణిని అందులోనున్న వరాహస్వామిని చూచి, ఆస్వామి పుష్కరిణిలో స్నానమును చేసి ఉత్సాహముతోను భక్తితోను వేగముగా తిరువేంకటేశ్వరుని చూడసాగితిని).

గుడియపొక్కెను గరుడ గంభద సదగరవను నానోడిదె ।
ఒడనె ప్రాణాచారదవరు పడెద వరగళకేళిదె ॥

(గుడిలో ప్రవేశించితిని. గరుడగంభమును చూచితిని. అక్కడ అర్తులైన భక్తులు నిరాశ నిస్పృహలతో జీవితములో అనేక కష్టనష్టములను జన్మాంతర పాపములచే అనుభోగించి ఇక తాళలేక స్వామి నీవేగతి నీవనుగ్రహించేంతవరకు లేవము అని ప్రాణచారమును ఒప్పించి సాష్టాంగనమస్కారమును చేస్తున్న భక్తులను వారిని దేవుడు అనుగ్రహించిన దానిని చూచితిని).

మున్న అవసరమని యోళగే । అన్నపూర్ణెయనోడిదె ।
చెన్నాగి మంట పదోళు శ్రీనివా-సన్న మూరుతియనోడిదె ॥

(అంతలోనికి వెళ్ళగా శ్రీవారి వంటశాల. అక్కడున్న అన్నపూర్ణను (వకుళాదేవి), తర్వాత విమానమందున్న శ్రీనివాస మూర్తిని చూచితిని).

తొట్టల తీర్థవ కొండు ప్రసాదవ । ఇట్టు మారువుదు
నోడిదె ఇష్ట భక్తరు సమ్ముఖదల్లి । ముట్టి పాడువుదు నోడిదె॥

(స్వామివారి తీర్థమును తీసుకొని అక్కడే ప్రసాద వితరణము జరుగుటను చూచితిని. స్వామిభక్తులు దేవుని సమ్ముఖమందు భక్తితో స్తుతించడమును చూచితిని).

ద్వార పాలకరిగె సాష్టాంగదలి నమ-స్కారవను మాడిదె ।
భోరనె కటాంజనద ఫల్గుణి బం-గార బాగిలవనోడిదె ॥

(అంత ద్వారపాలకులకు (స్వామి గుడికి ఇరువైపుల ఉన్న) వారిద్దరికి సాష్టాంగ నమస్కారమును చేసి ఆపై స్వామి వారి బంగారువాకిలిని చూచితిని).



కోపాన్ని కోపగించు, లేకపోతే అది నిన్ను ముంచుతుంది

ఇందు రవి శత కోటి తేజద- ఇందిరేశన పాదార -
వింద యుగ్మవ పుళికోత్సహ- దింద సందరు శన నామాడిదె॥

(అంత శతకోటి చంద్రసూర్యులతేజస్సుతో ప్రకాశించే ఇందిరేశుడైన శ్రీవేంకటేశ్వరుని పాదారవిందమును చూచి పులకించి ఉత్సాహముతో దర్శనము చేసుకొంటిని)

శ్రీవిజయదాసులవారు వ్యాజనిందాస్తుతితో శ్రీనివాసుని స్వభావమును వర్ణిస్తూ మంగళగీతమును పాడినారు. (స్నేహో భక్తిరితిఃప్రోక్తః)

జయ మంగళం నిత్యశుభమంగళం
తొళసదక్కియతింబ కిలుబుతళిగె యలుంబ
కోళగదలి హణగళ అళెదుకొంబ
ఇల్లకాసు ఎందు సుళ్ళు మాతాడిదరె
ఎల్లవన్ను కసకొంబకళ్ళ ధొరెగె॥

దంపుడుబియ్యమును నైవేద్యముగా ఇత్తడిపళ్ళెములలో (పాత్రలలో) గ్రహించువానికి, హుండినుండి డబ్బులు తీసుకొనే వానికి, లేదు నావద్ద కాసుకూడా అనేవాని సర్వస్వమును లాక్కొనేవానికి జయమంగళము శుభమంగళము.

తన్ననోడువేనెందు మున్నూరుగావుదబందు
తన్నగుడియపొక్క జనరిగెల్ల
న్నహణగళ కొండు తన్న దరుశన కొడదె
బెన్నహరియ యిసువ అన్యాయకారిగె॥

తన దర్శనముకొరకు మూడువందలమైళ్ళదూరము నుండి వచ్చి గుడిలో ప్రవేశించిన జనులనుండి బంగారమును, ధనమును తీసుకొని సరిగా తన దర్శనమును కల్గించక తరిమేవానికి జయమంగళం నిత్యశుభమంగళం.

గిద్దహారవనాగి శరగొడ్డి దానవ బేడి
దుడ్డు కాసుగళిగె కయ్యనీడి।
అడ్డబిద్దజనర విద్దూరగళ కళెదు
దొడ్డవరమాళ్ప సిరి సిరి విజయవిఠలగె॥

నాడు వామనుడై దానమడిగి నేడు దుడ్డుకాసులకు చేతిని చూపించేవాడవు. నీముందు సాష్టాంగనమస్కారమును చేసేవారికి ఆపదలను పారద్రోలి వారిని శ్రేష్ఠులుగా చేసే సిరి విజయ విఠలునికి మంగళము.

సుళాదిదాసులైన శ్రీవిజయదాసులవారి సాహిత్యము అపారమైనది. *(అయిపోయింది)*

## తరిగొండ వెంగమాంబ నృసింహస్తుతి

శ్లో॥ శ్రీకాంతాత్మ సరోజ చండ కిరణం
శీతాంశు బింబాననం
శ్రీకంఠాబ్జజ సన్నుతాంఘ్రికమలం
చిన్మాత్ర, మప్రాకృతమ్
లోకాతీత, మనేక గోపయువతీ
లోలం, పరం, సర్వగం
స్వాకారం తరిగొండ శేషకుధరా

శ్రీమహాలక్ష్మియొక్క మనస్సనే పద్మాన్ని వికసింపజేసే సూర్యుడు, చంద్రబింబంవంటి ఆహ్లాదకరమైన ముఖం కలవాడు పరమశివునిచే, బ్రహ్మదేవునిచే స్తుతింపబడిన చరణకమలాలు కలవాడు, జ్ఞానస్వరూపుడు, లోకాలన్నిటికి అతీతుడూ, అనేక గోపయువతులఎడల అనురాగం కలవాడు, అంతటా వ్యాపించిఉండే సత్యస్వరూపుడు, దేవాదిదేవుడు, పరంధాముడు అయిన తరిగొండ లక్ష్మీనరసింహుడు అయిన శేషాచలాధిపతి అయిన వేంకటేశ్వరుణ్ణి నిత్యం భక్తితో ఆరాధిస్తున్నాను అని వెంగమాంబ స్తుతించింది.



– డా॥ సంగీతం కేశవులు, *91821 90640*

# ఓర్పు! నేర్పు!! తీర్పు!!!

# త్రిరత్నాలు

– శ్రీ చాకిచెర్ల నాగసుదర్శన్‌రావు,
97013 85006

ఈ మానవజీవితం ఎల్లప్పుడూ సుఖసంతోషాలతో శాంతిమయంగా ఉండాలంటే మనవద్ద మూడురత్నాలు ఉండాలి. అవి ఓర్పు, నేర్పు, తీర్పు. అందులో మొదటిరత్నం ఓర్పు.

ఈ మహోన్నతమైన గుణసంపదకి వారసుడు పాండవాగ్రజుడైన ధర్మరాజు! పంచమవేదమైన మహాభారతాన్ని పరిశీలిస్తే అందులో ధర్మరాజు ధర్మతరువువంటివాడని శ్రీకృష్ణుని చేత కీర్తింపబడ్డాడు. ఏకాగ్రచిత్తంతో ధ్యానించి, తపించి, యమ, సూర్య, అగ్ని, ఇంద్రాదిదేవతల అనుగ్రహానికి పాత్రుడైన ఉత్తమ సహనశీలి ధర్మరాజు! తన ఓర్పుతో భూతలంమీదున్న రాజులందరిచేత మన్ననలను అందుకున్న ధర్మరాజు మూర్తీభవించిన శాంతమూర్తి! ఆయనలో ఉన్న ఓర్పు అనే రత్నంవల్లనే "ధర్మజో విగ్రహవాన్ ధర్మః" అని అందరిచేత కీర్తింపబడ్డాడు.

మహాభారతంలో ప్రతినాయకుడైన దుర్యోధనుడు అధర్మానికి, అసూయకి మారుపేరు. దుర్యోధనుడు రోషవృక్షమైతే, దానికి కర్ణుడు చేవగల స్కంధం, శకుని కుతంత్రాలు ఆ చెట్టు కొమ్మలు. పాండవులను లక్కఇంట చేర్చి ఆ ఇంటికి చిచ్చుపెట్టి వారిని సమూలంగా నిర్మూలించాలనే వ్యూహాన్ని పన్నాడు. అంతేకాకుండా మాయాజూదం, అనుద్యూతాలన్నింటిని అనుమతించి కపటనాటకాన్ని ఆడిన రెండునాలుకల విషవృక్షమూలమే ధృతరాష్ట్రుడు.

ఈ దుర్మార్గాలన్నింటిని తన ఓర్పు, సహనంతో అధిగమించాడు దైవానుగ్రహంతో ధర్మరాజు! రాజసూయయాగం ఉత్తమపూజతో ముగించాలి కాబట్టి, అట్టిపూజకు పరంధాముడైన శ్రీకృష్ణుడే అర్హుడని భీష్ముని ఉపదేశంతో గ్రహించి, అగ్రతాంబూలాన్ని అందుకోమని ఆ పరమాత్మ అయిన శ్రీకృష్ణుణ్ణి వేడుకున్నాడు ధర్మరాజు. శిశుపాలుడు, శ్రీకృష్ణుడు పూజకి అర్హుడు కాదని వాదించి సభని వీడి వెళ్లిపోయాడు. ధర్మనందనుడు తన ఓర్పు, సభ్యత ప్రకటిస్తూ శిశుపాలునివెంట వెళ్ళి తన ప్రియవచనాలతో అతణ్ణి అనునయించాడు. సమయోచిత వాక్చతురత కలిగిన ప్రజ్ఞాశీలి ధర్మజుడు. అచ్యుతునితత్త్వాన్ని నిరూపించటానికి పరమార్థప్రతిభ కావాలని అది భీష్మునికి ఉన్నట్లుగా శిశుపాలునికి లేదని, పెద్దలచరిత్ర అల్పులు గ్రహించలేరని ధర్మరాజు అమితఓర్పుతో వాదించి అచ్యుతుడే ఈ రాజసూయాగ అగ్రతాంబూలానికి అర్హుడని సమర్థిస్తూ శిశుపాలుని వ్యక్తిత్వస్వభావంలోనే దోషం ఉన్నదని ప్రకటించాడు. ధర్మరాజు ఎంతో ఓర్పుతో, భీష్మపితామహుని సలహాలతో చేసిన ప్రతిపాదనలు శిశుపాలుని మూర్ఖపు



వాదనలను నిర్వీర్యం చేయటమేకాక భగవంతుణ్ణి నిందించిన శిశుపాలునివధకుకూడా దారితీశాయి! ఈ సంఘటన ధర్మరాజు సహనశీలతకు ఒక మచ్చుతునక.

అంతేకాదు, శకుని, దుర్యోధనాదుల కపటజూదంలో వంచితుడై తన రాజ్యలక్ష్మి సర్వస్వాన్ని కోల్పోయినప్పటికి ఓర్పుతో ధర్మాన్ని వీడకుండా వాసుదేవుని అనుగ్రహంతో శత్రువు లందరిని జయించాడు. కాని తన సొంతబంధువులు, గురువులు, అనేకమంది సైనికులు యుద్ధంలో మరణించగా సన్నిధానమైన రాజ్యాన్ని స్వీకరించటానికి కలతచెంది దిగులుతో విముఖు డయ్యాడు.

ఆ సమయంలో ఉత్తరాయణపుణ్యకాలంకోసం ఎదురు చూస్తూ అంపశయ్యమీదున్న మహావీరుడైన "స్వచ్ఛందమరణం" వరం పొందిన భీష్మపితామహునివద్దకు వెళ్లి ఎన్నో ధర్మ సందేహాలు అడిగాడు.



రాజ్యం చేపట్టటానికి తన విముఖత, తను పడుతున్న నిర్వేదాన్ని తెలిపాడు. అప్పుడు ఆ గాంగేయుడు చేసిన ధర్మనీతి బోధలు విన్న తర్వాత శాంతపడ్డాడు.

ఆ మహాత్ముని నీతిబోధల్లో ఒక ముఖ్యమైన సందేశం ఏమిటంటే "కురుక్షేత్రయుద్ధంలో బంధువులు, మిత్రులు, గురువులు మరణించటానికి కారణం వారి కర్మలేకానీ నీవుకాని, దుర్యోధనుడుకాని కాదు. నువ్వు నిమిత్తమాత్రుడివి మాత్రమే అని చెప్పాడు.

మన ధర్మప్రవర్తన, మన మంచితనం మాత్రమే మనకు తోడుగా ఉంటాయి అని భీష్మపితామహునిసందేశం తెలుపు తుంది. మహర్షులు ఆ పరంధాముని కొనియాడిన శ్రీవిష్ణు సహస్రనామాన్ని ధర్మరాజుద్వారా మనకు తెలియచెప్పిన మహా జ్ఞాని భీష్మాచార్యులవారు!

ఆ మహాత్ముని ధర్మబోధనలు విన్నతర్వాత వ్యాసుడు తన పెదతండ్రిగారు మొదలైనవారి ఆశీస్సులతో శ్రీకృష్ణాను గ్రహంతో కురుసామ్రాజ్యానికి పట్టాభిషిక్తుడయ్యాడు **ఓర్పుకి మారుపేరైన ధర్మమూర్తి ధర్మరాజు.**

**మనమందరంకూడా ఆ ధర్మజుని అడుగుజాడల్లో నడుద్దాం. ఓరిమితో ఈ సంసారజీవితంలో వచ్చే అన్ని అవరోధాలను ధర్మపరంగా ఎదుర్కొని విజయాలను సాధించి కృతకృత్యులమవుదాం!**

**అలానే మనవద్ద ఉండాల్సిన మరోరత్నం నేర్పు. మహాభారతంలో అర్జునుడు సంపూర్ణవ్యక్తిత్వం కలవాడు. మన నిత్యజీవితంలో నేర్పుగా వ్యవహరించటం ఎంతో అవసరం. నేర్పు, సామర్థ్యం కలవాడే రాణిస్తాడు ఈ లోకంలో!**

**ఉదాహరణకి- మహాభారతంలో అర్జునుడియొక్క నేర్పును, బుద్ధికుశలతను గురించి మనమిప్పుడు తెలుసు కుందాం.**

ధర్మరాజు దుర్యోధనుడు, శకుని ఆడిన అధర్మజూదంలో రాజ్యాన్ని పోగొట్టుకున్నాడు. తనవల్ల సోదరులు, భార్యబంధు వర్గం అనుభవిస్తున్న దురవస్థను చూసి మిక్కిలి చింతాక్రాంతు డయ్యాడు. ఆసమయంలో వేదవ్యాసుడు ధర్మజునివద్దకు వచ్చి "ప్రతిస్మృతి" అనే విద్యని బోధించి దానిని అర్జునుడికి ఇవ్వమని చెప్పాడు. ఆ విద్యద్వారా అర్జునుడు తపోయశస్సువైభవంతో దేవతలనుంచి మహాస్త్రాలను పొందగలడని, అప్పుడు శత్రువు లను సులభంగా జయించవచ్చు అని చెప్పి వెళ్లాడు.

ధర్మరాజు సరస్వతీనదీతీరంలో అర్జునుడికి ప్రతిస్మృతి విద్యని బోధించాడు. దాంతో అతడు మంచి తేజోవంతుడై తన అనుగ్రహదేవతైన ఇంద్రునిఆనతితో ఇంద్రకీలపర్వతంమీద తిష్ఠవేసి ఈశ్వరునివద్ద పాశుపతాస్త్రాన్ని పొందటానికి కఠోర తపస్సు చేశాడు.

పార్థునితపస్సుకు మెచ్చి ఆ పరమేశ్వరుడు పార్వతీ సమేతుడై తన ప్రమథగణాలతో అర్జునుడిపరాక్రమాన్ని పరీ

క్షించటానికి కిరాతవేషధారులై వచ్చారు. తన మాయచేత సృష్టించపడ్డ మూకుడనే అడవిపందిని అర్జునుడిమీదకు వదిలాడు. అప్పుడు పార్థుడు మరియు శివుడు ఇద్దరు వేసిన బాణాలకు ఆ అడవిపంది మరణించింది.

ఇద్దరు దానిని నేను చంపానంటే నేను చంపానని వాదంపెంచుకుని యుద్ధం చేశారు. ఆ యుద్ధంలో కిరాతుడు వేసిన బాణాలధాటికి అర్జునుడిబాణాలు నిర్వీర్యమైపోయాయి. ముష్టియుద్ధంలోకూడా అర్జునుడు ఓడిపోయాడు. అప్పుడు ఆ వచ్చినవాడు సాక్షాత్ ఆ పరమేశ్వరుడే అని నేర్పుగా గ్రహించి ప్రార్థించాడు.



అప్పుడు శివుడు అనుగ్రహించి నిజస్వరూపుడై అర్జునునికి పాశుపతాస్త్రాన్ని ఇచ్చి, దాంతో సమస్తలోకాల్ని జయించ గలవని దీవించి అంతర్ధానమయ్యాడు!

కురుక్షేత్రసంగ్రామంలో సాక్షాత్ ఆ శ్రీకృష్ణపరమాత్మే సారథికాగా మహావీరులైన శత్రువులను సంహరించి విజయుడయ్యాడు, అన్నల మన్ననలను పొందాడు. అందుకే అర్జునుడి నేర్పును, ధైర్యసాహసాలను ఈ పేర్లతో స్మరిస్తారు– అవి అర్జున, ఫల్గుణ, పార్థ, కిరీటి, శ్వేత వాహన, బీభత్సా, విజయ, క్రిష్ణ, సవ్యసాచి, ధనంజయా అనే ఈ నామాలను స్మరించినంతమాత్రంచేత భయంకర మైన పిడుగులవంటి భయాలుకూడా తొలగిపోతాయి.

**మనంకూడా మన నిత్యజీవితంలో మహావీరుడైన అర్జునుడివంటి నేర్పును, ధైర్యసాహసాలను అలవర్చుకుని విజయాలను సాధిద్దాం.**

**మన జీవితాంతం దాచుకోవాల్సిన మూడోరత్నం తీర్పు. ఇది జ్ఞానంతో కూడుకున్నది. ధర్మానికి ముడి వేయబడినది.**

**దీనిని ఆ శ్రీకృష్ణపరమాత్మే కురుక్షేత్రసంగ్రామంలో యుద్ధం చేయాల్సిన తనవారందర్ని చూసి యుద్ధ విముఖుడైన అర్జునుడిద్వారా మనకు బోధించిన శాస్త్రమే గీతాశాస్త్రం. ఇది నాలుగువేదాల సారాంశమైన కర్మ యోగం, జ్ఞానయోగం, భక్తియోగం, మోక్షయోగముల సంహిత.**


## STATEMENT ABOUT OWNERSHIP AND OTHER PARTICULARS ABOUT

## SAPTHAGIRI

**(MONTHLY)**
**FORM IV**
**See Rule 8**

| | | |
|---|---|---|
| 1. | Place of Publication | : TIRUPATI |
| 2. | Periodicity of its Publication | : Monthly |
| 3. | Printer's Name | : Sri P.Ramaraju, M.A., |
| | Whether citizen of India | : Yes |
| | Address | : Special Officer, TTD Press Compound K.T.Road, Tirupati. |
| 4. | Publisher's Name | : Dr.K.Radha Ramana, M.A.,M.Phil., Ph.D. |
| | Whether citizen of India | : Yes |
| | Address | : Chief Editor Office, TTD Press Compound, K.T.Road, Tirupati. |
| 5. | Editor's Name | : Dr. V.G.Chokkalingam, M.A., Ph.D. |
| | Whether citizen of India | : Yes |
| | Address | : Chief Editor Office, TTD Press Compound, K.T.Road, Tirupati. |
| 6. | Name and address of individuals who own the Newspaper and partners or shareholders holding more than one percent of the Total Capital | Tirumala Tirupati Devasthanams |

I, **K. Radha Ramana**, hereby declare that the particulars given above are true to the best of my knowledge and belief.

TIRUPATI,
Date : 28-2-2022.

**(Sd.) Dr. K. Radha Ramana,**
Signature of the Publisher

పరిత్రాణాయ సాధూనాం వినాశాయ చ దుష్కృతాం
ధర్మ-సంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే



ఈ గీతాసారాంశమంతా ధర్మబోధ. అన్నివేళలా ధర్మమే గెలుస్తుంది అని నొక్కి వక్కాణించాడు పరమాత్మ. ధర్మానికి కావల్సింది జ్ఞానం, విచక్షణ. దాన్నికూడా నేర్పాడు ఈ మానవాళికి తన గీతాశాస్త్రంద్వారా. వేద వాక్కులైన సత్యం వద, ధర్మం చర అనేవి ఎంత గొప్పవో, పాండవులవిజయం ద్వారా నిరూపించాడు ఆ పరమాత్మ!

ధర్మమే గెలిచి తీరుతుంది. అధర్మం తాత్కాలికంగా గెలిచినట్లు కనపడే మిథ్య మాత్రమే అని బోధించాడు. ధర్మరక్షణలో తాను ఆడినమాటనుకూడా తప్పాడు. ఆయుధాన్ని పట్టను అని శపథం చేసిన పరమాత్మ, భీష్ముని బాణపరంపరలో రక్తసిక్తమవుతున్న అర్జునుణ్ణి చూసి చలించి, ధర్మపరులైన పాండవులు ఓడిపోతే ధర్మానికి గ్లాని సంభవిస్తుందని భయంతో, బాధతో తాను ఆడిన మాటనుకూడా పక్కనపెట్టి భీష్మునిపై చక్రాయుధంతో యుద్ధానికి రథంపైనుంచి దుమికాడు. భీష్ముడు తన తప్పు తెలుసుకుని ఆ పరమాత్మని శరణు కోరాడు.

తన మరణరహస్యాన్ని ధర్మపరుడైన ధర్మరాజుకు తెలిపి పాండవులవిజయానికి దోహదపడి ఉత్తరాయణపుణ్యకాలం వచ్చేవరకు అంపశయ్యమీద ఉండి, ఎన్నో ధర్మబోధలతో రాజ్యకాంక్షలో విముఖుడైన యుధిష్ఠిరుని శాంతపరచి పట్టాభిషిక్తుడవై ధర్మపథంగా ఆ కృష్ణపరమాత్మ చెప్పినవిధంగా రాజ్యాన్ని ఏలుకోమని తెలియచేసిన జ్ఞాని, త్యాగమూర్తి భీష్మపితామహుడు!

ఆ పరంధాముడు గీతాశాస్త్రంలో నుడివిన ధర్మోరక్షతి రక్షితః సారాంశాన్ని గ్రహించి మనమందరం ధర్మమార్గంలోనే నడుద్దాం. ఆ పరమాత్ముని కటాక్షానికి పాత్రులమవుదాం!

## భక్తులకు విజ్ఞప్తి



కొవిడ్-19 మూడవవేవ్ 'ఒమిక్రాన్' రూపంలో దేశవ్యాప్తంగా విస్తరిస్తున్న నేపథ్యంలో తిరుమల శ్రీనివాసుని దర్శనార్థం వచ్చే భక్తులకు ఇవి తప్పనిసరి!!

- కొవిడ్ వ్యాక్సినేషన్ సర్టిఫికెట్ (లేదా)
- 48 గంటలకు ముందు చేయించుకున్న ఆర్.టి.పి.సి.ఆర్. పరీక్ష నెగటివ్ సర్టిఫికెట్
- అలిపిరి చెక్‌పాయింట్‌లో ఖచ్చితంగా ఇవి చూపిస్తేనే తిరుమలక్షేత్ర సందర్శనార్థం సెక్యూరిటీవారు అనుమతిస్తారు.
- తిరుమల తిరుపతి దేవస్థానమునకు సంబంధించిన ఇతర ఆలయాల్లో కూడా ఈ కొవిడ్ నిబంధనలు భక్తులు తప్పనిసరిగా పాటించాలి.
- భక్తులు విజిలెన్స్ మరియు సెక్యూరిటీవారికి సహకరించాలి.
- ప్రశాంతమైనమనస్సుతో స్వామివారిని దర్శించండి.





# ఇద్దరూ.. ఇద్దరే!!



- డా॥ దేవులపల్లి పద్మజ, 98496 92414

***నవగ్రహాల్లో రాహువు మరియు కేతుగ్రహాలకు అత్యంత ప్రాముఖ్యత ఉంది. వీరిరువురు ఛాయాగ్రహాలు. అంటే వీరికి శారీరిక అస్థిత్వం కనిపించదు. సముద్రమథనంసమయంలో లభించిన అమృతాన్ని శ్రీమహావిష్ణువు దేవతలకు మాత్రమే పంచే క్రమంలో రాహుకేతువులు కపటంతో అమృతసేవనం చేయటం గమనించిన సూర్యచంద్రులు విష్ణుమూర్తికి సమాచారమిచ్చారు. తక్షణమే శ్రీమహావిష్ణువు వారి శిరస్సులను తన సుదర్శనచక్రంతో ఖండించేశాడు. కాని అమృత సేవనం జరిగిన కారణంగా వారికి మరణం సంభవించదు. ఆ సమయంలో అక్కడే ఉన్న బ్రహ్మదేవుడు ఒక సర్పంయొక్క శరీరాన్ని రాహువుయొక్క శిరస్సుతోను, మరియు సర్పంయొక్క శిరస్సును కేతువుయొక్క రాక్షసశరీరముతోనూ అతికించి జీవితులుగా చేయటమే కాకుండా వారికి నవగ్రహాల్లో స్థానం కల్పించాడు.***

***వారు జీవితులుగా మారిన తరువాత వారి దురవస్థకు కారకులైన సూర్యచంద్రులపై కోపించి వారిని కబళించటానికి ప్రయత్నం చేస్తూనే ఉంటారు. వాటినే మనం గ్రహణాలు అని భావిస్తాం.***

## రాహువు

ఒకనాడు కశ్యపమహాముని తపస్సులో ఉన్న సమయంలో ఆయనభార్య సింహిక వేళకానివేళలో తన మనస్సు లోని కామకోరికను తీర్చమని కోరగా, ఆమె కోరిక తీర్చి రాక్షస గుణాలు కలిగిన కుమారుడు జన్మిస్తాడని శపించాడు. అలా పార్థివనామసంవత్సరంలో, భాద్రపదశుక్లపక్షపూర్ణిమనందు పూర్వాభాద్రనక్షత్రంలో రాహువు జన్మించాడు.

జ్యోతిషచక్రంలో గ్రహాలన్నీ రాహువు మరియు కేతు గ్రహాలమధ్య ఉంటే దానిని కాలసర్పదోషం అంటారు.




రాహువునుండి మొదలై కేతుగ్రహంవరకు మిగిలినగ్రహాలుంటే దానిని సవ్యకాల సర్పదోషం అంటారు. కేతువునుండి మొదలై రాహువువరకు మిగిలిన గ్రహాలుంటే దానిని అపసవ్యకాల సర్పదోషం అంటారు.

రాహువు స్త్రీగ్రహం మరియు తమోగుణప్రధానం. గ్రహమండలంలో అపసవ్యదిశలో ప్రయాణిస్తాడు. ఈయన తల్లిదండ్రులు కశ్యపుడు మరియు సింహిక. భార్య కరాళ. ఈయన సింహవాహనం అధిరోహించి ఉంటాడు. ఈయన దీర్ఘదేహంతో, నల్లనిమేనిఛాయతో, నాలుగుభుజాలతో కనిపించే క్రూరగ్రహం. ఈయన కరవాలం మరియు త్రిశూలం ధరించి ఉంటాడు. జ్యోతిషసిద్ధాంతంప్రకారం ఈయన సంచార సమయము 18సంవత్సరాలు. ఈయన జ్యోతిషచక్రంలో

### రాహుగ్రహస్తోత్రం

**అర్ధకాయం మహావీరం చంద్రాదిత్య విమర్ధనం**
**సింహికా గర్భ సంభూతం తం రాహుం ప్రణమామ్యహం॥**



ఆశలేనివారికి ఆనందము ఎక్కువ



ఏ గ్రహంతో కలసి సంచారం చేస్తుంటే, ఆ గ్రహంయొక్క ఫలితాలను అధికంగా ఇస్తాడు. ఈయన స్వక్షేత్రం కన్యారాశి మరియు నీచరాశి వృశ్చికం, ఉచ్చరాశి వృషభం మరియు సమ క్షేత్రం మేషముగా కలిగి ఉంటాడు. సప్తమదృష్టి కలిగి ఉంటుంది. కల్పనాజగత్తుకు ఆధారంగా ఉంటూ బుధుడు, శుక్రుడు మరియు శనిగ్రహాలతో మిత్రత్వం కలిగి, సూర్యుడు, చంద్రుడు మరియు కుజులతో శత్రుత్వం కలిగి ఉంటాడు. ఈయనకు సర్పశరీరం కలిగి ఉండటంవల్ల విషసంబంధవ్యాపారాలతో అనుబంధం కలిగి ఉంటుంది. తమిళనాట అతిచిన్నశుభకార్యాల్లో కూడా రాహుకాలం నిషేధం ఉంటుంది. అంతు చిక్కని రోగాలకు కారకుడు. గారడీవిద్యలకు, అనూహ్యపరిణామాలకు ఈయన కారకుడు. ఈయన వ్యతిరేకత ఉన్నట్లయితే జాతకునికి బుద్ధిమాంద్యత మరియు ఎముకలబాధలు కలుగుతాయి.



ఈయనకు శుక్ర, శని, బుధులతో మిత్రత్వం మరియు గురు, కుజ, రవి, చంద్ర, కేతువులతో శత్రుత్వం కలిగి ఉంటుంది. రుచుల్లో పులుపు, రంగుల్లో తేనెరంగు, సమిధల్లో గరిక, గ్రహనిలయము పుట్టలు మరియు గుట్టలు, పైశాచికతత్త్వం మొదలైన లక్షణాలు కలిగి ఉంటాడు.

రాహువుయొక్క చెడుఫలితాలను నివారించటానికి జ్యోతిషగ్రంథంలో అనేక పరిహారాలను సూచిస్తారు. దుర్గాదేవి, సరస్వతి, సుబ్రహ్మణ్యేశ్వర, శివారాధనలద్వారా తగు శాంతిని పొందవచ్చు. ఎండుద్రాక్ష, ఖర్జూరాలు, తేనె మొదలైనవి దానం చేయటంవల్ల ఈయన ఉగ్రత్వం తగ్గుముఖం పడుతుంది. వారంలోని ప్రతీరోజులోను ఒకటిన్నరగంటలసమయం రాహుకాలంగా చెప్పబడుతుంది. రాహుకాలంలో దుర్గాదేవిఆలయంలో "ఓం ఐం హ్రీం రాహువే నమః" అను మంత్రంగాని, "ఓం దుం దుర్గాయై నమః" అను మంత్రంగాని జపంచేస్తూ నిమ్మకాయదీపం వెలిగించటం విశేషఫలితాలను అందిస్తుంది. గోమేధికం, వైడూర్యం కలిగిన ఉంగరాలు ధరించటం మంచిది. యువతీయువకులకు వివాహం ఆలస్యం కావటానికి ఈయన వక్రదృష్టి కారణంగా పండితులు చెబుతారు. రాహుమహర్దశలో రామాయణంలోని వివిధసర్గల పారాయణకూడా శాంతి కలిగిస్తుంది. రాహుకవచం, భ్రమరాంబాష్టకం, శ్యామలాస్తోత్రం, నవదుర్గాస్తోత్రం, అర్జునకృత దుర్గాస్తోత్రం వీటిని నిరంతరం పారాయణ చేసేవారికి రాహుగ్రహ అనుకూలత సదా ఉంటుంది. విష్ణుమూర్తి దశావతారాల్లో రాహుగ్రహశాంతినిమిత్తం వరాహావతారధ్యానం మంచి ఫలితాలనిస్తుంది.

## కేతువు

బ్రహ్మదేవుడు భూలోకంలో అధికజనాభాను తగ్గించటానికి మృత్యువు అనే కన్యను సృజించాడు. తనజన్మకారణం తెలుసుకున్న ఆ కన్య కన్నీరు కార్చింది. ఆ కన్నీటినుండి అనేకవ్యాధులు ఉద్భవించాయి. దీనికి నివారణ తెలుసుకునేందుకు ఆమె బ్రహ్మదేవుని ప్రార్థించగా ఆమెను మృత్యుకార్యక్రమం నిర్వర్తించమని బ్రహ్మ ఆదేశించాడు. మరల ఆమె కన్నీరుకార్చగా వాటినుండి కీలకనామసంవత్సరంలో, మార్గశిరకృష్ణ అమావాస్య, మంగళవారంనాడు, మూలానక్షత్రంలో కేతువు జన్మించాడు. ఈయన భార్య చిత్రలేఖ. ఈయనకు గల ఇతరనామాలు శిఖి, ధ్వజ, ధూమ, మృత్యుపుత్ర, అవల.

జ్యోతిషచక్రంలో సవ్య, అపసవ్య కాలసర్పదోషాలకు రాహు మరియు కేతువులు కారణభూతులు. ఈయన దశాకాలం ఏడుసంవత్సరాలు. ఈయనకు మిత్రగ్రహాలు గురు, కుజ, రవి మరియు చంద్రుడు. శత్రుగ్రహాలు శుక్ర, రాహు, శని మరియు బుధుడు. ఈయనకు ఉచ్చరాశి వృశ్చికం మరియు నీచరాశి వృషభం. శత్రుక్షేత్రం కర్కాటకం, సమక్షేత్రం ధనుస్సు, మీనం.

కేతువు పురుషగ్రహం. గ్రహమండలంలో అపసవ్యదిశలో ప్రయాణిస్తుంటాడు. తమోగుణం, క్రూరస్వభావం, వైరాగ్యతత్త్వం, చంచలస్వభావం, అధోదృష్టి, బూడిదవర్ణం, రెండుభుజాలు, గ్రద్ధ వాహనం మొదలైన లక్షణాలు



కేతువు కలిగి ఉంటాడు. ఈయన ముక్తి కారకుడు.

## కేతుగ్రహస్తోత్రం

**పలాశ పుష్ప సంకాశం**
**తారకాగ్రహ మస్తకం**
**రౌద్రం రౌద్రాత్మకం ఘోరం**
**తం కేతుం ప్రణమామ్యహం॥**

కేతుగ్రహ శాంతినిమిత్తమై జ్యోతిషసిద్ధాంతంలో అనేక పరిహారాలు సూచించారు. ముఖ్యంగా శ్రీవిఘ్నేశ్వరుని ఆరాధన సత్ఫలితాలనిస్తుంది. అలాగే శివారాధన కూడా ఉపకరిస్తుంది.

ఉలవలు, ఖర్జూరఫలాలు, కొబ్బరికాయలు, ఉలవలతో చేసిన వంటకము లన్న చాలా ప్రీతి. దానంగా ఇవ్వటం మంచిది.

విష్ణుమూర్తి దశావతారాల్లో కేతుగ్రహశాంతినిమిత్తం మీనావతార ధ్యానం మంచి ఫలితాలనిస్తుంది.

**వేదోద్ధరా విచారమతే సోమక దానవ సంహరణే**
**మీనాకార శరీర నమో భక్తంతే పరిపాలయమాం।**
**రామస్మరణాధన్యోపాయం నహిపశ్యామో భవతరణే**
**రామహరే కృష్ణహరే తవనామ వదామి సదానృహరే॥**

తమిళనాడులోని కీళ్ళపెరుపాళ్లం అనే గ్రామంలో కేతుదేవాలయం కనబడుతుంది. ఈ స్థలాన్ని వనగిరి అని కూడా పిలుస్తారు. ఇక్కడ కేతువు నాగనాథస్వామిని ప్రార్థించి తన తప్పులు క్షమించమని వేడుకోగా పరమేశ్వరుడు సంతసించి వరప్రదానం చేశాడు. అందువల్ల ఇక్కడ కేతువు నాగనాథ స్వామికి నమస్కరిస్తూ నిలబడి ఉంటాడు.

కేతుగ్రహానికి తగు శాంతిపరిహారాలు జరిపించుకున్నచో మంచి ఫలితాలు కలిగి సుఖశాంతులు చేకూరతాయి. భక్తులు గుర్తుంచుకోవలసిన ముఖ్యమైన విషయం ఏమంటే మానవులకు కలిగే అనేక ఈతిబాధలకు కారణం వారు ఆచరించే నిత్యకర్మలు. ధర్మబద్ధమైన, న్యాయమైన కర్మలకు ఎప్పుడూ మంచి ఫలితాలు కలుగుతాయి. మనకు మంచి నడవడిక, మంచి ఆలోచన కలగటానికి దైవకృప అవసరం. అది దైవారాధనలోనే లభిస్తుంది.

నవగ్రహాల్లోని ఏ గ్రహమైనా సత్కర్మలు ఆచరించేవారికి తోడుగా ఉంటారని చెప్పటంలో ఎంతమాత్రము సందేహం లేదు. దుష్టకర్మలవల్ల తాత్కాలిక ఆనందం, విజయం సంప్రాప్తమైనప్పటికీ అవి శాశ్వతంగా నిలబడవు.

శ్రీకాళహస్తిలో రాహుకేతువుల సర్పదోషనివారణపూజలు నిత్యము జరుగుతాయి. వీటిని ప్రతీరోజు అనేకమంది భక్తులు ఆచరిస్తారు. అనేక ఈతిబాధలకు ప్రత్యక్షకారకులైన రాహు మరియు కేతుగ్రహాలకు తగు శాంతి పరిహారాలు జరిపించుకున్నచో మంచిఫలితాలు కలిగి సుఖశాంతులు చేకూరుతాయి.

**సర్వేజనాః సుఖినోభవన్తు.**



చింతలు మానవుని చిత్రవధ చేస్తాయి

# ఆయుర్వేదం

# బెండ ఆహారద్రవ్యమే కాదు ఔషధం కూడా..

- డా॥ చిట్టిభొట్ల మధుసూదనశర్మ, 9000761390



*ప్రకృతి బెండకాయల్లో కేవలం ఆహారపరమైన పోషకాంశాలే కాకుండా వివిధ అనారోగ్యసమస్యలను తగ్గించేందుకు ఉపయుక్తమయ్యే వివిధ రసాయనాలను నిక్షిప్తం చేసి మనకందించింది. దైనందినజీవితంలో ఎదుర్కొనే సాధారణ అనారోగ్య సమస్యలను బెండకాయలను ఉపయోగించి ఎలా పరిష్కరించుకోవచ్చో ప్రస్తుతం తెలుసుకుందాం...*

**కీళ్ళ అరుగుదలవల్ల వచ్చే మోకాలినొప్పులకు:** రోజు ఒకసారి 250మి.లీ.నీటిలో 4,5బెండకాయలని అడ్డంగా ముక్కలుగా కత్తిరించి వేసి 100మి.లీ.నీరు మిగిలేలా మరిగించి దించి చల్లార్చి వడగట్టి త్రాగాలి. ఇదే కషాయాన్ని పుక్కిలి పడుతుంటే నోటిపుళ్ళు, గొంతునొప్పి తగ్గుతాయి.

**చుండ్రుకి :** వారంలో 2,3 సార్లు రాత్రిపూట బెండకాయ గుజ్జుని తలకి పట్టించి ఉదయం తలస్నానం చేస్తుంటే త్వరలో సుగుణం కనిపిస్తుంది.

**కడుపులోమంటకు :** రోజు ఒకసారి 250మి.లీ.నీటిలో 4, 5 లేతబెండకాయలను ముక్కలుగా చేసి వేసి 100 మి.లీ. నీరు మిగిలేలా మరిగించి దించి చల్లార్చి, వడగట్టి అందులో ఒక టీస్పూను తేనె, 2 చిటికెల సైంధవలవణంపొడి కలిపి సేవిస్తుండాలి.

**మొటిమలకు:** రోజు ఒకసారి బెండకాయలగుజ్జును ముఖానికి లేపనం చేసి ఒకట్రెండు గంటలాగి ముఖాన్ని గోరువెచ్చనినీటితో కడుక్కుంటుంటే మొటిమలసమస్య తగ్గుతుంది.

**మధుమేహనియంత్రణకు:** రోజూ రాత్రిపూట చివర్లు కత్తిరించిన 2, 3బెండకాయలను తీసుకొని, నిలువుగా కోసి 200 మి.లీ.నీటిలో వేసి ఉదయం వడగట్టి ఆ నీటిలో ఒకగ్రాము మిరియాలపొడి కలిపి సేవిస్తుంటే చక్కెరవ్యాధి నియంత్రణకు బాగా ఉపయోగపడుతుంది. ఈ ఔషధసేవనవల్ల ఆధునిక కృత్రిమరసాయన ఔషధాలైన ఇన్సులిన్ ఇతరమాత్రల ప్రమాణాన్ని (డోసు) తగ్గించుకోవచ్చు.

**శిరోజాలు బాగా పెరిగేందుకు:** వారానికి రెండుసార్లు 200 మి.లీ. నీటిలో 3, 4 బెండకాయలను ముక్కలుగా చేసివేసి నీళ్ళు జిగురుగా అయ్యేంతవరకు మరిగించి దించి వడగట్టి ఆ నీటిని తలకి పట్టిస్తుంటే కేశాలు దట్టంగా పెరుగుతాయి.

**మలబద్ధకానికి :** 7-10 బెండకాయలను ముక్కలుగా చేసి కాస్త నీరుచేర్చి ఉడికించి చేసిన పేస్టు, 2-3గ్రాముల జీలకర్ర పొడి, 2-3గ్రాముల ధనియాలపొడి, 2-3 చిటికెల ఉప్పు చేర్చి రాత్రి పడుకునేటప్పుడు సేవిస్తే ఉదయం సుఖవిరేచన మవుతుంది.

**యాంటిబయాటిక్స్‌వల్ల దుష్ఫలితాలు రాకుండా:** రోజూ ఒకసారి 100మి.లీ. మజ్జిగలో 50గ్రా. బెండకాయలగుజ్జు, బాగా పండిన ఒక అరటిపండుగుజ్జు కలిపి సేవిస్తుంటే ఎక్కువరోజులు యాంటిబయాటిక్స్ వాడాల్సిన పరిస్థితుల్లో కడుపు, ప్రేవుల పనితీరు దెబ్బ తినకుండా ఆరోగ్యం పరిరక్షింప బడుతుంది. మధుమేహవ్యాధిగ్రస్తులు అరటిపండుగుజ్జుని లేకుండా సేవించవచ్చు.



చింతలులేనివాడు సంతలో కూడ నిద్రపోగలడు


# శ్రీకృష్ణామృతం

ఎవ్వాని చేతిలో ఎల్లవేళలయందు
ఎడబాటు ఎరుగకా ఇమిడి అమరీయుండు
అల్లనల్లన అనంత స్వరఝురులు కురిపించు
అలవోకగా మదిని ఆనందమున ముంచు
వెదురు వేణువు తోడ వేవేల జనములా
చిత్తములు దోచేటి చిని బాలుడితడు

ఏ మూర్తి పూజించ పుణ్య ఫలములచేత
పుడమిగర్భమున ప్రతిదినము పూబాలగాపుట్టి
పూబోణి కరములా బంధములు  దాటుకుని
పూరేకులను మించు కోమలంబైనట్టి
తనువెల్లనూ తాక వనమాలగా కూడు
సుమములన్నియు సొంపుగా ధరియిన్నువాడూ

ఏ చిన్ని బాలునీ పాలమీగడ వంటి
పదముల వ్రాలగా పరుగిడుతునూ వచ్చు
పదియారువేలూ, గోపకాంతలు వెతుకు
పైన ఉన్నట్టి పట్టుబట్టలూ జారినా
వెఱుపు, బెరుకూ లేక బిరబిరా ఏతెంచు
ఆ గోపబాలికల చిత్తచింతలు  తీర్చుచూ
మనసనే మందిరమున కొలువైన వాడూ

ఏమందునోయమ్మ అట్టి బాలునినేను
మాధవుండందునా ముదముమీరగ నేను
గోవిందుడందునా గారంబుతోడనూ
శ్యామవర్ణుడు వాడు సుందరాకారుడూ
నా చిన్నికృష్ణుడూ ననుకాచునెపుడూ




– "అనంత" (కృష్ణసుందరి  సత్తిరాజు)

పాఠం-14

# సంస్కృతం నేర్చుకుందాం..!!

రచన- కీ.శే. మహామహోపాధ్యాయ కాశీ కృష్ణాచార్య

నిర్వహణ- మహామహోపాధ్యాయ సముద్రాల లక్ష్మణయ్య

| | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|
| शाकम् | = కూర-ను | तटाकः | = చెఱువు | प्रार्थना | करोतु | = చేయుఁగాక, చేయనిమ్ము |
| प्रथमम् | = మొదట | तटाके | = చెఱువునందు-లో | | कुरु | = చేయుము |
| अनन्तरम् | = పిమ్మట | अनेकधा | = పలువిధములుగా | | करवाणि | = చేయుదును, గాక, చేయనిమ్ము |

అ) ఈ క్రింది వాటికి తెలుగులోకి అనువాదం చేయండి?

01) तटाकः अत्रास्ति किम्?
02) तटाके प्रथमं स्नानं कुरु।
03) पाकं अहं करवाणि।
04) अग्रजः शाकानि करोतु!
05) यूयं स्नानं अकुरुत खलु!
06) वयं भोजनमपि अकुर्म।
07) ते इदानीं तटाके स्नानं कुर्वन्ति।
08) बत! ते तटाके न सन्ति।
09) बालकास्तटाके दौष्ट्यं कुर्वन्ति।
10) तथावा, अत्र किञ्चित् एहि।

### అ) జవాబులు

01) ఇక్కడ చెఱువు ఉన్నదా?
02) చెఱువునందు మొదట స్నానము చేయుము.
03) నేను వంట చేయుదును.
04) అగ్రజుడు కూరలను చేయుగాక!
05) మీరు స్నానమును చేసితిరి కదా!
06) మేము భోజనము కూడ చేసితిమి.
07) వారు ఇప్పుడు చెఱువునందు స్నానము చేయుచున్నారు.
08) అహో! వారు చెఱువులో లేరు.
09) పిల్లలు చెఱువులో అల్లరి చేయుచున్నారు.
10) అలాగా, కొంచెం ఇక్కడకు రమ్ము.

ఆ) ఈ క్రింది వాటికి సంస్కృతంలోకి అనువాదం చేయండి?

01) నీవల్లరి చేయవద్దు.
02) నేనల్లరి చేయుచున్నానా?
03) అక్కడ పిల్లలు అల్లరి చేయుచున్నారు.
04) వీరు చెఱువులో స్నానము చేయుచున్నారు.
05) మొదట నేను కూర చేసినాను.
06) తరువాత వారు వంట చేసినారు.
07) కూరనెవరు చేసిరి?
08) కొందఱు బ్రాహ్మణులు.
09) వారు పలు విధములుగాఁజేసిరి.
10) రేపు నీవును అలాగు చేయవలెను.


### ఆ) జవాబులు


01) त्वं दौष्ट्यं मा कुरु।
02) किमहं दौष्ट्यं कुर्वन्नस्मि?
03) तत्र बालकाः दौष्ट्यं कुर्वन्ति।
04) एते तटाके स्नानं कुर्वन्ति।
05) प्रथममहं शाकमकरवम्।
06) अनन्तरं ते पाकमकुर्वन्।
07) शाकं कः अकरोत्?(के अकुर्वन्?)
08) केचन ब्राह्मणाः।
09) ते अनेकधा अकुर्वन्।
10) श्वः त्वमपि तथैव कुर्याः।

చిత్ర కథ


# మూగజీవులకి ముక్తి

కథ- శ్రీ డి.శ్రీనివాసదీక్షితులు
చిత్రాలు- శ్రీ కె.తులసీప్రసాద్




11 ముందుగా సర్పం నదిలో స్నానం చేసి బిల్వదళాల్ని తెచ్చి శివలింగంమీద పెట్టి పూజిస్తోంది. తర్వాత ఏనుగు తొండంతో నీళ్లు తెచ్చి...
12 నాకంటే ముందుగా ఎవరో వచ్చి శివపూజ చేస్తున్నారు. ఈ ఆకుల్ని తీసేసి అభిషేకం చేస్తాను.
13 రోజూ పూజచేస్తూ ఆ మూగజీవులు పరస్పరం శత్రువులు అయ్యాయి. పాము అనుకుంది...
14 నా తర్వాత వచ్చి ఈ ఏనుగు పూజ చేస్తోంది. పగ తీర్చుకోవాలి.
15 తర్వాత పాముని కనిపెట్టి ఏనుగు అనుకుంది...
16 నాకంటే ముందుగా ఈ పాము పూజ చేస్తోందా... దీని పని పట్టాలి.
17 మర్నాడు తొండంతో ఏనుగు లింగాన్ని అభిషేకిస్తుంటే ఆ తొండంలోకి దూరింది పాము. ఏనుగు తొండాన్ని బండకేసి బాదుతూ...
18 చావు.. చావు... నా పూజని భగ్నం చేస్తావా...
19 ఏనుగు కుంభస్థలానికి చేరింది పాము. ఏనుగు బండకేసి తలని బాదుకుంది!
20 అబ్బో.. అబ్బో...
21 అమ్మో.. అమ్మో...
22 పూజకోసం పోటీపడి పామూ ఏనుగూ రెండూ మరణించాయి. శివపార్వతులు ప్రత్యక్షమయ్యారు.
23 మీకు ముక్తిని అనుగ్రహిస్తున్నాం. మూగజీవులైన మీపేరుతో.. ఈ క్షేత్రం శ్రీకాళహస్తిగా ప్రసిద్ధి చెందుతుంది.
సర్వేజనాః సుఖినో భవన్తు!

విశ్వదాభిరామం — వేమన పద్యసూక్తి



## పిరికివాడిధైర్యం

మేడిపండు జూడ మేలి మై యుండును;
పొట్ట విచ్చి చూడ పురుగు లుండు;
పిరికివానిమదిని బింక మీలాగురా!
విశ్వదాభిరామ! వినుర వేమ!

**అర్థాలు:** మేలిమి= చొక్కపు బంగారం; విచ్చి= విప్పి; పిరికివాడు= భయపడువాడు; మదిని= మనస్సులో; బింకము= ధైర్యం; ఈలాగు= ఈతీరుగా ఉంటుంది.

**భావం:** మేడి(అత్తి)పండు పైకి బంగారంలాగా మెరుస్తూ కనబడుతుంది. పొట్ట విప్పిచూస్తే లోపల పురుగులుంటాయి. పిరికివాడి మనసులో ధైర్యం కూడ ఈలాగే ఉంటుంది. (పిరికివాడు పైకి ధైర్యంగా కనిపించినా, అతడిమనసులో రకరకాలభయాలు ఉంటాయి.)

బ్రౌను సేకరించిన ప్రతుల్లో బెరుకువాని అని కన్పిస్తుంది.

**వివరణ:** మెరిసేదంతా బంగారం కాదు అని సామెత. దుర్మార్గులు పైకి ఎంతో మంచివారుగా కనిపిస్తారు. గొప్పసంస్కారభావాలు వ్యక్తం చేస్తూ మాట్లాడతారు. కాని, వారికి మనసులో కులం, వర్గం మొదలయిన నీచమైన ఆలోచనలు ఉంటాయి. అటువంటివారిని నమ్మి మోసపోగూడదు. మానవుడు అంతరంగంలో కూడ ఉత్తమలక్షణాలు కలిగి ఉండాలి అని భావం.

– కీ.శే. విద్వాన్ కట్టా నరసింహులు

# 74 వైకుంఠపాళి

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 1 | ■ | 2 | | 3 | | 4 | | ■ |
| | ■ | | ■ | | ■ | | ■ | 5 |
| 6 | | ■ | 7 | | | ■ | 8 | |
| | ■ | 9 | ■ | | ■ | 10 | ■ | |
| ■ | 11 | | | ■ | 12 | | | ■ |
| 13 | ■ | | ■ | 14 | ■ | | ■ | 15 |
| 16 | | ■ | 17 | | | ■ | 18 | |
| | ■ | 19 | ■ | | ■ | 20 | ■ | |
| | ■ | 21 | | ■ | 22 | | | |

**నిర్వహణ** శ్రీ కోగంటి వేంకట అప్పలాచార్యులు

### అడ్డం

2)అర్జునునివల్ల చిత్రాంగదకు కల్గిన కుమారుడు (6); 6)రంగు(2); 7)సూర్యుడు(3); 8)రక్షణ, ఆశ్రయం అను అర్థాలను ఇచ్చే పదం(2); 11)బలిచక్రవర్తి భార్య(3); 12)కట్టెలకు గల మరియొక పదం(3); 16)మత్స్యము(2); 17)అష్టవసువులలో ఒకడు(3); 18)ధ్వని(2); 21)ప్రాచీనుని భార్య. సంయాతి తల్లి(2); 22)పశ్చిమ దిక్పాలకుడు(4)

### నిలువు

1)తుంబురుని వీణ(4); 2)పాఠశాల(2); 3)బలిచక్రవర్తిని పాతాళానికి పంపినవాడు(4); 4)మాట(2); 5)ఒక అప్సరస(3); 9)త్రాడు(3); 10)కుబేరుని వాహనము(4); 13)కృష్ణుని చెలికాడు(4); 14)ఒక అగ్ని, ఇతని భార్య ముదిత (3); 15)కద్రువ కుమారుడు(4); 19) శిఖండిని భర్త, తలక్రిందులైంది(2); 20)వాడు పదానికి బహువచనము(2)

జవాబులు ఈ సంచికలోనే ఉన్నాయి. అన్వేషించి... సరిచూసుకోండి.
- ప్రధాన సంపాదకుడు



ఎంతఉన్నా చాలదనే బాధను ఎవ్వరూ తీర్చలేరు




# వంశోద్ధారకులు

- శ్రీ పాండ్రంకి సుబ్రమణి,
99088 14674

సుధాకరం, పుష్పరాజ్, మనోహర్ ముగ్గురూ ఒకే కార్యాలయంలో పనిచేస్తున్న సహోద్యోగులు. బడిరోజుల్నాటి నుంచి చేరువున్న మిత్రులు కూడాను. అనుకోకుండా ఒక్కొక్కరూ రెండేసి ఇండ్లస్థలాలను కొన్నారు. పిదప కార్యాలయంవాళ్లు మంజూరుచేసిన ఋణంతో ఒక తుండునేలపైన ఇల్లు కట్టుకున్నారు.

కొన్నాళ్ళతరువాత సుధాకరం ఒకరోజు అటువేపున్న మిత్రులఇండ్ల ఆవలివైపు చూసి దిగ్భ్రాంతి చెందాడు. కారణం- ఇద్దరి మిగులు ఉత్తస్థలాల్లోనూ నిటారుగా గిడ్డంగులు లేచాయి. వాటిలో అంగళ్లులేచాయి. సరుకులవ్యాపారాలు సాగుతున్నాయి. అంటే ఇద్దరూ రెండుచేతులా బాడుగసొమ్ము అందుకుంటున్నా రన్నమాట.

ఒకరోజు తీరుబడిగా పుష్పరాజ్, మనోహర్‌లు ఇద్దరూ కలసి సుధాకరం ఇంటికి వెళ్లారు. అక్కడి దృశ్యం చూసి వీళ్ళు కూడా దిగ్భ్రాంతి చెందారు. చూపు ఆనినంతమేర చుట్టూరా తోటలే! కాని "మధ్యమధ్యన బురదమయంగా ఉన్న ఆ నీటిగుంత లెందుకూ దిష్టిబొట్టుల్లా?"అని అడిగారు. "అవి దిష్టిబొట్టులు కావు. మామూలు నీటిగుంతలు కావు. ఇంకుడుగుంతలు" అన్నాడు సుధాకరం. "నీకు అవెందుకూ! మీ ఇంటిచుట్టూ ఇప్పటికే మూడు బావులున్నాయిగా!" అన్నారు ఆ ఇద్దరుమిత్రులు.

"మాకు బావులున్నమాట వాస్తవమే కాని బావుల్లోకి నీరు ఊరాలంటే భూగర్భజలం ఉండాలి కదా! నేలతల్లి కడుపున జలబిందువు చేరాలంటే వర్షపునీటిని నేలతల్లి కడుపులోకి అనవరతం పోనిస్తూనే ఉండాలిగా! అప్పుడే కదా మలమల మాడే ఎండాకాలంలో మనిషి నీటిఎద్దడికి లోనుకాకుండా బ్రతికి బట్టగట్టగలిగేది" అన్నాడు సుధాకరం.

ప్రస్తుతానికి ఈ నీళ్లు మా కుటుంబానికి సరిపోతాయి. మరి రేపటిమాట? పెరిగి పెద్దయిన తరువాత మా పిల్లలకు సరిపోవద్దూ? ప్రకృతిసిద్ధమైన జలాశయం నేలతల్లేగా! ఇప్పుడు ఆకాశం దయతో కురిపిస్తున్న నీటిచుక్కల్ని అలక్ష్యంగా ఉండి పోయి పొదుపు చేయడం మానుకుంటాం. రేపేమో-ఋణాలు తీసి, లక్షలు ఖర్చుపెట్టి బోరుబావులు త్రవ్వుతాం. కాని వాటిలో నీరు పడటం లేదని గగ్గోలు పడిపోతుంటాం. అంతేకదూ!

ఈ పనంతా మాకు మేమే చేసి ముగించాం. అయినా ఇదంతా వాళ్లకోసం కాదూ! అలాంటప్పుడు ఆపాటి శ్రమదానం చేయలేరా! అందులో వాళ్ళకు మంచి-చెడూ, కష్టమూ-సుఖమూ అన్నవి ఈ తరుణానే కదా నేర్పించాలి. తాకీతాకని విధంగా మనం చిన్నప్పుడు నేర్చుకున్న పద్యాన్ని మరచిపోయారా ఏమిటి? 'చిరుతప్రాయమందు చేరనేర్చిన విద్య, ఒంటబట్టి బ్రతుకునంటి వచ్చు' " అన్నాడు.

'మిత్రులిద్దరూ ఔననలేక కాదనలేక తేరిపార చూస్తూ నిల్చున్నారు. రేపటిమనిషి బ్రతుక్కి బంగారుబాట వేయాలంటే రెండుచేతులా సంపాదనుంటే మాత్రం చాలదు కదా! ఏరీ ఆనాడు రాజ్యాలేలిన రాజులు నగరాలను పరిపాలించిన సంస్థానాధీశులు? రాళ్ళలో రాళ్ళయి మట్టిలో మట్టయి కలసి పోలేదూ!



# బాలవినోదం

పిల్లలూ... మీ మేధకు పదును పెట్టండి....

నిర్వహణ: పి. ఉషాలక్ష్మి, 75692 17199

## కదంబం

### చతుర్దశ భువనాలు

01) అతలలోకం
02) వితలలోకం
03) సుతలలోకం
04) తలాతలలోకం
05) మహాతలలోకం
06) రసాతలలోకం
07) పాతాళలోకం
08) భూలోకం
09) భువర్‌లోకం
10) సువర్(స్వర్గం) లోకం
11) మహర్‌లోకం
12) జనాలోకం
13) తపస్‌లోకం
14) సత్యలోకం

### పిల్లలూ..జతచేయండి!!

| | |
|---|---|
| 1) కౌసల్య | అ) లక్ష్మణుని భార్య |
| 2) అంజని | ఆ) సుగ్రీవుని అన్న |
| 3) విభీషణుడు | ఇ) ఆంజనేయుని తల్లి |
| 4) ఊర్మిళ | ఈ) రావణుని తమ్ముడు |
| 5) వాలి | ఉ) శ్రీరాముని తల్లి |

జవాబులు: 1-(ఉ); 2-(ఇ); 3-(ఈ); 4-(అ); 5-(ఆ)

### మీకు తెలుసా?



1) శత్రుఘ్నుడు ఎవరి కొడుకు ?
2) విదురుడు ఎవరి తమ్ముడు?
3) కుచేలుడు ఎవరి స్నేహితుడు?
4) ద్రౌపది అన్న ఎవరు?
5) శ్రీకృష్ణుడు చిటికెనవ్రేలుమీద ఏ కొండను ఎత్తాడు?
6) జాంబవతి ఎవరి కూతురు?
7) అడవులలో సీతాదేవిని చేరదీసినది ఎవరు?

జవాబులు:
1) సుమిత్ర
2) ధృతరాష్ట్రుడు
3) శ్రీకృష్ణుడు
4) ధృష్టద్యుమ్నుడు
5) గోవర్ధనం
6) జాంబవంతుడు
7) వాల్మీకిమహర్షి

### కనుక్కోండి


ఈ అక్షరాలతో ఒక సూక్తి వస్తుంది...

క ග యు లి ప్ర దై క్ష త్య వం క రు శ్రీ టే వేం శ్వ డే

జవాబు:
కలియుగ ప్రత్యక్షదైవం శ్రీవేంకటేశ్వరుడే

### చిత్రలేఖనం

ఈ క్రింది బొమ్మకు రంగులు వేద్దామా...



ఈ పక్కన ఉన్న బొమ్మను క్రింది గడులలో గీయండి...

Printed by Sri P.Ramaraju, M.A., and Published by Dr. K.Radharamana, M.A., M.Phil., Ph.D., on behalf of Tirumala Tirupati Devasthanams and Printed and Published at Tirumala Tirupati Devasthanams Press, K.T.Road, Tirupati - 517 507. Editor: Dr.V.G.Chokkalingam, M.A., Ph.D.



తిరుమల తిరుపతి దేవస్థానములు

# తిరుపతి శ్రీ కోదండరామస్వామివారి బ్రహ్మోత్సవం

## 2022 మార్చి 30 నుండి ఏప్రిల్ 07 వరకు

**30-03-2022**
బుధవారం
పగలు: ధ్వజారోహణం
రాత్రి: పెద్దశేషవాహనం

**31-03-2022**
గురువారం
పగలు: చిన్నశేషవాహనం
రాత్రి: హంసవాహనం

**01-04-2022**
శుక్రవారం
పగలు: సింహవాహనం
రాత్రి:
ముత్యపుపందిరివాహనం

**02-04-2022**
శనివారం
పగలు: కల్పవృక్షవాహనం
రాత్రి: సర్వభూపాలవాహనం

**03-04-2022**
ఆదివారం
పగలు: పల్లకీలో
మోహినీఅవతారోత్సవం
రాత్రి: గరుడవాహనం

**04-04-2022**
సోమవారం
పగలు:
హనుమద్వాహనం
రాత్రి: గజవాహనం

**05-04-2022**
మంగళవారం
పగలు: సూర్యప్రభవాహనం
రాత్రి: చంద్రప్రభవాహనం

**06-04-2022**
బుధవారం
పగలు: రథోత్సవం
రాత్రి: అశ్వవాహనం

**07-04-2022**
గురువారం
పగలు: చక్రస్నానం
రాత్రి: ధ్వజావరోహణం

SAPTHAGIRI (TELUGU) ILLUSTRATED MONTHLY Published by Tirumala Tirupati Devasthanams printing on 20-02-2022 and posting at Tirupati RMS. Regd. with the Registrar of Newspapers for India under RNI No.21139/1970. Postal Regd.No.TRP/155/2021-2023 "Licenced to post without prepayment No.PMGK/RNP/WPP-04(1)/2021-2023" posting on 5th of Every Month.

## తరిగొండ శ్రీలక్ష్మీనరసింహస్వామివారి బ్రహ్మోత్సవాలు
## (10-03-2022 నుండి 18-03-2022 వరకు)

